www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

7th ANNIVERSARY 22nd October, 2025

సంపుటి 08, సంచిక: 337 | శనివారం | 08-11-2025 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00







ప్రజాపక్షం
శనివారం, 08 నవంబరు

# కార్మికుల ప్రాణాల పట్ల నిర్దయ

సిగాచి ఇండస్ట్రీస్‌లో పేలుడు వ్యవహారంలో మృతులు కుటుంబాలకు, క్షతగాత్రులకు నాలుగు నెలల దాటినా పూర్తి స్థాయి పరిహారం ఇవ్వకపోవడం అత్యంత విషాదం. అంతటి ఘోర దుర్ఘటనలో బాధ్యులుగా యాజమాన్య ప్రతినిధులలో ఒక్కరిని కూడా అరెస్టు చేయని విషయం ఇటీవల హైకోర్టు విచారణ సందర్భంగా వెలుగు చూసింది. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జూన్ 29వ తేదీన సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భారీ పేలుడు సంభవించింది. మృతుల్లో అనేక మంది శరీరాలు పేలుడు దాటికి తునాతునకలై, మాడి మసై పోయిన దృశ్యాలు తలుచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది. వారిలో అనేక మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మృతుల కుటుంబాల గోస అంతా ఇంతా కాదు. ప్రతిఒక్కరిదీ ఒక వ్యథార్థ గాథ.

నాడు ఘటనాస్థలిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ తదితరులు పరిశీలించారు. కంపెనీ తరుపున కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియాగా ఇస్తారని ప్రకటనలు వెలువడ్డాయి. అంతేగాక, రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురితో ఒక ఉన్నతస్థాయి కమిషన్‌ను ఏర్పాటు చేసి నెల రోజుల్లో ఘటనకు కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంత జరిగినా ముందుకు సాగలేదు.

దీనిపై కె.బాబురావు అనే రిటైర్డ్ సైంటిస్ట్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. దుర్ఘటనలో 54 మంది మరణించగా, 28 మంది గాయపడ్డారని, పరిహారం చెల్లింపు, దర్యాప్తు జాప్యాల నేపథ్యంలో సిట్ వేయాలని కోరారు. దీనిపై హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఎదుట మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా వెల్లడైన అనేక అంశాలు కార్మికుల పట్ల నేరపూరిత నిర్లక్ష్యాన్ని, దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను బైటపెట్టాయి.

మృతుల కుటుంబాలలో ఎంత మందికి యాజమాన్యం కోటి పరిహారం ఇచ్చారు? పరిశ్రమ ఎవరి ఆధీనంలో ఉంది? దర్యాప్తు ఎందుకు ఆలస్యంగా సాగుతోంది? అని హైకోర్టు మౌలిక ప్రశ్నలను సంధించింది. దీనిపై ప్రభుత్వం తరపు నుంచి వచ్చిన సమాధానాలు ఉన్నత న్యాయస్థానాన్ని సంతృప్తి పరచ లేకపోయాయి. కోటి రూపాయల పరిహారం ఇస్తామన్న ప్రకటనలు చేసినప్పటికీ... మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల మధ్యనే పరిహారం అందజేసినట్లు కోర్టుకు ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ తెలియజేశారు. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, ప్రమాదంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సైతం మరణించారని చెబుతుండగా హైకోర్టు జోక్యం చేసుకొంది. వైస్ ప్రెసిడెంట్ మరణించినంత మాత్రాన మిగిలిన బాధ్యులను వదిలేస్తారా? అని ఘాటుగానే ప్రశ్నించింది. ఇప్పటి వరకు ఒక్కరిని కూడా అరెస్టు చేయకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది. నిపుణుల కమిటీ నివేదిక వారం క్రితమే ప్రభుత్వానికి అందిందని అడిషనల్ ఎజి కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు.

పేలుడు జరిగిన పరిశ్రమలో దుర్ఘటనకు ముందు సరైన నియమ నిబంధనలు, రక్షణ చర్యలు పాటించకపోవడం, ప్రభుత్వ సంస్థల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు బైటపడ్డాయి. ఆ తరువాత కూడా పరిహారం, బాధ్యుల అరెస్టుల విషయంలో ఆలస్యమవడాన్ని ప్రభుత్వ వ్యవస్థల అలసత్వం, సాచివేత, నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సిగాచి దుర్ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కార్మిక చట్టాలు, రక్షణ చర్యలు, ఉద్యోగ భద్రత, వలస కార్మికులు, కనీస వేతనాలు తదితర ప్రశ్నలు దేశవ్యాప్తంగా మరోసారి తెరపైకి వచ్చాయి. ముఖ్యంగా నాలుగు కార్మిక కోడ్‌లు అమలులోకి రాకముందే, కార్మికులు సాధించుకున్న హక్కులను తుంగలో తొక్కుతున్న వైనానికి ఇదొక నిదర్శనం. వాటికి ప్రభుత్వ విభాగాలు వంత పాడుతున్నాయి. ఘటన తీవ్రతను చల్లార్చేందుకు ప్రభుత్వాలు, యాజమాన్యాలు, వ్యవస్థలు అప్పటికప్పుడు ఆపత్కాల మొక్కుల మాదిరిగా సాంత్వన కలిగించే ప్రకటనలు చేస్తున్నాయి. రోజులు గడుస్తున్న కొలది వాటి అమలు జావగారిపోతున్నది. ప్రకటనలు డొల్ల వాగ్దానాలేనని తేలిపోతున్నాయి. కార్మికుల జీవితాలు గాలిలో దీపాలుగా మారాయి. దీనికి కారకులు ఎవరు?

నాలుగు కార్మిక కోడ్‌లను వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దొడ్డిదారిని వాటిని అమలు చేసేందుకు వేర్వేరు రూపాలలో ప్రస్తుత చట్టాలను సవరిస్తున్నాయి. ఆ కోవలోనే రాష్ట్రంలో కూడా రోజుకు ఎనిమిది పనిగంటల విధానాన్ని సవరించి, పదిగంటలకు పెంచుతూ కార్మిక శాఖ జిఒ 282ను జారీ చేసింది. సులభతర వాణిజ్యం అనే కార్పొరేట్ పరిభాషతో ఈ మార్పు తీసుకువచ్చింది. రాష్ట్రానికి పెట్టుబడుల పేరుతో గ్లోబల్ వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఐటి కంపెనీలకు అనేక రాయితీలు, భూములు దఖలు చేస్తూ బడా పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీ పరుస్తున్నారు. పెట్టుబడులు రావడం, మనవారికి ఉపాధి కల్పించడం మంచిదే. అదే సమయంలో చట్టాలను ప్రైవేటుకు అనుకూలంగా, జవాబుదారీ రాహిత్యంగా మారిస్తే, ఎలా ఉంటుందో మనం చూస్తూనే ఉన్నాం. సిగాచి ఉదంతంలో,అలాగే టాటా హస్తగతం చేసుకున్న ఎయిరిండియా విమానం అహ్మదాబాద్‌లో దుర్ఘటనకు ఎవరు బాధ్యులు, ఎంతమంది అరెస్టయ్యారు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# జూబ్లీహిల్స్ ఫలితం 'గేమ్ ఛేంజర్' కానుందా?



ఎస్.కె. జకీర్

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాల రూపు రేఖలు మార్చుతుందా? తెలంగాణ బలాబలాలు మారతాయా? 119 నియోజకవర్గాల్లో ఒకటయిన జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలిచినా, ఓడినా ఒరిగేదేమిటి? మొత్తం తెలంగాణకు 'గేమ్ ఛేంజర్' ఎలా అవుతుంది?

బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జరుగుతున్న ఈ ఎన్నిక ఎందుకింత ఉత్కంఠ రేపుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వివిధ కారణాల వలన ఉప ఎన్నికలు జరిగినా ఇంత ఉష్ణోగ్రత ఇదివరకు లేదు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని సాగిస్తున్న ప్రచార సరళి వల్ల ఈ సమస్య వచ్చింది. బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన అనంతరం జరుగుతున్న రెండవ ఉప ఎన్నిక ఇది. కంటోన్మెంటు ఉపఎన్నికల సందర్భంగా ఈ హడావుడి లేదు. ఆ ఎన్నిక నోటిఫికేషన్ రావడం, ఎన్నిక జరిగిపోవడం ఎవరికీ గుర్తు లేదు. జూబ్లీహిల్స్‌లో గెలవకపోతే ఇక తమ పార్టీ పరువు పూర్తిగా గంగలో కలుస్తుందని, పార్టీ మనుగడ కూడా కష్టమన్న అంచనాకు కెసిఆర్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇకపై జరిగే ఏ ఎన్నికల్లోనూ సరిగ్గా పెర్ఫామ్ చేయలేమని, పార్టీ శ్రేణుల్లో విశ్వాసం కలిగించలేమన్న భయాందోళనలతో బిఆర్ఎస్ హైకమాండ్ గడుపుతోంది.

"500 రోజులు ఆగితే కెసిఆర్ ప్రభుత్వం వస్తుంది. హైడ్రా బాధితులకు న్యాయం చేస్తాం. కెసిఆర్ హయాంలో ఎక్కడచూసినా కట్టడాలే కనిపిస్తాయి. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాం. అమెరికా వైట్హౌస్ ను తలదన్నేలా రాష్ట్ర సచివాలయం, దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు ఇలా ఎన్నో నిర్మించాం. రేవంత్‌రెడ్డి రెండేళ్లలో కూలగొట్టడమే తప్ప కొత్తగా నిర్మించిందేమీ లేదు. పేదల ఇళ్ల పైకి బుల్డోజర్లు పంపి కూలగొట్టి, వారికి నీడలేకుండా చేశారు"అని కెటిఆర్ ప్రచారం చేస్తున్నారు. 500 రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలా ఏర్పడుతుందో కెటిఆర్, కెసిఆర్‌కు తప్ప మరెవరికీ తెలియదు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 1130 రోజులకు పైగా గడువు ఉంది. 2028 చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కానీ అంతకు ముందే కెసిఆర్ సిఎం కానున్నారన్న ప్రచారం వెనుక 'రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర' ఉందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు.

హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేసి, ప్రభుత్వంపై జనంలో వ్యతిరేకతను తీసుకురావడానికి బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం అంతగా ఆకట్టుకోవడం లేదు. కెటిఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న కాలంలో ఆయన హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై చేసిన వ్యాఖ్యలు, నిర్దాక్షిణ్యంగా అలాంటి కట్టడాల ను కూల్చిపారేస్తామని చేసిన భీషణ ప్రతిజ్ఞతో కూడిన వీడియోలను కాంగ్రెస్ పార్టీ బయటపెట్టింది. దీంతో బిఆర్ఎస్ ఆత్మరక్షణలో పడుతోంది.

ఏడుగురు మంత్రుల మీద వేటు పడనున్నట్లు, తనకు నచ్చని మరికొందరిపై ముఖ్యనేత కత్తిగట్టినట్టు, జూబ్లీహిల్స్ ఎన్నికల తర్వాత వారిపై వేటువేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు నవంబర్ 11 తర్వాత రాష్ట్ర మంత్రివర్గ ప్రక్షాళన చేయాలని ఢిల్లీ కాంగ్రెస్ నిర్ణయించినట్టు ఒక ప్రచారాన్ని బిఆర్ఎస్ సోషల్ మీడియా ఉధృతం చేసింది. ఇందుకు గాను తాడు బొంగరం లేని కథనాలను వండి వార్చుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు దాదాపు చేజారినట్టేనని, ఎన్నికల ఫలితాలతో ప్రమేయం లేకుండా మంత్రివర్గ ప్రక్షాళన ఖరారు చేసినట్టు ఢిల్లీ కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్టుగా ప్రధాన ప్రతిపక్ష శిబిరం టక్కు టమార విద్యలతో ప్రచార కాండ సాగిస్తున్నారు. తనతో విభేదించే మంత్రులను, భవిష్యత్తులో తన సీటుకు ముప్పుగా మారే అవకాశం ఉందనుకున్న మంత్రులను సిఎం టార్గెట్ చేసినట్టు ఒక ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా అవినీతికి సంబంధించిన పక్కా ఆధారాలు తెప్పించి ఒక్కో మంత్రిని టార్గెట్ చేస్తూ ఫిర్యాదులు రూపొందించి, ఒక కాపీ కాంగ్రెస్ అధిష్ఠానానికి అందజేస్తూ ముఖ్యమంత్రి కార్యం నడిపించినట్టుగా కెటిఆర్ సోషల్ మీడియా చెబుతోంది. ఉత్తర తెలంగాణకు చెందిన ఇద్దరు బిసి మంత్రులకు ఉద్వాసన ఖాయమని ప్రచారం నడిపిస్తూ సిఎంకు, మంత్రులకు మధ్య గ్యాప్ తీసుకురావడానికి బిఆర్ఎస్ విఫలయత్నం చేస్తోంది. చివరకు డిప్యూటీ సిఎం పదవికి కూడా బిఆర్ఎస్ సోషల్ మీడియా ఎసరు పెట్టింది.

గజ్వేల్ సభ తెలంగాణ గేమ్ ఛేంజర్ కానుందంటూ గత ఏప్రిల్ లో బిఆర్ఎస్ శ్రేణుల్లో జరిగిన ప్రచారం బూటకమని తేలిపోయింది. ఆ సభ తర్వాత పార్టీ పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ తో చెలరేగిన మంటలు ఇప్పుడప్పుడే చల్లారే పరిస్థితులు లేవు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అభియోగంపై ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తన ఎమ్మెల్సీ పదవికి ఆమె రాజీనామా చేశారు.ఆమె రాజీనామా ప్రస్తుతం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వద్ద పెండింగులో ఉన్నది.జాగృతి జనం బాట పేరిట కవిత జిల్లాలు పర్యటిస్తున్నారు.అవకాశం దొరికినప్పుడల్లా ఆమె తన తండ్రి, పార్టీ అధ్యక్షుడు కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పై ప్రత్యక్షంగా, పరోక్షంగా విరుచుకుపడుతూనే ఉన్నారు. ఆమె గాయపడిన సింహం వలె గర్జిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా కెసిఆర్ గజ్వేల్ సభలో పెద్దఎత్తున విరుచుకు పడ్డారు. కానీ బిజెపిపై చేయవలసినంతగా దాడి చేయలేదన్నది కవిత విమర్శ. అంతే కాకుండా తాను జైలులో ఉన్నప్పుడు పార్టీని బిజెపిలో పార్టీ విలీనానికి కుట్ర చేశారని ఆమె చేసిన ఆరోపణలు జూబిలీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ కు ఆయుధంగా మారాయి.



"మళ్ళీ అధికారం మాదే" అనే నినాదం ఆకర్షణ కోల్పోయింది. ఇందుక్కారణం ఎన్నికలు జరగడానికి మరో మూడేండ్ల వ్యవధి ఉన్నది. ఈ లోగా అనూహ్యమైన రాజకీయ పరిణామాలు చోటు చేసుకొని 'మధ్యంతర' ఎన్నికలు జరిగే అవకాశాలు లేవు. రేవంత్ ప్రభుత్వం పూర్తి కాలం కొనసాగదన్నది బిఆర్ఎస్ నాయకుల ఊహ. ఒక ఆశ. కేసీఆర్ ఫార్మ్ హౌజ్ నుంచి 'జన జీవన స్రవంతి' లోకి రానంతవరకు ఆ పార్టీ శ్రేణులకు 'కిక్కు' రాదు. తన కుమారుడు కెటిఆర్ పార్టీని సమర్థంగా నడిపించలేకపోతున్నట్టుగా కొందరు సన్నిహితుల దగ్గర కెసిఆర్ కామెంటు చేసినట్టు ఒక ప్రచారం ఉన్నది. అయితే కెటిఆర్ ప్రాధాన్యాన్ని తగ్గించలేరు, అలాగని మాజీమంత్రి హరీశ్ రావుకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించలేరు. అటు కవిత తన దారి తాను చూసుకున్నారు.ఈ వాతావరణంలో తీవ్ర మానసిక ఒత్తిడికి కెసిఆర్ గురవుతున్నారు. దీంతో ఆయన ఆరోగ్యమూ దెబ్బ తింటున్నట్టు మానసిక వైద్యులంటున్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాలను శాసిస్తుందని కానీ,మొత్తం రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని, 'గేమ్ ఛేంజర్' కానుందని కానీ ఎవరూ అనుకోవడం లేదు. తమ హయాంలో జరిగిన తప్పిదాలు, లోటు పాట్లు, ప్రజల నుంచి తాము ఎందుకు దూరమయ్యామో, ప్రజలు తమకు ఎందుకు దూరమయ్యారో కెసిఆర్ లేదా కెటిఆర్ వివరణ ఇవ్వవలసి ఉన్నది. "మమ్మల్ని అధికారానికి దూరం చేసి ఏమి కోల్పోయారో ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ప్రజల్ని మోసంచేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది"అంటూ కెటిఆర్ పదేపదే మాట్లాడి ప్రజల్ని అవమానిస్తున్నారు.

ముందుగా అసలు బిఆర్ఎస్ జాతీయ పార్టీయా, ప్రాంతీయ పార్టీయా అన్నది కెసిఆర్ స్పష్టం చేయవలసి ఉంటుంది.పదేండ్ల కాలంలో దాదాపు 7 లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేయవలసి వచ్చిందో, రైతు భరోసా తదితర పథకాల రూపంలో వేల కోట్ల రూపాయలను పుట్నాల వలె ఎందుకు పంచవలసి వచ్చిందో, ధనిక రాష్ట్రం కొన్నేండ్ల వ్యవధిలోనే ఎందుకు అప్పుల ఊబిలో కూరుకుపోయిందో కెసిఆర్ లేదా కెటిఆర్ జవాబు చెప్పడం లేదు. 'ధరణి' పేరిట జరిగిన 'భూ దోపిడీ',లక్షలాది ఎకరాల గుటకాయ స్వాహా, కాళేశ్వరం అక్రమాలు, ఫార్ములా ఈ రేసు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల గోల్‌మాల్, అన్నింటికీ మించి ఫోన్ ట్యాపింగ్ వంటి నేరాలపై కెసిఆర్ 'వాంగ్మూలం' ఇవ్వవలసి ఉన్నది. తాము మరలా అధికారంలోకి వస్తే 'గడీ' పాలన ఉండదనీ, ఫార్మ్ హౌస్ నుంచి పరిపాలించబోమని చెప్పడానికి కెసిఆర్ సాహసించలేరు. కెటిఆర్ అటువంటి హామీ ఇవ్వలేరు. ప్రగతిభవన్ ఖాళీ చేసినప్పుడు, దానికి రక్షణగా ఉన్న ఇనుప ముళ్ల కంచెలు తొలగించినపుడు కెసిఆర్ ఎంతగా విలవిలలాడిపోయి ఉంటారో అంచనా వేయవచ్చు.

కాగా తెలంగాణ సెంటిమెంటు అస్త్రాన్ని బూజు దులిపి మళ్ళీ బయటకు తీసుకు రావడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలోనూ బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అయితే అది కాలం చెల్లిన ఔషధం. స్వరాష్ట్రమే సాకారమయ్యాక ఇన్ని సంవత్సరాల తర్వాత అలనాటి 'ప్రత్యేక భావోద్వేగాలు' రగిలించినా పెద్దగా ఫలితం ఉండకపోవచ్చు. కనుక తమ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి వంటి అంశాలపైనే కెటిఆర్ ఫోకస్ పెట్టవలసి ఉంటుంది. పార్టీ క్యాడర్‌ను అధికారంలో ఉన్న తొమ్మిదిన్నర ఏండ్లలో బిఆర్ఎస్ నాయకత్వం ఖాతరు చేసిందా? వారి బాగోగులు ఎప్పుడయినా పార్టీ నాయకత్వం పట్టించుకుందా? 'పార్టీ అంటే మేమే, మేమే పార్టీ' అనే వైఖరితో కెసిఆర్, కెటిఆర్ ప్రవర్తించిన కారణంగా పార్టీ కింది స్థాయి శ్రేణులన్నీ భగభగ మండిపోయాయి. 'కుటుంబ పాలన'కు వ్యతిరేకంగానే ప్రజలు తీర్పు ఇచ్చారు.

తాజా పరిస్థితి వేరు. బిఆర్ఎస్ పార్టీ అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటున్నట్టు స్వయంగా ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత బిజెపి పుంజుకోవడం,పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడం బిఆర్ఎస్ 'పుణ్యమే'నన్న విశ్లేషణ ఉన్నది. 2023 అసెంబ్లీ ఎన్నికలలో 119 స్థానాలకు గాను 64 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బిఆర్ఎస్ 39 స్థానాలకు పరిమితమైంది. 2018 లో కేవలం ఒక సీటు మాత్రమే పొందిన బిజెపి 14% ఓట్లతో 8 అసెంబ్లీ సీట్లు గెలుచుకోవడం తేలికగా తీసుకోవలసిన అంశం కాదు.

ఇదిలా ఉండగా ఏ పార్టీలోనయినా అత్యంత ముఖ్యమైన అంశం సంస్థాగత నిర్మాణం. టిఆర్ఎస్/బిఆర్ఎస్‌లో మొదటినుంచీ ఈ అంశాన్ని పట్టించుకున్న దాఖలాలే లేవు. గ్రామస్థాయి నుంచి తెలంగాణ భవన్ కు సమగ్ర సమాచార పంపిణీ వ్యవస్థ లేదు.నిస్పాక్షిక విశ్లేషణలు,నివేదికలు కెసిఆర్, కెటిఆర్ కు చేరే అవకాశాలు లేవు. ఒకవేళ చేరినా ఆయా సమాచారాన్ని వాళ్లిద్దరూ అలక్ష్యం చేసే రకం. తమకు తెలిసిన దానికన్నా ఇంకొకరికి ఎక్కువ విషయాలు, వాస్తవాలు తెలిసే చాన్సు లేదని కెసిఆర్ నమ్ముతుంటారు.ఇప్పటికీ కెసిఆర్ వైఖరిలో, ఆలోచనా సరళిలో ఎలాంటి మార్పు లేదని పార్టీ వర్గాలు చెబుతున్నవి.

# వన్నెతరగని దేశభక్తి గేయం వందేమాతరం



నర్సింగు కోటయ్య
నాగార్జున ప్రభుత్వ కళాశాల(A), నల్గొండ
9985930885

వందేమాతరం నినాదం లేని స్వాతంత్ర ఉద్యమాన్ని ఊహించలేం. ఆనాడు బ్రిటిష్ వారు వెయ్యి ఫిరంగులు ఎత్తి పెడితే మన భారతీయులు వందేమాతరం నినాదంతో 1000 ఫిరంగులకు మించిన భయాన్ని బ్రిటిష్ వారిలో పుట్టించారు. ఆ నినాదాన్ని పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు నినదించారు. అంత గొప్ప స్ఫూర్తిని, ఉద్యమకాంక్షను రగిలించిన ఆ శక్తివంతమైన గేయమే మన జాతీయ గేయం అయినది. నరనరాన దేశభక్తిని నింపిన వందేమాతర గేయంలో భారత దేశ గొప్పతనం తెలుస్తుంది. బ్రిటిష్ వారి మెడలు వంచిన నినాదం వందేమాతరం.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 8 ఏప్రిల్, 1894) (బంకించంద్ర ఛటోపాధ్యాయ). 'ఛటోపాధ్యాయ్' అని బ్రిటిష్ వారు పలకలేక 'ఛటర్జీ' అని పిలువసాగారు. బ్రిటిష్ వారిని అనుకరిస్తూ ప్రపంచంకూడా 'ఛటర్జీ' అని పిలవడం ప్రారంభించింది. బ్రిటిష్ కొలువులో.. భారతీయ ఆత్మతో పని చేసిన బంకించంద్ర ఛటర్జీ భారతదేశం కోసమే పనిచేశారు. ఇతను బెంగాలీ కవి, వ్యాసరచయిత, సంపాదకుడు. ఇతని రచన అయిన వందేమాతరం ఇతనికి మంచి పేరు తెచ్చి పెట్టింది. ఇతను వ్రాసిన ఆనంద్ మఠ్ అనే నవల నుండి ఈ గేయాన్ని సంగ్రహించారు. ఈ గేయం భారత స్వతంత్ర సంగ్రామంలో సమరశంఖంగా పనిచేసింది. తాత్వికుల వివిధ రచనలోని బోధనలు వారి వారి దేశాలలో చైతన్యాన్ని తీసుకు వచ్చినవి.ఫ్రెంచ్ విప్లవంలో రూసో 'సోషల్ కాంట్రాక్ట్' వోల్టేర్ 'ది ఆంగ్లస్ లెటర్స్',మంటెస్క్యూ 'ది స్పిరిట్ ఆఫ్ లాస్', అమెరికా విప్లవంలో జాన్ లాక్ 'ట్రూ ట్రీటిస్ ఆఫ్ సివిల్ గవర్నమెంట్, జార్జ్ మెసన్ 'డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్' థామస్ పెయిన్ 'కామన్ సెన్స్' కరపత్రం మొదలైనవి. విప్లవాలను, స్వాతంత్ర్య యుద్ధాలను, స్వాతంత్ర్య ఉద్యమాలలో ప్రజలను చైతన్యం చేసే అంశాలలో రచనలు ముఖ్యమైనవి. బంకించంద్ర చటర్జీ నవల ప్రభావితం చేసినంతగా ప్రపంచంలో ఏ రచన చెయ్యలేదు. బకింగ్ చంద్ర చటర్జీ తన 'ఆనంద్ మఠ్' నవల బెంగాలీ భాషలో రాయగా, అరవింద్ ఘోష్ ఆంగ్లంలోకి అనువదించారు.

ఆంగ్లేయుల గుండెల్లో ప్రమాదఘంటికలు మోగించిన వందేమాతరం గేయం, పదం స్వాతంత్రోద్యమ నాయకుల నుంచి సామాన్యుల వరకు ఉత్తరం నుంచి దక్షిణం వరకు తూర్పు నుంచి పడమర వరకు యావత్ భారతదేశాన్నిఉర్రూతలూగించి, ప్రతిధ్వనించింది. పూర్వకాలంలో గాని , ఇటీవల కాలంలో గాని ప్రపంచ సాహిత్య చరిత్ర లో,జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలలో ఒక మహాకవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి ఉద్యమింపజేసిన సంఘటన బంకించంద్ర చటోపాధ్యాయ విషయంలో లాగా మరొక దేశంలో ,మరొక దేశ స్వాతంత్రోద్యమంలో సంభవించలేదు.భారతదేశ స్వాతంత్రోద్యమం పల సిద్ధి దిశగా చైతన్యవంతమవుతున్నప్పుడు వందేమాతర గీతం దాని వేగాన్ని త్వరితం చేసినది. తమ సంస్కృతికి, సాంఘిక ధార్మిక జీవన ప్రవృత్తికి హాని, ప్రమాదం సంభవిస్తాయని ప్రచారం కన్న బలమైన విప్లవోద్యమ సాధనం ఇంకొకటి ఏ సమాజంలోనూ ఏ దేశ చరిత్రలోనూ ఉండదు.

అదిగాక బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఆర్థికంగా కొల్లగొట్టుతున్నారు, మానవ ధర్మాన్ని రూపుమాపుతున్నారు. అనే వేదన బంకించంద్ర చటోపాధ్యాయకి ఈ 'ఆనంద్ మఠ్' అనే నవల రాయడానికి ప్రేరణ కలిగించి, ఈ నవలలో సన్యాసుల స్వాతంత్ర సమర శంఖ నినాదం వందేమాతర గీతం అయిన ది.

మన దేశ జాతీయ గేయం వందేమాతరం గేయం. దీన్ని 1875లో నవంబరు 7న బంకిమ్ చంద్ర ఛట్టోపాధ్యాయ్ వ్రాసారు. ఆయన రచించిన బెంగాలీ నవల 'ఆనంద్ మఠ్'లో ఈ గేయాన్ని పొందుపరిచారు. వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవం నవంబరు 7న మొత్తం దేశ ప్రజలు జరుపుకున్నారు.

భారతీయుల ఐహిక, పరమార్థ జీవితాలు బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో క్షీణ దశకు చేరే ప్రమాదాన్ని నివారించడానికి సన్యాసుల సమరం సాగింది. బకించంద్ర చటర్జీ ఈ నవల రాయడానికి నూరేళ్లకు పూర్వం 1773లో ఉత్తరదేశంలో కొందరు సన్యాసులు ఇంగ్లీష్ వారి ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి ఉద్యమించారు.1770 ప్రాంతంలో కరువుతో ప్రజానీకం అల్లాడిపోయారు. ఈ పరిస్థితుల్లో లక్షల మందికి పైగా చనిపోయారు.. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల పన్నుల పీడనానికి వ్యతిరేకంగా హిందూ సన్యాసులు, ముస్లిం ఫకీర్లు ఏకమై చారిత్రాత్మక తిరుగుబాటు చేశారు. వారు కంపెనీ ఖజానాలను, ఆహార గోదాములను దోచుకుని పేద ప్రజలకు పంచిపెట్టారు. 'ఆనంద్ మఠ్' నవలను బంకిమ్ చంద్ర ఛట్టోపాధ్యాయ్ రచించేందుకు హిందూ సన్యాసులు, ముస్లిం ఫకీర్ల తిరుగుబాటు ఉద్యమమే స్ఫూర్తిని



ఇచ్చింది. దేశభక్తిని, జాతీయతా వాదాన్ని రగిల్చేలా సాగిన ఆ ఉద్యమ ఘటనల గురించి 'ఆనంద్ మఠ్' నవలలో కళ్లకుకట్టేలా ఎన్నో ప్రస్తావనలు ఉన్నాయి. 'ఆనంద్ మఠ్' నవల 1882లో ప్రచురితమైంది.. 1884 ఏప్రిల్ 8న బకించంద్ర చటర్జీ మరణించాక 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరకల్పన చేసి జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడారు. అక్కడ నుండి వందేమాతరం అందరి నోళ్ళలో నినాదంగా మారింది. 1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ ను విభజించడంతో వందేమాతర ఉద్యమంగా ఊపిరి పోసుకున్నది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కలిస్తే, కనబడితే వందేమాతరం నినాదాలతో కుల మతాలకతీతంగా నినాదంగా మారిపోయినది. ఇది బ్రిటిష్ వారికి శత్రు నినాదంగా భవిష్యత్తులో మారిపోయినది. ఇది భారత జాతీయ చరిత్రలో ఒక నూతన శకానికి నాంది పలికిన ఉద్యమం.

హిందూ, ముస్లిం ఐక్యతను దెబ్బ తీయడం. (devide and Rule Policy) విభజించుపాలించు సిద్ధాంతంతో హిందువులను ముస్లిములను విడదీస్తూ రెండు రాష్ట్రాలుగా చేస్తూ వైస్రాయ్ లార్డ్ కర్జన్ 1905 జూలై 20 న బెంగాల్ విభజన అధికార ప్రకటన చేశాడు. తూర్పు ప్రాంతాలైన ఢాకా, ఫరీదాపూర్, ఐకార్ గంజ్, నవాఖలీ, చిట్టగాంగ్ ప్రాంతాలు, అస్సాంతో కలిసి తూర్పు బెంగాల్ గా ఏర్పాటు చేశారు. దీని రాజధాని ఢాకా, ఉప రాజధాని చిట్టగాంగ్. బెంగాల్ పశ్చిమ ప్రాంతం, బీహార్, ఒరిస్సా , సెంట్రల్ ప్రావిన్స్ నుండి వేరు చేసిన శంబల్ పూర్ కలిసి పశ్చిమ బెంగాల్ గా (రాజధాని కలకత్తా) ఏర్పాటు చేశారు. ఈ విభజన 1905 అక్టోబర్ 16న అమలులోకి వచ్చినది. ఈ బెంగాల్ విభజనకు వ్యతిరేక ఉద్యమం 1905 ఆగష్టు 7 నే ప్రారంభమైనది . ఈ ఉద్యమానికి వందేమాతర ఉద్యమం అని అశ్వనీకుమార్ దత్త నామకరణం చేశాడు .వందేమాతరం అనగా (Hail Motherland) 'మాతృభూమికి నమస్కారం'(భారత మాతకు వందనం) అని అర్థం.ఈ ఉద్యమంలో ప్రజలు వందేమాతరం గీతాన్ని ఆలపించటం, ఒకరినొకరు పలకరించటం, వందేమాతరం అనే ఊత పదాన్ని ఉపయోగించటం వలన వందేమాతరం ఉద్యమం అనే పేరు వచ్చింది. ఈ ఉద్యమంలోనే విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను మాత్రమే ఉపయోగించాలానే నిర్ణయం తీసుకొనటం వలన దీనికి గల మరొక పేరు స్వదేశీ ఉద్యమం.

వందేమాతర ఉద్యమం బెంగాల్‌కు పరిమితం కాకుండా దేశవ్యాప్తమైంది. మొదట్లో ఈ ఉద్యమం సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాదుల నేతృత్వంలో జరిగినా క్రమంగా అతివాద, తీవ్రవాద నాయకత్వానికి మరలింది. ఈ ఉద్యమాన్ని బెంగాల్ నుంచి దేశవ్యాప్తంగా ప్రచారం చేయడంలో బిపిన్ చంద్రపాల్ ప్రముఖ పాత్ర పోషించారు. మద్రాస్, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బెంగాల్ లో బిపిన్ చంద్రపాల్ ,అరవింద ఘోష్ ,బరిసాల్ లో అశ్వనీకుమార్, దత్తపంజాబ్, ఉత్తరభారత్ లలో లాలా లజపతిరాయ్ ,అజిత్ సింగ్, హన్స్ రాజ్, పశ్చిమ భారత్ (పూనా, ముంబయి) లలో తిలక్ , పరంజపే, మద్రాస్‌లో చిదంబరం పిళ్ళే, సుబ్రహ్మణ్య అయ్యర్, ఆనందాచార్యులు, టి.ఎం.నాయర్, ఆంధ్రలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, డిల్లీ & జమ్ములలో సయ్యద్ హైదర్ రాజా, యునైటెడ్ ప్రావిన్స్ లలోమదన్ మోహన్ మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ బెనారస్‌లో సుందర్ లాల్ మొదలైన వారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.

ఈ ఉద్యమ కాలంలోనే తిలక్ స్వదేశీ నేత కంపెనీని పూనాలో స్థాపించినాడు. ఠాకూర్ స్వదేశీ స్టోర్ స్థాపించినాడు.గోదావరి స్వదేశీ స్టోర్ గున్నేశ్వరరావు ఇచ్చిన రూ. 1000 విరాళంతో రాజమండ్రిలో ప్రారంభమైనది. ట్యుటికోరిన్ (మద్రాస్)లో స్వదేశీ స్టీమ్ నేవిగేషన్ కంపెనీని స్థాపించారు. అక్కడ ఈ ఉద్యమాన్ని సుబ్రమణ్య అయ్యర్, చిదంబర పిళ్లై విస్తృతం చేశారు. ఆంధ్ర ప్రాంతంలో కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు నేతృత్వం వహించి ఉద్యమాన్ని విస్తరించారు. వందేమాతరం ఉద్యమంను తీవ్ర ఉద్యమంగా ప్రారంభం నుంచి సాగించిన వారు అతివాదులు (జాతీయవాదులు) ఈ ఉద్యమంలో అత్యధిక ప్రాముఖ్యం వహించిన నాయకులు లాల్, బాల్, పాల్, ఘోష్ లు. 1906 లో కలకత్తాలో అపూర్వమైన రీతిలో శివాజీ ఉత్సవాలు నిర్వహించారు. స్వరాజ్యం సంపాదించటం ధ్యేయంగా లాల్, బాల్, పాల్, ఘోష్ లు ఉద్యమం నడిపించారు. ఇలా స్వాతంత్ర్యం కోసం జరిగిన ప్రతి ఉద్యమంలో ఊపిరైనది. బానిసత్వంలో పడిపోయిన భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించే మార్గంగా వందేమాతరం చైతన్యంనింపినది. సామాన్యులనూ సమరయోధులుగా మార్చింది.

అందరూ వందేమాతరంలో స్వాతంత్ర్య కాంక్షను చూశారు కానీ.. మతం కోణం చూడలేదు. దీంతో వందేమాతరం దేశం మొత్తం వ్యాపించింది. భారతీయులలో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, 1950 జనవరి 24న రాజ్యాంగ సభ 'వందేమాతరం' గీతాన్ని 'జనగణమన'తో సమానంగా గౌరవిస్తూ జాతీయ గేయంగా అధికారికంగా స్వీకరించింది

భారత స్వాతంత్రోద్యమంలో వివిధ దశలలో జరిగిన ఉద్యమాలలో సామాన్యులు, స్వాతంత్రోద్యమకారులు తెల్ల వారి చేతిలో బానిస జీవితాన్ని కొనసాగించిన ప్రతి భారతీయుడిలో వందేమాతరం జీవనాడి అయింది, రాజమండ్రి కళాశాల సంఘటనలో,కోటప్ప కొండ సంఘటనలో,కాకినాడ కొట్లాటలో, తెనాలి బాంబు కేసు సంఘటనలో,కుదిరాంబోస్ ఉరిశిక్ష సమయంలో, విప్లవకారుల అమరత్వ సమయంలో నినదించిన నినాదం, గేయం వందేమాతరం.

వందేమాతర గీతానికి ఆవిర్భావం వెనుక ఒక అవమాన గాథ ఉంది. బంకించంద్ర ఛటోపాధ్యాయ్ బ్రిటిష్ పాలనలో డిప్యూటీ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తుండగా ఒక తెల్ల అధికారి అతనిపై జాతి వివక్షతో దాడి చేశాడు. ఆ అవమానం ఆయన హృదయంలో జ్వాలగా మారింది. తరువాత బ్రిటిష్ పాలకులు God Save the King (గాడ్ సేవ్ ద కింగ్)గీతాన్ని భారత జాతీయ గీతంగా ప్రకటించాలని చూస్తున్నారని తెలిసి, బంకిమ్ చంద్ర కలం నుంచి అక్షరాల మంటలు చిమ్మాయి. 1875 నవంబర్ 7న ఆయన రచించిన గీతమే, భారతీయ గేయం. ఇది బంకించంద్ర ఛటర్జీ రచించిన 'ఆనందమఠ్' అనే బెంగాలీ నవల లోనిది. స్వాతంత్ర్యోద్యమకాలంలో ఈ గీతాన్ని భారతీయులు 'విప్లవ గీతంగా' గానం చేశారు. ఇది జనగణమనతో సమానమైన స్థాయి కలిగి ఉంటుంది. వందేమాతరం గీతం ప్రథమంగా 1896లో కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఆలాపించబడింది. ఆ తర్వాత యావత్ భారత జాతి గుండెలనిండా చేరి ఉద్యమానికి పురికొల్పింది. ఇది భరత జాతి దాస్య శృంకణాల విముక్తి గీతమైతే, బ్రిటిష్ వారిని సప్త సముద్రాలు దాటించి విప్లవ గీతంగా మారింది.

**'వందేమాతరం!**

*సుజలాం సుఫలాం మలయజశీతలాం సస్యశ్యామలాం*
*మాతరం! వందేమాతరం!*
*శుభ్రజ్యోత్స్నా పులకితయామినీం పుల్లకుసుమిత*
*ద్రుమదళ శోభినీం,*
*సుహాసినీం సుమధురభాషిణీం సుఖదాం వరదాం*
*మాతరం! వందేమాతరం!.*

**భావం:** తల్లీ! భారతమాత నీకు వందనం! తీయని జలాలతో, కమ్మని ఫలాలతో, చల్లని మలయ మారుతాలతో, పచ్చని పైర్లతో విలసిల్లే, తల్లి నీకు వందనం! పండు వెన్నెల రాత్రులలో విరబూసిన తరూలతలతో శోభిస్తూ, స్వచ్ఛమైన నవ్వులతో, మధురమైన మాటలతో మాకు సుఖాలను కలిగిస్తూ వరాలనిచ్చే, తల్లి నీకు వందనం!.

భాషా మిశ్రమం గురించి విమర్శలు ఎదురైనా ఆయన

## జాతీయోద్యమ ప్రేరక శక్తి

తగ్గకపోగా మీకు నచ్చితే పాడండి, లేకుంటే విసిరేయండి; దీని విలువ ప్రపంచం గుర్తిస్తుంది అని అన్నారు. తరువాత రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ గీతంలోని ఆధ్యాత్మికతను గుర్తించి దేశాన్ని మాతృమూర్తిగా చూపించే విధానాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చారు. 1886లో అనేక సభల్లో స్వయంగా ఆలపించారు. బంకిమ్ చంద్ర మరణానంతరం ఈ గీతం అగ్నికణాలై ప్రజల్లో వ్యాపించింది. 1947 ఆగస్టు 15న మన స్వాతంత్ర్యం సిద్ధించిన రోజున పార్లమెంట్‌లో సంగీతకారుడు ఓం ప్రకాశ్ ఈ గీతాన్ని ఆలపించారు. దూరదర్శన్‌లో ప్రతిరోజూ వినిపించే వందేమాతరంకు నేపథ్య సంగీతం లేకపోవటానికి దీనిలోని పదాల మాధుర్యం కారణమని చెబుతారు. బిబిసి వరల్డ్ సర్వీస్ నిర్వహించిన

✻ అంతర్జాతీయ పోటీల్లో ప్రపంచ ప్రసిద్ధ జాతీయ గీతాలలో వందేమాతరం రెండవ స్థానం దక్కించుకుంది.

✻1906లో పాథే ఫోన్స్ కంపెనీ రవీంద్రనాథ్ ఠాగూర్ గళంలో దీన్ని రికార్డు చేసింది. బ్రిటిష్ పోలీసులు ఆ రికార్డులను నాశనం చేశారు. అయితే ఒరిజినల్ కాపీ పారిస్‌లో దొరికి,

✻1966లో ఇందిరా గాంధీ దాన్ని తిరిగి భారత్‌కు తెప్పించారు.

✻1950లో రాజ్యాంగ పరిషత్తు 'వందేమాతరం' ను 'జనగణమన'తో సమాన హోదాలో గౌరవించాలని తీర్మానించింది. ఈ గీతం భరత జాతి చైతన్యానికి నిత్య దీప్తి.

భారత సంస్కృతిలో అసతోమా సద్గమయ, సత్యమేవ జయతే, జననీ జన్మభూమిశ్చ, మా ఫలేషు కథాచనా వంటి వాక్యాలతో పాటు...ప్రపంచ స్థాయి 'నో దై సెల్ఫ్'...'సోక్రటీస్ సూత్రము, పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్పా' అనే మార్క్స్ నినాదం మానవ వికాసానికి మైలు రాళ్లు అయినట్లే, వందేమాతరం కూడా ఆ కోవకు చెందిన మహోన్నత నినాదం. ఇది కేవలం స్వాతంత్ర్య చరిత్రలో ఒక పుట కాదు. భారత జాతి ప్రాణాల్లో నిత్యం ప్రజ్వరిల్లే అగ్నికణం. వందేమాతరం గీతం మాత్రమే కాదు, భరత జాతి బానిసత్వ విముక్తి గీతం.

మేకిరి దామోదర్

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★
సంపుటి 08, సంచిక: 337 | శనివారం | 08-11-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## చర్చలు సఫలం

ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల బంద్ విరమణ

తక్షణం రూ.600 కోట్లు విడుదలకు ప్రభుత్వం అంగీకారం

త్వరలో మిగతా రూ.300 కోట్లు

ఉపముఖ్యమంత్రి భట్టి హామీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బంద్‌ను విరమిస్తున్నట్టు ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పాటించిన కళాశాలలు యధావిధిగా ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం చర్చలు జరిపారు. కళాశాల యాజమాన్యాలకు సంబంధించిన బకాయిలు తరువాయి 6లో



### ప్రతి ఎన్నిక నాకు ప్రతిష్ఠాత్మకమే..

రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నికలైనప్పటికీ తానే అభ్యర్థిగా భావించి పనిచేస్తానని, ప్రతి ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటానని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తాను పిసిసి అధ్యక్షునిగా ఉన్నప్పుడే మునుగోడు, హుజూర్‌నగర్ ఉప ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. సామాన్య కార్యకర్తగా పార్టీ విజయం కోసం పనిచేస్తానని చెప్పారు. కెసిఆర్ మాదిరిగా ఫామ్‌హౌస్‌లో పడుకోవాలా అని ప్రశ్నించారు. అండగా ఉంటే పదేళ్లలో అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని అన్నారు. సర్వేల గురించి తాను మాట్లాడనన్నారు. కెసిఆర్, కెటిఆర్‌లకు కిషన్ రెడ్డి లొంగిపోయారని విమర్శించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి
# అండగా నిలబడండి

నగర అభివృద్ధికి హైదరాబాద్ ప్రజలు మద్దతివ్వాలి

- స్థానిక ఎమ్మెల్యేల సహకారం ఉంటేనే సాధ్యం
- మహానగరానికి గోదావరి జలాలు తీసుకువస్తాం రేడియల్ రోడ్లు, మెట్రో రైలును విస్తరిస్తాం
- ఫ్లై ఓవర్లు, అండర్ ఫ్లై ఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్లకు మోకాలడ్డుతున్నారు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

**అభివృద్ధి పనులకు హైదరాబాద్ బ్యాడ్ బ్రదర్స్ కిషన్‌రెడ్డి, కెటిఆర్ అడ్డుకట్ట**



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో చేపపట్టనున్న మెట్రో రైల్ విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్‌సిటీ లాంటి పలు అభివృద్ధి పనులను 'హైదరాబాద్ బ్యాడ్ బ్రదర్స్ కిషన్‌రెడ్డి, కెటిఆర్' అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని, పదేళ్ల వరకు (2024–2034) వరకు మద్దతు ఇవ్వాలని, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ తరువాయి 6లో



## వీధి కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో కనిపించొద్దు

- విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్ స్టేషన్లు , రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాల నుంచి తరలించాలి
- సంబంధిత అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ :** బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తరలించాలని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్ స్టేషన్లు , రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు సహా బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను కనిపించవద్దని సంబంధిత అధికారులకు న్యాయస్థానం స్పష్టం చేసింది. వీధి కుక్కల కేసును జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజరియాతో కూడిన ధర్మాసనం శుక్రరవారం విచారణ చేపట్టింది. 'విద్యా కేంద్రాలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, బస్‌స్టాండ్‌లు, డిపోలు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల్లో కుక్కకాటు కేసులు ఆందోళనకరమైన రీతిలో పెరుగుతున్నాయి. అందుకే తరువాయి 12లో

పాన్ ఇండియా 'ఎస్ఐఆర్' కసరత్తుపై

## 11 నుంచి 'సుప్రీం' విచారణ

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలనే ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను నవంబరు 11న విచారించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అనే ఎన్‌జిఓ తరపున న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ మాట్లాడుతూ ఈ అంశాలు ప్రజాస్వామ్య మూలాలలోకి వెళ్లాయని చెప్పిన తర్వాత న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చీ మాట్లాడుతూ నవంబరు 11 నుంచి పిటిషన్ల విచారణ ప్రారంభం అవుతుందని చెప్పారు. నవంబరు 11నుండి అనేక ముఖ్యమైన విషయాలను చేపట్టడానికి ఇతర సంఘాల విచారణను సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తామని ధర్మాసనం తెలిపింది. 'వివిధ రాష్ట్రాలలో ప్రత్యేక ముమ్మర సవరణ కసరత్తు తరువాయి 12లో



సైబర్ నేరాలపై

## భారీ ఆపరేషన్

నెలరోజుల్లో 55 మంది అరెస్టు

బాధితులకు రూ.62.34 లక్షల చెల్లింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ మేరకు నెల రోజుల పాటు సైబర్ నేరస్తుల ఆట కట్టించేందుకు భారీ ఆపరేషన్ నిర్వహించినట్లు హైదరాబాద్ క్రైమ్స్ అదనపు పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఒక్క అక్టోబర్ నెలలోనే 55 మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన శుక్రవారం తరువాయి 6లో




## బిజెపి, బిఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం

- ఓటమి భయంతో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్న బిఆర్ఎస్
- మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్‌తో బిజెపి లోపాయికారి ఒప్పందంతో పనిచేస్తుందని, కెటిఆర్ తానా అంటే, కిషన్ రెడ్డి తందాన అని అంటున్నారని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్,జూపల్లికృష్ణారావు ఆరోపించారు. ఓటమి భయంతోనే బిఆర్ఎస్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు.హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గత లోక్‌సభ ఎన్నికల్లో ఆయనను ఎంపిగా గెలిపించినందుకు సహాయంగా కెసిఆర్‌కు గురుదక్షిణ కింద బిజెపి అభ్యర్థిని బలిస్తున్నారని ఆరోపించారు.గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 25 వేల ఓట్లను సాధిస్తే, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అదే శాసనసభ నియోజకవర్గం నుండి 64 వేల ఓట్లు బిజెపికి ఎలా వచ్చాయన్నారు.కెటిఆర్ తానా అంటే కిషన్‌రెడ్డి తందాన అంటారని ఎద్దేవా తరువాయి 6లో

## జూబ్లీహిల్స్ తీర్పుతో రాష్ట్ర దశ, దిశ మార్పు



- ఈ ఎన్నిక 4 లక్షల ప్రజల భవిష్యత్తుకోసం కాకుండా 4 కోట్ల ప్రజల భవితవ్యానికి సంబంధించింది
- ఉప ఎన్నికల్లో బిజెపి సైడయ్యింది
- 'మీట్ ది ప్రెస్'లో బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వికాసానికి , విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ ఎన్నిక జూబ్లీహిల్స్‌లో ఉండే నాలుగు లక్షల ప్రజల భవిష్యత్ కోసం కాదని, నాలుగు కోట్ల ప్రజల భవితవ్యానికి సంబంధించిందన్నారు. ప్రశ్నించే గొంతును గెలిపించాలని ఆయన కోరారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో హరీశ్‌రావుతో శుక్రవారం 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తరువాయి 6లో

## బిఆర్ఎస్ పరిస్థితి అగమ్యగోచరం



- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ముందే చేతులెత్తేసింది
- ముస్లిం ఓట్లకోసం కాంగ్రెస్ యత్నం
- మాగంటి గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలి
- కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ గోపీనాథ్ మరణం ఒక మిస్టరీ అనే విషయాన్ని స్వయంగా ఆయన తల్లి ఆరోపించిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గోపీనాథ్ మరణంతో పాటు ఆయన ఆస్తిపాస్తులపైన సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో బిజెపి వర్సెస్ ఐఎంసి(ఇండియన్ ముస్లిం కాంగ్రెస్) మధ్యే పోటీ అని, బిఆర్ఎస్ పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని, ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ ముందే చేతులెత్తేసిందని చెప్పారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర తరువాయి 6లో

## మేధాశక్తే ఓ ప్రయోగశాల

- నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం
- న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం కృషి చేయండి
- శాతవాహన యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవంలో విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచన

ప్రజాపక్షం/కరీంనగర్

నిరంతర అభ్యాసంతోనే విజయం సాధ్యమవుతుందని, శ్రద్ధ, క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలని తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని శాతావాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 25 మందికి పిహెచ్‌డి పట్టాలతో పాటు 2018 నుండి 2025 వరకు ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ తరువాయి 6లో







# జనరల్
STATE & REGIONAL NEWS

## క్రికెటర్ అరుంధతిరెడ్డిని సన్మానించిన మంత్రి శ్రీహరి



ప్రజాపక్షం/హైదరాబాద్: ముంబయిలో జరిగిన మహిళల ప్రపంచ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లో విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టులో ఉన్న క్రికెటర్ అరుంధతిరెడ్డిని శుక్రవారం తన ఛాంబర్‌లో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సన్మానించారు. ఇటీవల జరిగిన ఉమెన్ వరల్డ్ కప్ 2025లో తన దైన పాత్ర పోషించిన అరుంధతి రెడ్డిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖ ఎండి సోని బాలదేవి, కోచ్ ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను బాధితులను ఆదుకోవాలి

దెబ్బతిన్న దేవాదుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/బీమదేవరపల్లి :** మొంథా తుఫాను ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లిందని వాటిలో ప్రధానంగా బీమదేవరపల్లి మండలంలో తీవ్ర ప్రాణనష్టం, పశు సంపద, పంట నష్టం, ఆస్తి నష్టం, రోడ్లు దెబ్బతిన్నాయని, జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి బాధితులందరికి నష్టపరిహారం చెల్లించాలని, వరద ప్రభావంతో దెబ్బతిన్న దేవాదుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బీమదేవరపల్లి మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావం కారణంగా కొత్తపల్లి వరద ప్రభావంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా కాకుండా రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంట పొలాల్లో ఇసుక మేటలు తేలి రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేల ప్రకటించిందని, ఆ పంట నష్టం ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, పశు సంపద నష్టపోయిన వారికి కూడా పరిహారం ఇవ్వాలని, ఇల్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని, దెబ్బతిన్న దేవాదుల ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసి పంటలకు సాగు నీరు అందించాలని, ఇలాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాశ్వత పరిష్కారం కోసం నిధులను కేటాయించి, పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదరిక నిర్మూలనలో కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం ఆదర్శమని చాడ వెంకట రెడ్డి అన్నారు. కమ్యూనిస్టు పాలన ఉంటే ఏమిటో కేరళ ప్రభుత్వం చూపించి, నిరూపించిందని, కేరళలో పేదరిక నిర్మూలనకు కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం తీసుకున్న చర్యలు అమోఘమని, విద్య, వైద్య రంగంలోనే కాకుండా సుపరిపాలనలో కేరళ దేశంలో ముందంజలో ఉందని చాడ తెలిపారు. సిపిఐది వందేళ్ళ ఉత్సవాల సందర్భంగా ఈనెల 18, 19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో జరిగే రాష్ట్ర బస్ జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి పిలుపునిచ్చారు. ఈ బస్సు జాత నవంబర్ 18న బీమదేవరపల్లి మండలంలోని మాణిక్య పూర్ గ్రామానికి చేరుకొని అక్కడి నుండి హనుమకొండ జిల్లాలో బస్సు జాత ప్రారంభం అయి 19న పరకాలలో ముగించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లనుందని తెలిపారు. ఈ బస్సు జాతను పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, ఎన్‌వి స్టాలిన్, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొగల రామచంద్ర రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి అదరి రమేష్, నాయకులు చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక్కడ అవకాశాలు పుష్కలం...

# పెట్టుబడులు పెట్టండి

'అమెరికా – యూటా' రాష్ట్ర పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన 'తెలంగాణ'లో అవకాశాలు పుష్కలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని 'అమెరికా యూటా' పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ యూటా ఎండి, సిఒఒ డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని 'యూటా పారిశ్రామికవేత్తల బృందం' శుక్రవారం సచివాలయంలో శ్రీధర్‌బాబును శుక్రవారం ప్రత్యేకంగా కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో 'యూటా–తెలంగాణ' మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్‌టర్మ్ వాల్యూ క్రియేషన్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టి హబ్, టి వర్క్స్, వీ హబ్‌లను వరల్డ్ ట్రేడ్ సెంటర్ యూటా, సిలికాన్ స్లోప్స్ & యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని ప్రతినిధి బృందాన్ని ఆయన కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచిగా మారాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. తెలంగాణ లాంటి ఫాస్ట్‌గ్రోయింగ్, డైనమిక్, ప్రోయాక్టివ్ రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ అన్నారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటా హౌజ్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ జేసన్ థాంప్సన్, మాట్ మాక్‌ఫెర్సన్, నికోల్ మాక్‌ఫెర్సన్, లైఫ్ టైం ప్రెసిడెంట్ బీజే హాకే, జేకేడీ ప్రెసిడెంట్ మైక్ నెల్సన్, మోనెరె ఏఐ సీఈవో, కోఫౌండర్ మౌ నంది, భారత్ వ్యాలీ అడ్వైజర్లు స్టీవ్ ఫుడ్ సున్‌హాష్ లోడే, ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ లక్ష్మి నారాయణ, ఐఐఆర్‌ఎఫ్ గురు సౌలే తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యం

హనుమకొండ ఎసిపి నరసింహారావు

ఘనంగా నవచేతన పుస్తక ప్రదర్శన ప్రారంభం



**ప్రజాపక్షం/హనుమ–కొండ :** పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యం అని హనుమకొండ ఎసిపి పి.నరసింహ రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లో నవచేతన బుక్ హౌస్‌లో ఘనంగా పుస్తక ప్రదర్శన ప్రారంభం అయింది. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన ఎసిపి నరసింహారావు అనంతరం మాట్లాడుతూ మనిషిని పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దే శక్తి పుస్తకాలకే ఉందని అన్నారు. విద్యార్థి దశ నుండే పుస్తకాలు చదివే అలవాటును రూంపొందించుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రముఖ ప్రచురణ సంస్థలకు చెందిన అనేక రకాల పుస్తకాలను తగ్గింపు ధరలతో నవచేతన బుక్ హౌస్ ద్వారా పాఠకులకు అందించడం అభినందనీయమని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని, ఈ పుస్తక ప్రదర్శనలో 10 నుండి 40 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎలుగటి తిరుపతి రెడ్డి, న్యాయవాదులు బండి మొగిలి, ఏరుకొండ జయశంకర్, ఎం.సదాశివుడు, జర్నలిస్టులు మంచాల రాజు, ఎండి. ఉస్మాన్ పాషా, తాండూరు గోపి, పి.కిషోర్ కుమార్, కుక్కల రాజు, సిబ్బంది అకినెపల్లి రమేష్, టి.సూర్య తదితరులు పాల్గొన్నారు.

## 'అక్టోబర్ విప్లవం' సమాజంలో వినూత్న మార్పు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాంతి, అందరికీ భూమి, ఆహారం హామీలను నెరవేర్చిన సోవియట్ యూనియన్ 'అక్టోబర్ విప్లవం' సమాజంలో వినూత్న మార్పును తీసుకొచ్చిందని, దోపిడీ, పీడన లేని సమాజం సాధ్యమేనని చూపిందని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. హైదరాబాద్‌లోని ఎం.బి భవన్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి అధ్యక్షతన 'అక్టోబర్ విప్లవం విశిష్టత' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ లెనిన్ నేతృత్వంలోని బోల్షివిక్ పార్టీ, బూర్జువాలు కలిసి రష్యాలో జార్ చక్రవర్తుల పాలనను కూలదోసి ఫిబ్రవరి 17న ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, కానీ ప్రజలు ఆశించిన విధంగా యుద్ధాల నుంచి విముక్తి, రైతులకు భూమి, అందరికీ రేషన్ అందించేందుకు బూర్జువాలు సిద్ధంగా లేకపోవడంతో ప్రజల సహకారంతో 'అక్టోబర్ విప్లవం' ద్వారా లెనిన్ నాయకత్వంలో రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. ఆ ప్రభుత్వం యుద్ధాల నుంచి శాంతి కలిగించి, పేదలకు భూములను పంపిణీ చేసిందని, అందరికీ రేషన్, సంక్షేమం అందించిందని వివరించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రపంచంలో సోషలిస్టు వ్యవస్థ పని అయిపోయిందని పెట్టుబడిదారీ దేశాలు సంతోషపడుతున్న సమయంలోనే 'చైనా కమ్యూనిస్టు' పార్టీ ఆధ్వర్యంలో సోషలిస్టు వ్యవస్థ నేడు ప్రపంచం ముందుకు బలంగా వచ్చిందన్నారు. పేదరిక నిర్మూలన, అభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో చైనా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పెట్టుబడి దారీ దేశమైన అమెరికాకు గుండెకాయలాంటి ఆర్థిక రాజధాని న్యూయార్కులో సోషలిస్టు భావజాలం ఉన్న మమ్దాని అధికారంలోకి వచ్చారని, అమెరికా ప్రజలు కూడా సోషలిస్టు వ్యవస్థ వైపు మొగ్గుచూపుతున్నారని ఆయన తెలిపారు. అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ పోరాటాలు చేయాలని, ప్రజలను చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. కాగా ఈ సదస్సులో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్, బండారు రవి కుమార్ పాల్గొనగా, తొలుత వేదికపైకి వక్తలను రాష్ట్ర కమిటీ సభ్యులు జె.బాబురావు ఆహ్వానించారు.

## నగరాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జూబ్లీహిల్స్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో ఓటర్లు బిజెపి, బిఆర్‌ఎస్‌కు గట్టి గుణపాఠం చెబుతారన్నారు. ఎల్లారెడ్డిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా శుక్రవారం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను అప్యాయంగా పలుకరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ హైదరాబాద్ మహా నగరాభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. కొన్ని ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను చూపించి నగరాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. నగరాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం మాపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమకు అవకాశమిచ్చిన తెలంగాణ ప్రజల ఆశలు, భావితరాల ఆకాంక్షలే అజెండాగా అత్యంత పారదర్శకతతో కూడిన పాలనను తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి నిరంతరం పాటుపడుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లను కోరారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి, నిరంతరం నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం తపించే నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కార్యాలయంలో జాతీయ గేయం వందేమాతరం గీతాలాపన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ గేయం వందేమాతరంకు 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా డిజిపి బి.శివధర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖకు సంబంధించిన ప్రధాన విభాగాల కార్యాలయాల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది సమష్టిగా పాల్గొని దేశభక్తి ఉట్టిపడే వాతావరణంలో వందేమాతరం గేయాన్ని ఉత్సాహంగా ఆలపించారు. భారతదేశ చరిత్రలో అపూర్వమైన స్థానం కలిగిన వందేమాతరం గేయం జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని గుర్తు చేసుకున్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గీతం పోషించిన ప్రేరణాత్మక పాత్రను స్మరించుకున్నారు. లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయం, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లతో పాటు జిల్లాల ఎస్‌పి కార్యాలయాల్లో ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాలు 2025 నవంబర్ 7 నుంచి 2026 నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇంచార్జ్ చార్మినార్ డిఐజి ఎల్.ఎస్. చౌహాన్, ఎఐజిలు రమణ కుమార్,ఏఐజీ నాగరాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



'వందేమాతరం' 150 సంవత్సరాల జ్ఞాపకార్థం ఏడాది పొడవునా జరిగే వేడుకల్లో భాగంగా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సీనియర్ అధికారులు, సిబ్బంది శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జాతీయ గేయాన్ని ఆలపించారు. బంకించంద్ర ఛటర్జీ సహకారాన్ని గౌరవించడం, మాతృభూమి పట్ల ఐక్యత, త్యాగం, ప్రేమ విలువలను పునరుద్ఘాటించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది.

## ఆర్‌టిసిలో జెఎసికి శ్రీకారం



**ప్రజాపక్షం/హైదరా–బాద్:** దీర్ఘకాలంగా ఉన్న ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పోరాటానికి కార్మిక సంఘాలు సిద్ధమౌతున్నాయి. ఇందుకోసం ముందుకు వచ్చే ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసిని ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మేరకు ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పలు కార్మిక సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఎంప్లాయిస్ యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఎన్. బాల్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె.రాఘవులు, కోశాధికారి కె.రామిరెడ్డి, తెలంగాణ మద్దూర్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.కమలాకర్ గౌడ్ చీఫ్ అడ్వైజర్ బి.యాదయ్య, బహుజన కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కత్తుల యాదయ్య, బుద్ధ విశాల్, బి.రాములు, బి.డబ్ల్యు.యు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.వి.కె.యాదవ్, సుద్దాల సురేష్, డి.రామచంద్రం, కార్మిక పరిషత్ నుండి బి.యాదగిరి, ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ఆర్‌టిసి కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆర్‌టిసి కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే గతంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకిచ్చిన హామీలను విస్మరించిందని, రాష్ట్రవ్యాప్తంగా ప్రధానంగా యూనియన్ల ప్రాతినిధ్యం లేకపోవడం వలన, వాటిపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం వలన అన్ని డిపోలలో కార్మికులపై అధిక పనిభారం మోపి నిత్యం వేధింపులకు యాజమాన్యం పాల్పడుతోందని, రాబోయే రోజులలో ఆర్‌టిసి ఉనికికి, కార్మికుల భద్రతకు ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల వలన పెను ప్రమాదం ముంచుకు వస్తోందని తెలియజేస్తూ, ఆర్థిక అంశాలపైన, ఇతర పెండింగ్ అంశాలపైన ఈ సమావేశంలో చర్చించామన్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులలో ఉన్న కార్మికవర్గాన్ని మరోసారి పోరాటం వైపు తీసుకురావటానికి కలిసివచ్చే సంఘాలతో జెఎసిగా ఏర్పడి సర్కారు ఇచ్చిన హామీల అమలుకై సమరం సాగించడానికి ఈ నెల11 జరిగే మరో సమావేశంలో నూతన జెఎసిని ఎన్నుకుని, అదేరోజు ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

## నవీన్ యాదవ్‌కు మద్దతుగా జోరందుకున్న సిపిఐ ప్రచారం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రచారం జోరందుకుంది. నవీన్ యాదవ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం షేక్‌పేట్ డివిజన్‌లోని ఓయూ కాలనీ, వినోబా నగర్, మారుతినగర్, సీతానగర్, హరిజన బస్తీ, వినాయక్ నగర్ ఏరియా సిపిఐ నేతలు విస్తృతంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ మాట్లాడుతూ.. బిజెపితో అంతర్గతంగా చీకటి ఒప్పందాన్ని చేసుకున్న బిఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో కెటిఆర్ ఓటమి భయంతో కాంగ్రెస్ అభ్యర్థిపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఏమి ఒరగబెట్టిందో చెప్పకుండా దిగజారి దూషణలకు దిగుతుండడం గర్హనీయమన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల అదేవిధంగా విద్యా రంగ, నిరుద్యోగ సమస్య పట్ల చిత్తశుద్ధితో ఉన్నదని అందుకనే ప్రజలు కాంగ్రెస్‌ని గెలిపించాలని సిపిఐ నిర్ణయం తీసుకుందని అన్నారు. మతం తప్ప ఏనాడు ప్రజల జీవితాల గురించి మాట్లాడని కేంద్రమంత్రి బండి సంజయ్ మతవిద్వేషాలు సృష్టించడానికి కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఇటువంటి నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తే వారిపై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని ఇప్పుడు ఆ పార్టీ నేతలు మొసలి కన్నీరు కారుస్తుండడం విచారకరమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ మాట్లాడుతూ.. పదేండ్ల బిఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వ స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రజల ఆస్తులు దోచుకున్నారని ఆరోపించారు. అడిగిన వారిపై అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపారని ఇప్పుడు వచ్చి ఓట్లు అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, కాంగ్రెస్ పార్టీ షేక్ పేట్ డివిజన్ ఇంచార్జి క్రాంతి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, షేక్ షంషుద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, కొమురెల్లి బాబు, సైఫ్, నరసింహ, షానా అంజుమ్, అనిల్, దశరథ్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.


# జర్నలిస్టుల కోసం హైపవర్ కమిటీ

దాడులు, దౌర్జన్యాలపై విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో జర్నలిస్టులపైన జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హైపవర్ కమిటీ'ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెండేళ్లపాటు పని చేయనుంది. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించి హైపవర్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు ఉత్తర్వులు (జిఒ నంబర్ 219) జారీ చేశారు. సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి ఛైర్మన్‌గా మొత్తం 14 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సమాచార, పౌర సంబంధ శాఖను ఆదేశించింది.

జర్నలిస్టుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి, దాడులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకునేందుకు హైపర్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. అవసరమైతే కమిటీ తరచూ సమావేశమై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనుంది. కాగా ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలనలను, ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది.

**కమిటీ:** ఛైర్మన్‌గా సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి, సభ్యులుగా హోం శాఖ ముఖ్యకార్యదర్శి/ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పొలిటికల్ డిపార్ట్‌మెంట్ ముఖ్యకార్యదర్శి, సమాచార, పౌర సంబంధాలశాఖ ఇ.ఒ స్పెషల్ సెక్రెటరీ, అదనపు డిజి (లా అండ్ ఆర్డర్), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్143/2013), 'తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ 9/2014), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (H2843/2010), తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ (టిఎఇఎంజె), తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ యూనియన్ (టిఇఎంజెయు), స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్స్ అసోసియేషన్(418/2014), తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్, మ్యాగజైన్స్ అసోసియేషన్ (788), తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (హెచ్69/2017/టిఎస్) ఉన్నారు. కాగా మెంబర్ కన్వీనర్‌గా సమాచార, పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరక్టర్/డైరక్టర్ ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సైబర్ మోసానికి 'ఎంపి' బలి

### బ్యాంక్ ఖాతా నుంచి రూ.56 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

**కోల్‌కతా:** దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సామాన్యులతోపాటూ సెలబ్రిటీలు కూడా నేరగాళ్ల ఉచ్చులో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా ఓ ఎంపీ సైబర్ మోసానికి బలయ్యారు. ఆయన బ్యాంక్ అకౌంట్ నుంచి నేరగాళ్లు ఏకంగా రూ.50 లక్షలు కాజేశారు. తణమూల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నాలుగుసార్లు లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సైబర్ మోసానికి బలయ్యారు. స్టేట్ బ్యాంక్‌లో ఎంపీ ఖాతాను సైబర్ నేరగాళ్ల నకిలీ పత్రాలను ఉపయోగించి యాక్సెస్ చేశారు. నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించి మోసానికి పాల్పడ్డారు. అకౌంట్ నుంచి ఏకంగా రూ.56 లక్షలు కాజేశారు. ఈ సొమ్మును వివిధ ఖాతాలకు తరలించడం, ఏటీఎమ్ ద్వారా విత్‌డ్రా చేయడంతోపాటూ ఆభరణాల కొనుగోళ్లకు ఉపయోగించినట్లు తేలింది. ఈ ఘటనపై అత్యవసర దర్యాప్తు కోరుతూ సైబర్ క్రైమ్ పోలీసులకు కోల్‌కతా ఎస్‌బీఐ బ్రాంచ్ ఫిర్యాదు చేసింది. దర్యాప్తు కొనసాగుతోంది.

## ఎస్ఐఆర్ వద్దు: 'సుప్రీం'లో డిఎంకె పిటిషన్



**న్యూఢిల్లీ :** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో శుక్రవారం తమిళనాడుకు చెందిన డీఎంకె పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఎస్ఐఆర్‌ను తమ రాష్ట్రంలో చేపట్టరాదని ఆ పిటిషన్‌లో కోర్టును కోరింది. దీనిపై అత్యవసరంగా వాదనలు చేపట్టాలని డీఎంకె అభ్యర్థించింది. అయితే మంగళవారం ఈ కేసుపై వాదనలు చేపట్టనున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. ఇటీవల బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టి 65 వేల ఓటర్లను తొలగించారు. ఇది విజయవంతం కావడంతో దీన్ని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ఈసీ భావిస్తోంది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం... పిటిషన్‌ను స్వీకరించింది. న్యాయవాది వివేక్ సింగ్ ఆ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా డీఎంకె ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి ఈ నెల మూడో తేదీన పిటిషన్ వేశారు. ఈ ప్రక్రియ రాజ్యాంగ వ్యతిరేకమని, ప్రజాస్వామ్య హక్కులకు ప్రమాదం అవకాశం ఉన్నట్లు ఆరోపించారు. తమిళనాడులో ఎస్ఐఆర్ చేపట్టాలని గత నెల 27న ఈసీ ఇచ్చిన నోటిఫికేషన్ కొట్టివేయాలని వివేక్ తన పిటిషన్‌లో కోరారు.

## ఆర్‌బిఐ చర్యలతో ఎస్‌బిఐ పటిష్టం


### సంజయ్ మల్హోత్రా



**ముంబై:** ఒకప్పుడు నష్టాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఇప్పుడు 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా చెప్పారు. 2018లో నష్టాల్లో ఉన్న ఎస్‌బీఐ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన సంస్కరణల కారణంగానే ఈ స్థాయికి చేరిందన్నారు. ఈ మేరకు ముంబైలో ఎస్‌బీఐ బ్యాంకింగ్, ఎనకమిక్స్ కాన్‌క్లేవ్ 2025లో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఆర్‌బీఐ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, కీలక విధానపరమైన నిర్ణయాలే దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాయని మల్హోత్రా అన్నారు. ఆర్‌బీఐ తీసుకున్న చర్యలతో రుణ గ్రహీతల్లో క్రమశిక్షణ అలవడడంతో పాటు బ్యాంకుల ఆస్తుల నాణ్యత మెరుగైందన్నారు. ముఖ్యంగా దివాలా చట్టం2016, కోర్టు వెలుపలి పరిష్కార మార్గాలు వంటివి రుణవిధానాల్లో కీలక మార్పునకు నాంది పలికాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు సంక్షోభాన్నే అవకాశంగా మలుచుకుని 2014 నుంచి ఆర్‌బీఐ అనేక చర్యలు చేపట్టిందని మల్హోత్రా అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దీర్ఘకాలిక చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనికితోడు 27గా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులను 2020 నాటికి 12కి తగ్గించడం, బ్యాంకులకు పెద్ద మొత్తంలో మూలధనం సాయం, బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం, ఆరోగ్యకర రుణ వాతావరణం కల్పించడం వంటివీ బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదం చేశాయన్నారు.

## బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు

### కంచి ఆలయం



**చెన్నై:** తమిళనాడులోని కాంచీపురంలో గల వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఆలయ యాజమాన్యం స్పందించింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు జరగలేదని స్పష్టం చేసింది. 'ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగ్‌కు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ, తాపడాలు మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం' అని ఆలయ కార్యనిర్వాహక అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలు మార్చేసి... వాటి స్థానంలో కొత్త తాపడాలు ఏర్పాటుచేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరికి తాపడాలలో ఎలాంటి మార్పు లేదని నిర్ధారించారు.

## హోల్‌సేల్‌గా ఓటు చోరీ

### బిహార్‌లోనూ కొనసాగింపునకు బిజెపి యత్నం

**తన వ్యాఖ్యలను ఇసి కూడా ఖండించలేదు : రాహుల్ గాంధీ**





**న్యూఢిల్లీ/ బంకా :** ఢిల్లీలో ఓటు వినియోగించుకున్న బిజెపి నేతలు, బిహార్ తొలివిడత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటు వేశారని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బిజెపి ఎన్నికలను హోల్‌సేల్‌గా దొంగతనం చేస్తోందని ఆరోపించారు. నరేంద్ర మోదీ ఎన్నికలను దొంగిలించడం ద్వారా ప్రధానమంత్రి అయ్యారని ఆరోపించారు. బిజెపి ఎన్నికలను ఎలా దొంగిలిస్తుంది అనే విషయాన్ని దేశంలోని యువతకు, జనరల్ జెడ్‌కు కాంగ్రెస్ స్పష్టంగా చూపించిందన్నారు. ఓటరు దొంగతనంను వెలికితీసే ఇంకా ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బిహార్‌లోని బంకా జిల్లాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాహుల్ హర్యానాలోని 2 కోట్ల ఓటర్లలో 29 లక్షలు నకిలీవని పునరుద్ఘాటించారు. ఇదే తరహాలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోనూ చేశారన్నారు. ప్రస్తుతం బిహార్‌లో ఓట్ల చోరీకి యత్నిస్తున్నారని ఆరోపించారు. తన ఆరోపణలను ఇసి సైతం ఖండించడం లేదని రాహుల్ గాంధీ తెలిపారు. బిహార్ ప్రజలు ఈ తరహా ఓట్ల చోరీని అనుమతించరని తనకు తెలుసన్నారు. ఎన్‌డిఎ సర్కార్ సమస్యలపై యువత ప్రశ్నించకుండా వారిని దారి మళ్లిస్తూ సోషల్‌మీడియా రీల్స్‌లో ముంచుతోందని రాహుల్‌గాంధీ ఆక్షేపించారు. రీల్స్ 21వ శతాబ్దపు వ్యసనం అని గాంధీ అన్నారు. ఎన్నికలను తారుమారు చేయడం ద్వారా నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఆ విషయం నిరూపిస్తానని ఆయన పేర్కొన్నారు. మరోవైపు హర్యానా ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ అక్కడ ఎన్నికల చోరీ జరిగిందన్నారు. నకిలీ ఓటు, నకిలీ ఫొటోపై తాను చేసిన ఆరోపణలకు ఎన్నికల సంఘం నుంచి ఎటువంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. అదేవిధంగా బ్రెజీలియన్ మోడల్ ఫొటోతో ఓటింగ్ ఎలా జరిగిందని రాహుల్ ప్రశ్నించారు. భగల్‌పూర్‌లో జరిగిన మరో ఎన్నికల ర్యాలీలో, బిహార్‌లోని రైతులు, కార్మికులు, నేత కార్మికులు బ్యాంకుల నుండి రుణాలు పొందరని, వారి రుణాలను మాఫీ చేయరని రాయ్‌బరేలి ఎంపి ఆరోపించారు. అయితే, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ కొన్ని కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తుందని గాంధీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి ముఖాన్ని 24 గంటలు చూపించడానికి టివి ఛానెల్‌లకు బిజెపి డబ్బు చెల్లిస్తుందని కూడా రాహుల్‌గాంధీ ఆరోపించారు. 'మీడియాను బిజెపి నియంత్రిస్తోంది... మనం ఏమి చెప్పినా, మీరు దానిని సోషల్ మీడియాలో చూడవచ్చు... కానీ, టీవీ ఛానెళ్లలో కాదు. నరేంద్ర మోదీ, అమిత్ షా, ఇసి హర్యానా ఎన్నికలను దొంగిలించారు. తమ వద్ద నలుపు, తెలుపు రంగులో ఆధారాలు ఉన్నాయి...

హర్యానా ప్రభుత్వం 'చోరీ కి సర్కార్' (దొంగతనం ద్వారా ఏర్పడిన ప్రభుత్వం) అని నేను పూర్తి నమ్మకంతో చెప్పగలను' అని ఆయన పేర్కొన్నారు.

## మోదీ, నితీశ్‌పై నమ్మకం వల్లే బిహార్‌లో పెరిగిన ఓటింగ్

**ప్రధాని మోదీ వ్యాఖ్యలు**



**ఔరంగాబాద్ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో భాగంగా గురువారం పోలింగ్ జరగగా, గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డుస్థాయిలో నమోదైంది. దీనిపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు 'నరేంద్ర, నితీష్' ల ట్రాక్ రికార్డ్‌పై నమ్మకం ఉంచడం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. శుక్రవారం మోదీ ఔరంగాబాద్, కైమూర్ జిల్లా ప్రధాన కార్యాలయం అయిన భభువాలో వరుస ర్యాలీలనుద్దేశించి ప్రసంగించారు. బిహార్‌లో జెడి (యు) అధ్యక్షుడు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలింగ్ జరిగిన 121 నియోజకవర్గాలలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎన్నికల సంఘాన్ని కూడా ప్రశంసించారు. తాను వాగ్దానం చేసిన వాటిని అమలు చేస్తానని పేర్కొంటూ రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఆపరేషన్‌సిందూర్ వంటి ఉదాహరణలను ఆయన ఉదహరించారు. ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్షాల తప్పుడు వాగ్దానాలకు వారు మోసపోలేదని, మిత్రపక్షంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ కూడా ఆర్‌జెడి మ్యానిఫెస్టోలో చేసిన వాగ్దానాలను విశ్వసించడం లేదన్నారు. తేజస్వి యాదవ్ పేరును ప్రస్తావించకుండా అడవి రాజ్ యువరాజు తాను చేస్తున్న బూటకపు వాగ్దానాలను నెరవేర్చడానికి తన ప్రణాళికలు ఏమిటని అడిగినప్పుడల్లా నాలుక కరచుకుంటున్నారన్నారు. నక్సలైట్లు రాజ్యమేలుతున్న సమయంలో, ఎన్నికల సమయంలో హింస, బాంబు పేలుళ్లలో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన 'జంగిల్‌రాజ్' తిరిగి రావాలని ప్రజలు కోరుకోవడం లేదని నొక్కి చెప్పారు. వివాదాస్పదంగా మారిన ఆర్‌జెడి ఎన్నికల ప్రచారం గురించి ప్రస్తావిస్తూ, 'జంగిల్ రాజ్ వల్లాలు పిల్లలకు కూడా కట్టా (లైసెన్స్ లేని దేశీయంగా తయారు చేసిన తుపాకీ),దునాలి (డబుల్ బ్యారెల్ తుపాకీ) వంటి వాటి గురించి మాట్లాడటం నేర్పించారని దుయ్యబట్టారు. లాంతరు (ఆర్‌జెడి), పంజా (కాంగ్రెస్ చిహ్నం), లాల్ జెండా(వామపక్షాల ఎర్ర జెండాలు) చూసి పెట్టుబడిదారులు పారిపోతారని విమర్శించారు. ఈసారి కూడా వారు అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించారని, కానీ ఎన్నికలను క్రమబద్ధంగా నిర్వహించినందుకు ఎన్నికల సంఘాన్ని అభినందిస్తున్నానన్నారు. కాగా, ప్రధానమంత్రి ఒక ర్యాంకు పెన్షన్ పథకం గురించి కూడా మాట్లాడుతూ మాజీ సైనికుల ఖాతాల్లోకి రూ. లక్ష కోట్లు బదిలీ అయ్యాయన్నారు.

**'గత 35-40 ఏళ్లలో గెలవని స్థానాలను కాంగ్రెస్‌కు కేటాయించింది'**

'బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడిని ఆర్జేడీ అవమానించింది. గత 35–40 ఏళ్లలో గెలవని స్థానాలను కాంగ్రెస్‌కు కేటాయించింది. పాయింట్ బ్లాంక్‌లో గన్ పెట్టి సిఎం పదవిని లాలు పార్టీ తస్కరించింది. ఇప్పుడు కూడా అనేక స్థానాల్లో కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీ పోటీ పడుతున్నాయి. వారి సహచరులు వారే వెన్నుపోటు పొడుస్తున్నారు. అలాంటి వారు మీకు మంచి చేస్తారా? కాంగ్రెస్, ఆర్‌జెడి కేవలం అవమానం, వేధింపులతోనే రాజకీయం చేస్తుంది. కాంగ్రెస్ రాజకుటుంబం ఛాతి మైయా పూజను డ్రామా అన్నారు. మహా కుంభమేళాను అనవసరమని చెప్పారు. మనం చేసే ప్రతీ పండగలతో వారు ఇబ్బందులకు గురవుతారు. మన విశ్వాసాలను ఈ రాజకుంటుంబీకులు అవమానిస్తూనే ఉంటారు. ఇలాంటి వారికి నవంబర్ 11న జరిగే పోలింగ్‌లో మీ ఓటుతో గట్టి బదులు చెప్పాలి. ఇప్పటికే కాంగ్రెస్ ఓటమికి కారణాల కోసం వెతుకులాడుతోంది అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి... పైలట్‌ను నిందించలేం

**తేల్చిచెప్పిన 'సుప్రీంకోర్టు'**

**ప్రాథమికనివేదికలో అతడిపై ఎలాంటి ఆరోపణ లేదని వెల్లడి**




**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో జూన్ 12న ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన ఘటనలో 260మంది ప్రాణాలను బలిగొన్న ప్రమాదానికి ఎయిర్ ఇండియా డ్రీమ్‌లైనర్ చీఫ్ పైలట్‌ను ఎవరూ నిందించలేదని సుప్రీంకోర్టు శుక్రవారం పేర్కొంది. అతడి 91ఏళ్ల తండ్రి ఎటువంటి భావోద్వేగ భారాన్ని మోయవద్దని కోరింది. 'ప్రాథమిక నివేదికలో కూడా అతడిపై ఎలాంటి ఆరోపణలేదు'అనిజస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.అవసరమైతే దురదృష్టకర విమాన ప్రమాదానికి పైలట్‌ను నిందించకూడదని నొక్కిచెబుతూ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మరణించిన పైలట్ కెప్టెన్ సమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)కు నోటీసులు జారీచేసింది. అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం ఎఐ17 కూలిపోవడంపైసుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని పుష్కరాజ్ సభర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలెట్స్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 'మొదట ఇది దురదృష్టకర విమాన ప్రమాదం. రెండవది మీ కొడుకును నిందిస్తున్నారని మీరు మీపై భారం మోయకూడదు. విమాన ప్రమాదానికి పైలట్‌ను ఎవరూ నిందించకూడదు. ఇది ఒక ప్రమాదం' అని బెంచ్ పుష్కరాజ్ సభర్వాల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ చెప్పారు. 'ఈ ప్రమాదం పైలట్ తప్పిదం వల్ల జరిగిందని కౌంటీలోని ఏ ఒక్కరూ నమ్మరు' అని ధర్మాసనం చెప్పింది. విమాన ప్రమాదాలకు దారితీసిన తప్పిదాలను ఎత్తిచూపి పేరులేని ప్రభుత్వ మూలాన్ని ఉటంకిస్తూ అమెరికా ప్రచురణ సంస్థ వాల్ స్ట్రీట్ జనరల్ ఒకవార్తా కథనాన్ని ప్రచురించిన తర్వాత ఇదంతా ప్రారంభమైందని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ ధర్మాసనానికి తెలియజేశారు. 'ఇది ఇండియాను నిందించడానికి మాత్రమే ప్రచురించిన ఒక దుష్ట వార్తా కథనం. మేం విదేశీ మీడియా కథనాల గురించి ఏమాత్రం ఆందోళన చెందడం లేదు. ఈ దేశంలోని ఏ ఒక్కరూ ఇది పైలట్ తప్పిదం వల్లే జరిగిందని విశ్వసించడం లేదు' అని శంకర్‌నారాయణన్ చెప్పారు. మీడియా నివేదికల ప్రకారం గౌరవంతో అతని పరిష్కారం అమెరికన్ కోర్టులో ఉందని, అక్కడ అతను దావా వేయవచ్చునని జస్టిస్ బాగ్చి చెప్పారు. 'మీ ఆందోళన అర్థం చేసుకొనదగినదే కానీ, ప్రజల అభిప్రాయానికీ, వాస్తవ పరిస్థితికీ మధ్య ఒక స్పష్టమైన అసంబద్ధత ఉంది' అని జస్టిస్ బాగ్చి జోడించారు. 'ఎఐబి దర్యాప్తు పరిధిని నిందించడం కాదు. నివారణకు చర్యలను సూచించడమే. అవసరమైతే పైలట్‌ను నిందించడం తగదని మేం స్పష్టం చేయగలం' అని ధర్మాసనం చెప్పింది. 'మనది దాదాపు 142 కోట్లమంది జనాభా కలిగి ఉన్న దేశం. పైలట్‌పై నిందవేయాలని ఏ ఒక్కరూ భావించరు. ఈ విషాధ ఘటనకు కారణం ఏదైనప్పటికీ అది పైలట్ల తప్పిదం మాత్రం కాదు' అని ధర్మాసనం జోడించింది. ఈ విషయంపై స్వతంత్ర దర్యాప్తును కోరుతున్నామని, విషాధం తర్వాత తయారు చేసిన ప్రాథమిక నివేదిక స్వతంత్ర దర్యాప్తు ఆధారంగా లేదని శంకరనారాయణన్ అన్నారు. ప్రమాదంపై దర్యాప్తు ప్రక్రియ ప్రకారం జరిగిందని జస్టిస్ బాగ్చి స్పష్టంచేశారు. ఈ విషాధ సంఘటనపై న్యాయమైన, పారదర్శకమైన, సాంకేతికంగా బలమైన దర్యాప్తు జరగాలని పుష్కరాజ్ సభ ర్వాల్ కోరారు. ఆయన మాట్లాడుతూ 'నా కొడుకు 30 ఏళ్లకు పైగా విధి నిర్వహణలో ఎలాంటి మచ్చలేని కెరీర్‌ను కలిగి ఉన్నాడు. 15,638గంటలు ఎటువంటి సంఘటనలు చోటుచేసుకుండా విమానయానం చేశాడు. బోయింగ్ 7878 ఎయిర్‌క్రాఫ్ట్‌లో 8,596 గంటలు ప్రయాణించినప్పటికీ ఒక్క లోపం లేదా మరణానికి కారణమైన సంఘటన కూడా నివేదించబడలేదు అని పుష్కరాజ్ సభర్వాల్ గుర్తుచేశారు. అక్టోబరు 10 న ఎపి &జె ఛాంబర్ల ద్వారా దాఖలు చేయబడిన ఈ పిటిషన్‌లో కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ డిజిసిఎ మరియు ఎఎఐబిలను ప్రతివాదులుగా చేర్చారు.

## వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌లోనే..




**న్యూఢిల్లీ :** దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఎటిసి) వ్యవస్థలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో దాదాపు 350 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముందుగా షెడ్యూల్ చేసిన పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌లో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. దీని ప్రభావం ఉత్తరాది ఎయిర్ పోర్టులపైన పడింది. అయితే ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని రన్‌వేపై విమానాలు పార్కింగ్ చేసేందుకు సరిపడినంత స్థలం లేనందున పలు సర్వీసులు రద్దు చేసినట్లు ఎయిర్ పోర్ట్ వర్గాలు వివరించాయి. అయితే గురువారం సాయంత్రం నుంచే ఎటిసిలో ఈ సమస్య ఉత్పన్నమైందని వెల్లడించాయి. ఇక అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా పలు విమానాల సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపింది. ఆ క్రమంలో చాలా ఆలస్యంగా విమాన సర్వీసుల నడుస్తున్నాయని చెప్పింది. మరోవైపు ముంబయి ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎటిసి వ్యవస్థ కుప్పకూలింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక న్యూఢిల్లీ ఎయిర్ పోర్టు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతి రోజు ఇక్కడి నుంచి దాదాపు 1,500 విమానాలు రాక పోకలు సాగిస్తాయి. ట్రాకింగ్ వెబ్ సైట్‌లో విమాన సర్వీసు బయలుదేరు సమయం దాదాపు 60 నిమిషాలు ఆలస్యం చూపిస్తోంది. ఈ సాంకేతిక లోపాన్ని పరిష్కరించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి పని చేస్తున్నామని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధి వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే దీనిపై ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్, ఇండిగో ఎయిర్ లైన్స్ సంస్థలు తమ ఎక్స్ ఖాతా వేదికగా స్పందించాయి. ఇలా చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు సిబ్బంది సహాయం చేస్తున్నారని వివరించాయి. ఎటిసి వ్యవస్థలో ఏర్పడిన లోపం కారణంగా.. అన్ని విమాన సర్వీసుల రాకపోకలపై ఈ ప్రభావం పడిందని స్పైస్ జెట్ ఎయిర్ లైన్స్ వెల్లడించింది. అదే విధంగా ఎయిర్ ఇండియా సంస్థ సైతం స్పందించింది. ఈ ఊహించని అంతరాయం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. ఎటిసిలో ఏర్పడిన లోపాన్ని పునరుద్ధరించేందుకు టెక్నిషియన్స్ పూర్తి స్థాయిలో పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. కొన్ని గంటల్లోనే సాధారణ పరిస్థితికి తీసుకు వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్టులో భారీగా ప్రయాణికుల క్యూ లైన్లు దర్శనమిస్తున్నాయి. పలు విమాన సర్వీసులను రీ షెడ్యూల్‌పై ప్రకటనల మీద ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు విమాన సర్వీసుల ఆలస్యంపై సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

## వందేమాతరం ఎప్పుడైనా పాడారా?

### ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కార్యాలయాల్లోనూ వినిపించలేదు: ఖర్గే




**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్యోద్యమ సమయంలో భారతీయులకు స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి నేటికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ఈ పాట ప్రసిద్ధ నినాదం. అయినప్పటికీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ కార్యాలయాల్లోగానీ, శాఖల్లోగానీ ఏనాడు పాడలేదు. సొంత గ్రంథాల్లోగానీ, సాహిత్యంలోనూ ఈ పాటను పొందుపరచలేదు. అలాంటిది ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ గేయ 150వ స్మారకోత్సవాలు జరుపుతున్నాయని ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆర్ఎస్ఎస్ జాతీయ గీతం కంటే నమస్తే సదా వతసలే పాడటానికే ఇష్టపడిందని ఆయన తన ప్రకటనలో ఎత్తిచూపారు. కాంగ్రెస్ పార్టీ 1986 నుండి నేటి వరకు ఏ సమావేశమైనా, ప్లీనరీ అయినా, బ్లాక్‌స్థాయి సమావేశం అయినా నేతలు వందేమాతరం పాట ఆలపిస్తారు. నేడు జాతీయవాద సంరక్షకులమని చెప్పుకునే ఆర్ఎస్ఎస్, బీజేపీ తమ శాఖల్లోగానీ లేదా కార్యాలయాల్లో గానీ వందేమాతరం లేదా మన జాతీయ గీతం జనగణమనను ఎప్పుడూ పాడకపోవడం విడ్డూరం. వాటికి బదులుగా వారు దేశాన్ని కాకుండా... వారి సంస్థలను కీర్తిస్తూ నమస్తే సదా వత్సల అనే పాట పాడుతున్నారు. 1925లో స్థాపించినప్పటి నుండి ఆర్ఎస్ఎస్ సార్వత్రిక గౌరవం ఉన్నప్పటికీ వందేమాతరాన్ని నిరాకరించింది. ఈ పాటను ఆర్ఎస్ఎస్ స్వీకరించలేదు. ఆర్ఎస్ఎస్ గ్రంథాలలో లేదా సాహిత్యంలో ఒక్కసారి కూడా పాట ప్రస్తావన కనిపించదని ఖర్గే తన ప్రకటనలో విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో జరిగిన ఈ గేయ 150వ వార్షికోత్సవాలకు హాజరయ్యారు. స్మారక స్టాంపును ఆయన విడుదల చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బీహార్‌లోని పట్నాలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆయన దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారని, ఈ గేయాన్ని పలకడానికి ఇష్టపడని ఈ నాయకులు ఇలాంటి ఉత్సవాల్లో పాల్గొనడం బాధాకరమని ఖర్గే మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆర్ఎస్ఎస్ భారతీయులకు కాకుండా బ్రిటీష్ వారికి మద్దతు ఇచ్చింది. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసింది. 52 సంవత్సరాలు జాతీయ జెండాను ఎగురవేయలేదు. బాబాసాహెబ్ అంబేద్కర్ దిష్టిబొమ్మలు తగలబెట్టిందనే విషయం అందరికీ తెలుసు. సర్దార్ పటేల్ మాల్లో చెప్పాలంటే గాంధీజీ హంతకులు అని ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వందేమాతర గర్వాన్ని మోసేది కాంగ్రెస్‌నే. 1896లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రహమతుల్లా సయాని నాయకత్వంలో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటిసారిగా వందేమాతరం పాటను బహిరంగంగా పాడారు. ఆ క్షణం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ప్రాణం పోసింది. మత, కుల, ప్రాంతీయ గుర్తుంపును తారుమారు చేస్తూ బ్రిటీష్ సామ్రాజ్యం విభజించి పాలించే విధానం, భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి రూపొందించబడిందని కాంగ్రెస్ అర్థం చేసుకుంది. దీనికి వ్యతిరేకంగా వందేమాతరం గీతం అచంచలమైన శక్తి గీతంగా మారింది. భారతమాత పట్ల భక్తితో భారతీయులందరినీ ఏకం చేసిందని ఖర్గే గుర్తుచేశారు. 1905 బెంగాల్ విభజన నుండి మన విప్లవకారుల తుది శ్వాస వరకు వందేమాతరం దేశమంతటా ప్రతిధ్వనించింది. ఇది లాలా లజపతిరాయ్ ప్రచురణ శీర్షిక అని, భికాజీ కామా తయారు చేసిన జెండాపై చెక్కబడిందని ఖర్గే పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటానికి గుండె చప్పుడుగా మారిన ఈ పాటను బ్రిటీష్‌వారు నిషేధించారని ఖర్గే అన్నారు. 30 సంవత్సరాలకు పైగా ఈ పాట భారత జాతీయవాదంపై ప్రభావం చూపిందని, ఈ పాట భారత జాతీయవాదానికి సంబంధించిందని, అలాంటి ప్రజల పాటలు ప్రత్యేకంగా రూపొందించబడలేదని 1938లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

## రూ.4 లక్షలు చాలడం లేదు

### 'సుప్రీం'లో షమీ మాజీ భార్య పిటిషన్

**న్యూఢిల్లీ :**నెలనెలా తనకు భరణం, కుమార్తె సంరక్షణ కోసం చెల్లిస్తున్న రూ.4 లక్షలు సరిపోవడం లేదని టీమ్‌ఇండియా స్టార్ బౌలర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసీన్ జహాన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సమాధానం ఇవ్వాలని షమీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తనకు, తన కుమార్తెకు కలకత్తా హైకోర్టు మంజూరు చేసిన జీవనోపాధిని పెంచాలని కోరుతూ జహాన్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన కోసం నెలకు రూ.1.5 లక్షలు, కుమార్తె సంరక్షణ కోసం నెలకు రూ.2.5 లక్షలు షమీ చెల్లించాలని కోల్‌కతా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఆమె సవాలు చేశారు. ఈ మొత్తం తమకు సరిపోవడం లేదని సుప్రీం కోర్టు దష్టికి తీసుకువెళ్లారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి.నం.ఎ4/513/2024 eGP Portal - Tenders టెండరు ప్రకటన తేది: 03.11.2025
ఈ దేవస్థానమునకు అవసరమైన క్యాలెండర్లు మరియు డైరీలు ముద్రణ మరియు సరఫరా చేయుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 08.11.2025 మధ్యాహ్నం గం.12:00లకు, **టెండరు దాఖలు చేయు చివరి తేది:** 18.11.2025 మధ్యాహ్నం గం.12:00ల వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేది:** 18.11.2025 మధ్యాహ్నం గం.12:30లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 18.11.2025 మధ్యాహ్నం గం.3.00లకు,
ఇతర వివరములకు https://tender.telangana.gov.in నందు చూడవచ్చును.
సం/- కె.దామోదర్ రావు
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 10357-PP/CL/ADVT/1/2025-26, Date: 07-11-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్ఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన
NIT No. 31/EE-Div.29/SBZ/GHMC/2025-26 తేది: 07.11.2025
**పని పేరు:** జిహెచ్ఎంసి, ఎస్‌బిజెడ్, సికింద్రాబాద్, డివిజన్-29 నందు అన్ని వార్డులలో 2025 సంవత్సరానికి నవంబర్-2025 నుండి డిసెంబర్-2025 వరకు వర్షా కాలం తరువాత తుఫాను నీటి కాలువల పూడిక తీయడం. **అంచనా విలువ / ఇసివి :** రూ.33.45లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 10.11.2025న సా.4.00గం.ల నుండి 13.11.2025న సా.4.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10372-PP/CL/ADVT/1/2025-26, Date: 07-11-2025



# ప్రపంచం WORLD NEWS

## రోడ్డెక్కిన గ్రీస్ విద్యార్థులు

### 40 నగరాల్లో భారీ ర్యాలీలు

### విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి డిమాండ్

**ఏథెన్స్:** గ్రీస్‌లో విద్యార్థులు భారీస్థాయిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి కదం తొక్కారు. అధ్యాపకుల నియామకాలు, వారి క్రమబద్ధీకరణ, మెరుగైన బోధనా పద్ధతులు, వేతనాల్లో పెంపుదల కోసం డిమాండ్ చేశారు. దేశంలోని 40 నగరాల్లో ర్యాలీలు జరిగాయి. లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు వారికి మద్దతు ఇచ్చారు. అధ్యక్షుడు తసొలాస్ ప్రభుత్వం అనుసరించే కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించారు. విద్యను వ్యాపారంగా మార్చవద్దని, విజ్ఞానాన్ని పెంపొందించే విద్యా సంస్థల్లో సిబ్బంది కొరతను పరిష్కరించాలని, తక్షణమే టీచర్లను భర్తీ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యా రంగంలో సంస్కరణలు, బోధనా పద్ధతుల్లో మెరుగుదలను కోరారు. విద్యను ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులు హెచ్చరించారు.

## సమష్టిగా ముందుకు...



### వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్లీనంలో టు లామ్ పిలుపు

**హనోయ్:** పార్టీ, ప్రజలు, దేశం ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు టు లామ్ పిలుపునిచ్చారు. రాజధాని హనోయ్‌లో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ 13వ కేంద్ర కమిటీ 14వ ప్లీనం గురువారం మొదలై, శుక్రవారం ముగిసింది. పొలిట్‌బ్యూరో సభ్యుడు ల్యూంగ్ క్యూంగ్ అధ్యక్షతన ప్లీనం జరిగింది. 14వ జాతీయ మహాసభకు సన్నాహాల్లో భాగంగా ఏడాది పాటు చేపట్టిన కార్యకలాపాలపై, పార్టీ, ప్రజలు, సైనికపంగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనపై సభ్యులు చర్చించారు. పార్టీ నిర్మాణం, రాజకీయ వ్యవస్థ నిర్మాణంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. టు లామ్ మాట్లాడుతూ 'సమయం తక్కువ, పని ఎక్కువ. అయినా శక్తిమేరకు పనిచేశాం. అనుకున్న లక్ష్యాల్లో చాలా వాటిని ముందుగానే సాధించుకోగలిగాం' అని అన్నారు. సవాళ్లను అధిగమిస్తూ వ్యూహాత్మకంగా ముందుకెళుతూ దేశ ప్రయోజనాలు, ప్రజా శ్రేయస్సు కోసం శ్రమించినట్లు తెలిపారు. కమ్యూనిస్టు ఆలోచనలతో ముందుకెళ్లడం ద్వారా పార్టీ, ప్రజలు, దేశ ప్రయోజనాల కోసం శక్తిమేరకు బాధ్యతగా పనిచేస్తున్నట్లు టు లామ్ తెలిపారు. భవిష్యత్తు అభివృద్ధి కోసం పునాది వేసుకోవాలని, లక్ష్యాలు సాధించాలన్నారు. పార్టీ తీర్మానాల అమలును ప్రముఖంగా చర్చించారు. ఐదేళ్ల ముందుగానే లక్ష్యాలు సాధించుకున్నట్లు తెలిపారు.

## వచ్చే ఏడాది భారత్ వస్తా

### మోదీ గొప్ప వ్యక్తి... మిత్రుడు

### రష్యా చమురు కొనడం ఆపేశారు : ట్రంప్



**వాషింగ్టన్:** 'రష్యా చమురు కొనుగోలు చేయడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ చాలా వరకు ఆపేశారు. ఆ దేశంతో చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయి. కాబట్టి వచ్చే ఏడాది భారత్‌కు వెళ్లాలని ఉంది' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఓవల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత్‌తో వాణిజ్య చర్చలలో పురోగతి ఉన్నట్లు తెలిపారు. 'అంతా గొప్పగా సాగుతోంది. ఆయన (మోదీ) రష్యా నుంచి చమురు కొనడం లేదు. ఆయన మంచి మిత్రుడు. గొప్ప వ్యక్తి. మేమిద్దరం తరచూ మాట్లాడుకుంటాం. ఏ విధంగా ముందుకెళ్లాలో నిర్ణయిస్తాం. గతంలో నా భారత్ పర్యటన గొప్పగా సాగింది. మళ్లీ తప్పక వెళతాను' అని ట్రంప్ అన్నారు. 2026లో న్యూఢిల్లీలో జరగబోయే క్వాడ్ సదస్సుకు హాజరు కావచ్చన్న సంకేతాలు ఇచ్చారు. ఈ సదస్సు కోసం ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాలకు భారత్ ఆతిథ్యమివ్వనున్నది. అలాగే, సుంకాలు, భారత్ పాక్ మధ్య యుద్ధం ఆపడం గురించీ ట్రంప్ మాట్లాడారు. సుంకాలను గొప్ప అస్త్రంగా అభివర్ణించారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దానీ అమెరికాను గౌరవించాలని, లేకపోతే బాధ్యతల నిర్వహణ కష్టమవుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, గ్లోబలిస్టులపై అక్కసు వెళ్లగక్కారు. అధికారంలో ఉన్నంత వరకు అమెరికాను కమ్యూనిస్టు కానివ్వవన్నారు. ఇదిలావుంటే మమ్దానీకి సోషలిస్టులు, కమ్యూనిస్టుల అభినందనలు వెల్లువెత్తాయి. అమెరికాలో ప్రగతిశీల భావజాలం వ్యాప్తిని స్వాగతిస్తున్నట్లు జర్మనీ కమ్యూనిస్టు పార్టీ (ది లెఫ్ట్), కమ్యూనిస్టు పార్టీ యూఎస్ఏ వెల్లడించాయి. పెట్టుబడిదారీ వర్గంపై శ్రామిక వర్గం విజయమే తాము కోరేదని తెలిపాయి. మమ్దానీ గెలుపుతో సోషలిస్టు ఉద్యమానికి ఊపు తిరిగొచ్చిందని వ్యాఖ్యానించాయి. అమెరికా అంతటా సోషలిజంపై చర్చ జరుగుతున్నట్లు తెలిపాయి.

## స్వీడన్ కమ్యూనిస్టు విప్లవానికి 30 ఏళ్లు




**స్టాక్‌హోమ్:** స్వీడన్ కమ్యూనిస్టు విప్లవానికి 30 ఏళ్లు పూర్తి అయ్యాయి. మూడు దశాబ్దాల కిందట అంటే 1995 నవంబరు 45 తేదీల్లో స్వీడన్ కమ్యూనిస్టులు నిర్ణయాత్మక ముందడుగు వేశారు. కమ్యూనిస్టు విప్లవాత్మకతను కొనసాగించాలని నిర్ణయించారు. ఆ తేదీల్లోనే స్వీడన్ కమ్యూనిస్టు పార్టీ పేరును మరోమారు సొంతం చేసుకున్నారు. శ్రామికవర్గం ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తితో సోషలిజం కోసం పోరాటాలతో ఈ పేరు ముడిపడి ఉంది. ప్రస్తుతం జరుపుకునే 30వ వార్షికోత్సవం పార్టీ సంస్థాగత చరిత్రలో కీలక ఘట్టం మాత్రమే కాదు... కమ్యూనిస్టు ఉద్యమంలో దశాబ్దాలు సాగిన అవకాశవాదంపై రాజకీయ విజయానికి గుర్తు. అయితే స్వీడన్ కమ్యూనిస్టు పార్టీ పేరు ఓ బాధ్యతగా పార్టీ పేర్కొంది. స్వీడన్‌లో కమ్యూనిస్టు ఉద్యమం ఎప్పుడూ ఓడిపోలేదని, సవాళ్లను మాత్రమే ఎదుర్కొందని, అంచెలంచెలుగా ఎదిగిందని ఈ వార్షికోత్సవం నొక్కి చెబుతోందని వెల్లడించింది. భవిష్యత్తుపై మరింత విశ్వాసంతో పార్టీ ముందుకెళుతోందని, శ్రామికవర్గానికి అండగా నిలుస్తోందని పేర్కొంది. చారిత్రక పోరాటాలకు భవిష్యత్తు విజయాలకు మధ్య ప్రత్యక్ష సాక్షిగా ఈ పేరును గౌరవిస్తున్నామని స్వీడన్ కమ్యూనిస్టు పార్టీ వెల్లడించింది.

## మేధాశక్తే ఓ ప్రయోగశాల (3వ పేజీ తరువాయి)

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయం దిశగా తీసుకెళుతాయని అన్నారు. విద్యార్థుల మేధాశక్తియే ఒక ప్రయోగ శాలగా అభివర్ణించారు. విద్యార్థుల ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయన్నారు. అవకాశం, సమానత్వం సృజనాత్మకతతో ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి అన్ని రంగాల్లో విద్యా ప్రమాణాలు నెలకొల్పాలన్నారు. శాతావాహన విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యారంగం బోర్డు, చాక్ పీస్‌లకే పరిమితం కావద్దని, ప్రస్తుత విద్యారంగం సాంకేతికతతో ముందుకు సాగుతుందని, డిజిటల్ లర్నింగ్ భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని తెలిపారు. ప్రతీ విద్యార్థి నైపుణ్యం. నిరంతర అభ్యాసాలే విజయానికి దోహదం చేస్తాయన్నారు. ప్రపంచ విజ్ఞానాన్ని ఆహ్వానించాలని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని కోరారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరవవద్దని పిలుపునిచ్చారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని తెలిపారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని అలసటను అధిగమించి ముందుకు సాగాలన్నారు. కృషితో ప్రతీ విద్యార్థి అభివృద్ధి సాధ్యమేనని అన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2008లో ప్రారంభమైన యూనివర్సిటీ 200 ఎకరాల్లో విస్తరించి ఉందని తెలిపారు. 156 పిజి, యుజి కాలేజీలు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్నాయని తెలిపారు. ఫార్మసీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్, బిజినెస్ మెనేజ్ మెంట్, లా కోర్సులు యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బిజె రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆధ్వర్యంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,యూనివర్సిటీ వివిధ విభాగాల అధిపతులు, పలు విద్యా సంస్థల యజమానులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## దశ, దిశ మార్పు (3వ పేజీ తరువాయి)

జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానమిస్తూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోదని, అలాగే బిఆర్ఎస్ అధికారంలోకి రాదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందన్నారు. జూబ్లీ హిల్స్ ప్రజలు ఇచ్చే తీర్పు రాష్ట్ర దశ, దిశా మారబోతుందన్నారు. రాష్ట్రంలో ఏ వర్గాలూ సంతోషంగా లేవని, కేవలం రేవంత్ రెడ్డి బ్రదర్స్ మాత్రమే సంతోషంగా ఉన్నారన్నారు. హైడ్రా పేరుతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో చెప్పిన 11పెద్ద ప్రాజెక్ట్‌ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్‌లను బ్లాక్‌మెయిల్ చేసి సెటిల్‌మెంట్ చేసుకున్నారని, భట్టి ప్రెస్‌మీట్ పెడితే, సిఎం సెటిల్‌మెంట్ చేసుకున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. హైడ్రా అందరికీ సమానంగా ఉండాలని, పెద్దల ఇండ్లను కూల్చిన తర్వాత పేదలకు డబుల్ బెడ్‌రూమును కేటాయించి, పునరావాస చర్యలు చేపట్టిన తర్వాత ఎటువంటి అభివృద్ధి చేసినా పర్వాలేదని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే జూబ్లీ హిల్స్ ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ లేకపోతే ముస్లింలు లేరన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అన్యాయమని, ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అరాచకం వల్లనే నాడు పిజెఆర్ చనిపోయారని, నాటి బిఆర్ఎస్ హయంలోనే ఖమ్మంలో 60 అడుగుల ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి పోలీస్ కమాండ్ కంట్రోల్ లో కూర్చొని కమీషన్ల పైన సమీక్ష చేస్తున్నారని ఆరోపించారు.

**ఎన్నికల నుంచి సైడైన బిజెపి**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపి, కాంగ్రెస్ ఒకటై పనిచేస్తున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బిజెపి సైడ్ అయిందన్నారు. బిజెపికి రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం నుంచి తెలంగాణ కు తెచ్చింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిద్ర పోనివ్వబోదని, ఆరు గ్యారెంటీలపై నిలదీస్తున్నామన్నారు. ఓటు చోరీ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ , తెలంగాణలో జరుగుతున్న ఓటు చోరీ గురించి ఎందుకు మాట్లాడరని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్,ఆరోగ్య శ్రీ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 'మీట్ ది ప్రెస్'కు సీనియర్ జర్నలిస్టు దొంతు రమేష్ సమన్వయ కర్తగా వ్యవహరింగా, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీగిరి విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేశ్ వరికుప్పల వేదికపైన ఆసీనులయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను హరీశ్ రావు సన్మానించారు.

## లోపాయికారి ఒప్పందం (3వ పేజీ తరువాయి)

చేశారు. ప్రస్తుత ఉప ఎన్నికల్లో బిజెపికి కనీసం డిపాజిట్ వస్తుందా? అని కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.ఈ ఉప ఎన్నికల్లో బిజెపికి కేవలం పది వేల ఓట్ల కంటే ఎక్కువ రాబోవని చెప్పారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బాకీకార్డు పేరుతో బిఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రూ.8లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దివాళ తీయించారని మండిపడ్డారు.

## అగమ్యగోచరం (3వ పేజీ తరువాయి)

కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ మరణం విషయంలో ఆయన తల్లిని మానసిక క్షోభకు గురి చేశారని, కన్న కొడుకు ముఖం కూడా ఆమెకు చూడనియకుండా చేశారనే అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అసలు గోపీనాథ్ చనిపోయింది ఎప్పుడు?, ముందే చనిపోయారని చెబుతున్నారని, మరణ వార్తను ఎవరి కోసం ఆపారన్నారు. గోపీనాథ్ మరణంపై సమగ్ర విచారణ జరగాలని, గోపీనాథ్ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి యాజమాన్యం స్టేట్ మెంట్లను కూడా రికార్డు చేయాలన్నారు. తన తండ్రిని చూసేందుకు రావొద్దంటూ బిఆర్ఎస్ నేత మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బెదిరించినట్టుగా స్వయాన గోపీనాథ్ కొడుకే ఆరోపించారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మాగంటి గోపీనాథ్ ఆస్తులపైన సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి కెటిఆర్ కన్నేశారని,ఆస్తి పంపకాల్లో ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు వచ్చాయని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, కాంగ్రెస్,బిఆర్ఎస్‌లకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పని చేస్తున్నాయన్నారు. తమ సభలకు అనుమతి ఇవ్వడం లేదని, కానీ బిఆర్ఎస్, కాంగ్రెస్‌సభలకు అనుమతి ఇస్తున్నారని ఆరోపించారు. ముస్లిం ఓట్ల కోసం కాంగ్రెస్ యత్నిస్తోందని, హిందువులంతా తమ సత్తా ఏమిటో కాంగ్రెస్‌కు రుచి చూపాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఓట్ల కోసం దిగజారి మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ అంటేనే ముస్లింలు అని చెబుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి మల్క కొమరయ్య, ఎంఎల్ఎ పాయల శంకర్, నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, ఎస్.కుమార్, వేముల అశోక్, జె.సంగప్ప, సోలంకి శ్రీనివాస్, రితేష్ రాథోడ్ పాల్గొన్నారు.

## భారీ ఆపరేషన్ (3వ పేజీ తరువాయి)

వెల్లడించారు. నెల రోజుల వ్యవధిలో 196 ఎఫ్ఐఆర్ లను నమోదు చేశామని, సైబర్ నేరస్తుల మాయలో పడి సొమ్ము పోగొట్టుకున్న బాధితులకు రూ.62.34 లక్షలను తిరిగి అప్పగించామన్నారు. అలాగే.. నేరస్తులకు చెందిన 61 బ్యాంక్ అకౌంట్లలో రూ.107 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని శ్రీనివాస్ పేర్కొన్నారు.. అరెస్టైన సైబర్ నేరస్తులపై దేశవ్యాప్తంగా 136 కేసులున్నట్లు తెలిపారు. వీటిలో 45 కేసులు తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొన్నారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్ తో రూ.24.17 లక్షలు దోచుకున్న వ్యక్తితో పాటు.. హైదరాబాద్ లో 62 ఏళ్ల వృద్ధుడి వద్ద నుంచి రూ.1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ వ్యక్తి తన మొబైల్ ను పోగొట్టుకోగా ఆ మొబైల్ నుంచీ రూ.1.95 లక్షలను కాజేసిన నేరస్తుల్ని అరెస్ట్ చేశారు. అలాగే ఇన్వెస్ట్మెంట్, డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా ఫ్రాడ్ ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుల నుంచి 31 మొబైల్స్, 14 చెక్ బుక్స్, 9 డెబిట్ కార్డులు, 2 ల్యాప్ టాప్స్, 3 షెల్ కంపెనీ స్టాంప్స్, 2 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అధికారుల పేరుతో ఉన్న ప్రొఫైల్స్ నుంచి వచ్చే మెసేజులను నమ్మి మోసపోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. అలాగే తెలియని సోషల్ మీడియా పెట్టుబడి గ్రూపుల్లో చేరవద్దని, ఏపీకే ఫైల్స్, ఫిషింగ్ లింక్స్ వంటి వాటిని ఓపెన్ చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబిఐ, ఆర్‌బిఐ, ఇడి, కస్టమ్స్, న్యాయవ్యవస్థ, సైబర్ క్రైమ్ పోలీసులు, నార్కోటిక్స్ బ్యూరో,బిఎస్ఎన్ఎల్, ట్రాయ్ తదితర ఏజెన్సీల నుండి వస్తున్నట్లు చెప్పుకునే బెదిరింపు వీడియో కాల్స్ లేదా సందేశాలు వచ్చినప్పుడు ప్రజలు భయపడవద్దని, అనుమానాస్పద కాల్స్, మెసేజ్ లు వచ్చినపుడు 1930 హెల్ప్ లైన్ నంబరుకు ఫిర్యాదు చేయాలని అదనపు సిపి శ్రీనివాస్ సూచించారు.

అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎంఎల్ఎల సహకారం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, తద్వారా హైదరాబాద్‌కు అదనంగా గోదావరి జలాలను తీసుకొస్తామని, రేడియల్ రోడ్లను, మెట్రోరైల్‌ను విస్తరిస్తామని హామీనిచ్చారు. గోదావరి జలాలు అదనంగా 20 టిఎంసిలు హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డుకుంటున్నారని, హైదరాబాద్ నగరంలో నిర్మించాలనుకున్న ఫ్లైఓవర్లు, అండర్ ఫ్లై ఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్లకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఆనాడు హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం కాంగ్రెస్ నాయకులు పి.జనార్దన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డిలను హైదరాబాద్ బ్రదర్స్ అనే వాళ్లని, ప్రస్తుతం హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి, కెటిఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అని అంటున్నారని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మ ణ్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్‌లతో మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ నేత కెటిఆర్‌లపై సిఎం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**బిఆర్ఎస్ ఓటమి.. బిజెపి డిపాజిట్‌లు గల్లంత ఖాయం**

జూబ్లీహిల్స్ ఎన్నికలో బిఆర్ఎస్ ఓటమి ఖాయమని, బిజెపి డిపాజిట్ పోవడం ఖాయమని సిఎం ధీమా వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. భవిష్యత్ కోసం జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, ఓటెయ్యాలని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజెపికి డిపాజిట్ రాకపోతే హిందవులు బిజెపి వెంట లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఒప్పుకుంటారా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అందుకు ఈ ఎన్నికను ఒక రిఫరెండంగా బావిస్తారా అని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికపైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికే బాధ లేదని, కానీ కనీసం డిపాజిట్‌నైనా తీసుకురావాలని బండి సంజయ్, అరవింద్ ప్రయత్నిస్తున్నారన్నారు. మాగంటి గోపీనాథ్ చావును రాజకీయం చేయదల్చుకోలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గోపీనాథ్ తల్లి ఆరోపణలు చేశారని, చావుబతుకుల మధ్య ఉంటే కన్నతల్లిని

## అండగా నిలబడండి (3వ పేజీ తరువాయి)

చూడనివ్వలేదని పేపర్లో చూశానని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖరాస్తే విచారణ జరిపిస్తామని తెలిపారు.

**కంటోన్మెంట్‌లో రూ.5 వేల కోట్లతో 'ఎలివేటెడ్ కారిడార్' పనులు ప్రారంభం**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో గత 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న 'కంటోన్మెంట్ నుంచి శామిర్‌పేట, మేడ్చల్‌కు ఎలివేటెడ్ కారిడార్లకు తాను అనుమతి తీసుకొచ్చానని, రూ. 5వేల కోట్లతో పనులు ప్రారంభించామని సిఎం రేవంత్ చెప్పారు. ఈ రెండు కారిడార్లపైనే ఉత్తర తెలంగాణ మొత్తం ఆధారపడి ఉందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఎలివేటెడ్ కారిడార్ అనుమతులకు ప్రయత్నించలేదని విమర్శించారు. అలాగే వరంగల్, ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కూడా తామే అనుమతులు తీసుకొచ్చామని, అదనంగా కొత్తగూడెం, రామగుండం విమానాశ్రయాల నిర్మాణానికి కూడా ప్రయత్నిస్తున్నామని సిఎం తెలిపారు.

**విడతల వారీగా ఫీజు బకాయిలు**

ఫీజు రియంబర్స్‌మెంట్ నిదులను విడతల వారిగా విడుదల చేస్తామని, విద్యార్థుల జీవితాలతో ఆటలాడితే కళాశాలలైనా, వారి వెనకాల ఉన్న రాజకీయ పార్టీలననైనా ఉపేక్షించేది లేదని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ప్రైవేటు కళాశాలలను అసోసియేషన్‌కు చెందిన ఒకరు తమకు 12 కళాశాలలకు, మరొకరు మహబూబ్‌నగర్ లో ఉన్న కళాశాలకు అనుసంధానంగా హైదరాబాద్‌లో 'ఆఫ్ క్యాంపస్'కు అనుమతి ఇవ్వాని అడిగితే తాము తిరస్కరించామని వెల్లడించారు. అందుకే వారు ఆందోళనకు దిగారని మండిపడ్డారు. బంద్ పేరుతోప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల బకాయిలు చెల్లించలేదని బంద్ పాటిస్తున్నారని, మరి విద్యార్థుల విలువైన విద్యా సంవత్సరానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కళాశాలలో హాజరు శాతం, ఫేస్ రికోగ్నైజేషన్ , భవనాల పరిస్థితులు, ల్యాబులను పరిశీలించడం తప్పా అని అన్నారు. కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించేందుకు వెళ్లే కళాశాలలకు తాళాలు వేసుకుని వెళ్తున్నారని, ఇదేం పద్ధతి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు కళాశాలలు ఎంత మొత్తంలో డోనేషన్లను వసూలు చేస్తున్నారో అందరికీ తెలుసని, తాము వాటినికొంత వరకు నియంత్రించి, చట్టం అమలుచేద్దామంటే బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతారా? అని అన్నారు. చట్టాల గురించి ప్రస్తావిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కూడా ప్రభుత్వం, యాజమాన్యాలు ఇద్దరూ కలిసి ఇక చట్టాన్ని పూర్తిగా అమలు చేద్దామని, వచ్చే విద్యా సంవత్సరం ఇష్టానుసారంగా డొనేషన్లను ఎలా వసూలు చేస్తారో తాను చూస్తానని సిఎం హెచ్చరించారు. ప్రైవేటు కళాశాలల యాజమానాయలు ఒకరిద్దరి మాటలు వినకుండా వాస్తవాలను అర్థం చేసుకోవాలని సూచించారు.

**కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి**

హైదరాబాద్ ఎవరి హయంలో అభివృద్ధి చెందిందో ఆలోచన చేయండని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్రంలో 2004 నుంచి 2014 సంవత్సరాల మధ్య కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే హైదరాబాద్ భాగ్యనగరం ఎక్కువగా అభివృద్ధి చెందిందన్నారు. ఒఆర్ఆర్(ఔటర్ రింగురోడ్డు), శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, హైదరాబాద్ మెట్రో రైలు ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని సిఎం గుర్తుచేశారు. 2014లో రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్, రూ.60 వేల కోట్లతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే, బిఆర్ఎస్ ప్రభుత్వం 2023లో తమకు (కాంగ్రెస్ ప్రభుత్వానికి) రూ.8లక్షల కోట్ల అప్పులతో అప్పగించారని వివరించారు. నాటి యుపిఎ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని హైదారబాద్‌కు కేటాయించిన ఐటిఐఆర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేసింది ఎవరని ప్రశ్నించారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రగతి భవన్, సచివాలయం, కాళేశ్వరం ద్వారా ఎవరికైనా ప్రయోజనం కలిగిందా? అని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌లో చివరికి బాత్ రూమ్‌లకు కూడా బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు పెట్టించారని, ఢిల్లీలో తెలంగాణ భవనానికి కూడా బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు పెట్టించారని తెలిపారు. హైదరాబాద్‌కు వరదలు వచ్చినప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి వరద సాయంగా రూపాయి కూడా తీసుకురాలేదని సిఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

**పదేళ్లలో మెట్రో రైలును పొడిగించారా?**

పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును కొత్తగా కిలోమీటరు కూడా పొడిగించలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాతబస్తీకి మంజూరైన మెట్రోను కూడా పక్కకు పెట్టారని ఆరోపించారు. మెట్రో నిర్మించిన ఎల్ అండ్‌టి నష్టాలకు కూడా బిఆర్ఎస్ కారణమన్నారు. ఎల్ అండ్ టి కెటిఆర్ దగ్గర కమీషన్‌లు దండుకున్నాడని ఆరోపించారు.

ఎల్ అండ్ టితో కలిసి మెట్రో నిర్వహించే ఒప్పందంతో వస్తేనే అనుమతులు ఇస్తామని కేంద్రం చెప్పిందన్నారు. ఎల్ అండ్ టి మెట్రో విస్తరణ, నిర్వహణకు అంగీకరించలేదని, ఉన్న మెట్రోనే కొనుగోలు చేయమని చెప్పిందన్నారు. రూ.40 వేల కోట్ల విలువైన మెట్రోరైల్ రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని, గతంలో మెట్రోరైల్‌కు ఇచ్చిన భూములు అమ్మకం ద్వారా రూ.15 వేల కోట్లు సమకుర్చుకుంటామని తెలిపారు. ప్రభుత్వంపై భారం పడకుండా మెట్రోను కొనుగోలు చేయడంతో కిషన్ రెడ్డి, కెటిఆర్ అవాక్కయ్యారని రేవంత్ రెడ్డి అన్నారు.

హైడ్రా వ్యవస్థ ద్వారా చెరువులు ఆక్రమణలు గురికాకుండా కాపాడుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కెటిఆర్ ఒక విష పురుగు అని, ఆయనే నగరానికి గంజాయి, డ్రగ్స్ తీసుకొచ్చారని ఆరోపించారు. నగరంలో జరుగుతున్న అత్యాచారాలకు గంజాయి, డ్రగ్సే కారణమన్నారు. కెసిఆర్‌కు సన్నిహితంగా ఉన్న బిఆర్ఎస్ నాయకులను హరీశ్‌రావు ఒక్కొక్కరి రాజకీయంగా ఎలిమినేట్ చేస్తూ వచ్చారని, కీలక నేతలను చాలా చాకచక్యంగా హరీష్ రావు బయటకు పంపించారని ఆరోపించారు. చివరకు కల్వకుంట్ల కుటుంబాన్ని కూడా విడదీస్తున్నారని, ఇప్పటికే ఒకరిని దూరం చేశారని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## కేన్సర్ సోకిన ఫోర్త్‌స్టేజ్ రోగిలా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

### మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్యాన్సర్ సోకిన ఫోర్త్ స్టేజ్‌లో రోగిలా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బంద్ చేస్తామంటే ఎలా అని, ఫీజురియాంబర్స్‌మెంట్ ఇవ్వాలా కాకుంటే రేపు వస్తుందని, విద్యార్థుల భవిష్యత్ తిరిగి ఇస్తారా? అని ప్రశ్నించారు. ఆర్.కృష్ణయ్య అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారని, ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతిలో చిట్టా ఇస్తా, ఉన్న ఆర్థిక పరిస్థితిలో దేనికి నిధులు ఆపాలో చెప్పాలన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలకు ముందుగా ఫీజురియాంబర్స్‌మెంట్ విడుదల చేస్తామని సిఎం చెప్పారు. రూ.25 వేల కోట్లకు బ్యాంకుల పునర్ ఒప్పందం చేసుకున్నామని, దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.4 వేల కోట్ల వెసులుబాటు లభించిందన్నారు. ఇదే మాదిరిగా మరో రూ.2 లక్షల కోట్ల అప్పులకు సంబంధించి పునర్ ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇది సఫలమైతే రాష్ట్రానికి ఆర్థికంగా మరింత వెసులుబాటు లభిస్తుందన్నారు. అందుకోసమే ఢిల్లీకి మాటిమాటికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కేంద్రం, ఆర్‌బిఐ చుట్టూ తిరిగుతున్నామని తెలిపారు. కెసిఆర్ చేసిన అప్పులతో కొత్త అప్పులు పుట్టే పరిస్థితి లేదని చెప్పారు. కెసిఆర్ చేసిన అప్పులు కట్టడంతో పాటు ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయడంతో సర్దుబాటు కలవడం లేదన్నారు. నిధుల రాబడి పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

**ఓట్ చోరీకి అధ్యుడే కెసిఆర్..** ఓట్ చోరీకి కెసిఆరే ఆధ్యుడని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమేశ్ కుమార్ జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఉన్నప్పుడు ఓట్ల చేర్చడం, తొలగించడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. కెసిఆర్, కెటిఆర్‌లు అప్పుడే ఓట్ చోరీకి పాల్పడ్డారన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడంతో సోమేశ్ కుమార్‌ను తప్పించారని సిఎం గుర్తు చేశారు. మాటి మాటికి సిబిఐకి ఇవ్వండి విచారించి, కెసిఆర్, హరీశ్ రావును జైల్లో వేస్తామని చెప్పిన కిషన్ రెడ్డి ఇప్పుడు ఎందుకు అడ్డుపడుతున్నాడని ప్రశ్నించారు. జస్టిస్ పి.సి.ఘోష్ నివేదిక ప్రాథమిక విచారణ నివేదికను సిబిఐకి ఇచ్చామని తెలిపారు. ఇప్పటి వరకు ఎఫ్ఐర్ నమోదు చేయలేదని, విచారణ చేపట్టలేదన్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ అంశంలో చార్జిషిట్ తయారు అయ్యాక గవర్నర్ ఆమోదం కోసం పంపించామని, కానీ ఇప్పటి వరకు అనుమతించడం లేదన్నారు. కిషన్ రెడ్డి కెసిఆర్, హరీశ్ రావు, కెటిఆర్‌లను కాపాడుతున్నాడని ఆరోపించారు.

## చర్చలు సఫలం (3వ పేజీ తరువాయి)

రూ. 1,500 కోట్లను చెల్లించాలని కోరాగా, ఇప్పటికే రూ 600 కోట్లు విడుదల చేశామని, మరో రూ 600 కోట్లు వెంటనే విడుదల చేస్తామని, మిగతా రూ 300 కోట్లను కూడా కొద్ది రోజుల్లోనే క్లియర్ చేస్తాం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. అలాగే ఫీజు రియంబర్స్‌మెంట్‌కు సంబంధించి ఒక కమిటీ వేయాలని కళాశాలల యాజమాన్యాలు కోరగా, త్వరలో ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీలో అధికారులతో పాటు యాజమాన్యాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తామని, త్వరితగతిన కమిటీ నివేదిక వచ్చేలా చేస్తామని, ఏ రకమైన సంస్కరణలు అవసరమో చర్చిస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు..తమ మాటలను మీడియ వక్రీకరించింది.....**

దేవసేనను, సిఎం,డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులపైన తాము ఎటువంటి వ్యాఖ్యానాలు చేయలేదని, మీడియా సమావేశంలో ఒకటి మాట్లాడితే కొన్ని మీడియా సంస్థలు తమ మాటలను వక్రీకరించాయని ' పాతి' సంఘం అధ్యక్షుడు నిమ్మటూరి రమేష్ అన్నారు. తమ మాటలను వక్రీకరిస్తూ మీడియాలో వచ్చిన ప్రకటనల పట్ల తమ సంఘం తరపున ఖండించామని పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన కళాశాలలు సమ్మెకు వెళ్లడంతో కొన్ని పరీక్షలను, నిర్వహించలేకపోయినందుకు చింతిస్తున్నామని వివరించారు. ఇప్పటికే నిలిచిపోయిన పరీక్షలను రాసేందుకు మరోసారి అవకాశం కల్పించాలని యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి త్వరితగతిన ఏర్పాట్లు చేస్తామని నిమ్మటూరి రమేష్ వివరించారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని, లెక్చరర్ల ప్రదర్శనను రద్దు చేసుకుంటున్నామని ప్రకటించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో లెక్చరర్ల ప్రదర్శన తప్పు అని కోర్టు చెప్పిందని, నిరసన కార్యక్రమాలన్నీ రద్దు చేసుకున్నట్టు ప్రైవేటు కళాశాల యాజమాన్యాల సంఘం పాతి ప్రకటించింది.

## పరిమితికి మించిన ప్రయాణికుల వల్లే ప్రమాదాలు

ఆర్ఎంకు అద్దె బస్సుల యజమానుల వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బస్సులలో పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అద్దె బస్సు యజమానులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మం ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల పరిమితికి మించి బస్సులలో ప్రయాణిస్తున్నారని దీని వల్ల మైలేజీ రాకపోగా డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని అధిక బరువుతో టైర్లు పగిలిపోతున్నాయని యజమానులు తెలిపారు. నష్టాలను, కష్టాలను భరించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని దీనికి తోడు రోడ్లు సరిగ్గా లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. పరిమితికి మించిన ప్రయాణికులు ఉండడం వల్ల బీమా సంస్థలు కూడా పరిహారం ఇవ్వడం లేదని వినతి పత్రంలో ప్రైవేటు బస్సు యజమానులు పేర్కొన్నారు.

## పాఠశాలల్లో ఘనంగా వందేమాతర వేడుకలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని పాఠశాలల్లో వందేమాతర ఆలాపన నిర్వహించారు. గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో వేడుకల్లో భాగంగా 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు 150వ ఆకారంలో నిల్చుని వందేమాతర ఆలాపన చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గోపాలరావు మాట్లాడుతూ వందేమాతర గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ గేయాన్ని బంకించంద్ర చటర్జీ రచించారన్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కౌసల్య, రాధ, పంచాయతీ కార్యదర్శి రాజు, సిబ్బంది వీరన్న, రవి, పాషా, స్థానికులు ఉపేందర్, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రం సిసిఐ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండలో పత్తి కొనుగోలు కేంద్రం సిసిఐ ఏర్పాటు చేయాలని చంద్రుగొండ తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షులు వారాధి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చాపలమడుగు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వారు చంద్రుగొండ తహసీల్దార్‌కి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. వరి ధాన్యం ఏ గ్రేడ్ 3900రూపాయలు, బి గ్రేడ్ 3700 మద్దతు ధర ఇవ్వాలని, రైతులు అందరం కలిసి డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో వేబ్రిడ్జి లేదని నిర్మించుకున్నారు. చంద్రుగొండ మండలంలో సాదాబైనామ, వారసత్వ భూములకు వెంటనే మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వామిత్ర యాజమాన్యం హక్కు పత్రం కల్పించాలన్నారు. సత్యనారాయణ, లాలు మోహన్‌రావు, శేఖర్, మోహన్‌రావు, బేటీ సోమయ్య, పి వే ణు, పి వెంకటి, వెంకటాచారి, తన్నీరు లక్ష్మి నారాయణ, నెక్కడుపు రామారావు, రాములు, రాంబాబు, కే సాగర్, డి మల్లేష్, ఈ కిషన్, సిద్ధిని సీతారాములు, పి నాగరాజు, ఏ సత్యం, రాచర్ల వెంకటేశ్వర్లు, జి బాలు, కె కోటేశ్వరరావు, సున్నం శోభన్నమ్మ, మొఖం రాధా, కౌసల్య, వరి, పత్తి రైతులు, నందమూరి హమాలి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.5లక్షల బీమా అందజేత



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని తూతక్క లింగన్నపేట గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త పసుపులేటి కృష్ణ ప్రమాదవశాత్తు మరణించారు. పసుపులేటి కృష్ణ జనసేన పార్టీలో చురుకుగా పని చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన తెలుసుకున్న జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, ప్రమాదవశాత్తు మరణించిన క్రియాశీలక కార్యకర్త కుటుంబాలకు రూ.5 లక్షల బీమా చెక్కును పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రియాశీలక వాలంటరీ బొగ్గరపు శివకృష్ణ చేతుల మీదుగా శుక్రవారం కార్యకర్త కుటుంబ సభ్యులకు అందజేసి పార్టీ తరపున కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుటుంబానికి అండగా నిలిచిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం భరత్, కొవ్వూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జట్టుకు మూడవ స్థానం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తెలంగాణ రాష్ట్ర అండర్ 14 బాలుర ఫుట్‌బాల్ టోర్నమెంటులో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు మూడవ స్థానం సాధించింది. వికారాబాద్‌లో నవంబర్ మూడు నుంచి ఐదు వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అండర్ 14 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టు అద్భుత ప్రదర్శనతో మూడవ స్థానం సాధించింది. ఆ జట్టులో వి. వెంకటాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.లక్ష్మి నాగచరణ్, బి. జన్వీర్ లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఇదే పాఠశాల నుంచి చెన్నకేశవ, సాయిచరణ్, సుభాష్, సాత్విక్, హర్షశ్రీ, శృతి, జయశ్రీ, యమున, జశ్విత, హరిక, మనీషా, అంజలి, మాధవి తదితరులు అండర్ 14 బాలికలు, అండర్ 17 బాలురు, బాలికలు, అండర్ 19 బాలుర విభాగంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనడానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## సామినేని కుటుంబానికి సిపిఐ పరామర్శ



**ప్రజాపక్షం/చింతకాని:** ఇటీవల హత్యగావించబడిన సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు కుటుంబాన్ని సిపిఐ నేతలు శుక్రవారం పరామర్శించారు. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ రామారావు హత్యకేసులో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని , పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్నారు. పరామిర్శంచిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, మండల నాయకులు తాళ్ళూరి యాదగిరి, కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.

## వసతి గృహంలో హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గల ఎంజేపిటి బిసి గర్ల్స్ బాలాజీ నగర్ నందు శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించి వారి వారి రుగ్మతలను బట్టి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ పిల్లల్లో ఎక్కువగా చర్మ సంబంధమైన స్కేబీస్, డెర్మటైటిస్, కాన్స్టిపేషన్ వంటి సమస్యలు ఉన్నాయన్నారు. కొందరిని హాస్పిటల్ కు రిఫర్ చేయడం జరిగింది అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, లో తడి దుస్తులు ధరించరాదని, వకరి దుస్తులు మరొకరు ధరించరాదని, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని, నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# జాతి సమైక్యతను చాటిన వందేమాతర గేయం

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఆలాపన

యువతలో ఉట్టిపడ్డ దేశభక్తి







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భారత జాతి సమైక్యతను చాటి చెప్పేలా వందే మాతర గేయం ఆలాపన జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగింది. బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర జాతీయ గీతానికి 1950 జనవరి 24న జాతీయ గేయ హోదాను తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ఇస్తున్నట్లు ప్రకటించారు. వందేమాతర గేయం రచించి నవంబర్ 7వ తేది నాటికి 150సం. అవుతున్న సందర్భంగా ఈ జాతీయ గేయాన్ని దేశవ్యాప్తంగా ఆలపించాలనే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సామూహిక వందే మాతర గేయాలాపన అత్యంత దేశభక్తితో సాగింది. ఇందులో భాగంగా జిల్లా ఐడిఓసి సమావేశ మందిరంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది వందే మాతర గేయాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా అధికారులంతా దేశభక్తి, ఐక్యత స్ఫూర్తిని ప్రతిబింబించే ఈ గేయం భారత స్వాతంత్ర సమరంలో పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకున్నారు. ఎస్‌పి రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వందేమాతర గేయాలాపన దేశభక్తి ఉట్టిపడేలా సాగింది. అదే విధంగా జిల్లాలోని అన్ని పోలీస్టేషన్లలో కూడా ఆలపించారు.

**భద్రాచలం ఐటిడిఏలో :** వందే మాతర గేయాలాపన దేశమాత ఆరాధనతో సమానం అని, ఇది దేశ స్వాతంత్ర సాధనకు బలమైన సంకల్పాన్ని కలిగించిందని ఐటిడిఏ డిడి అశోక్ అన్నారు. ఆర్‌సిఓ అరుణ కుమార్, ఏఓ సున్నం రాంబాబుతో పాటు సిబ్బందితో కలిసి సామూహిక గేయాలాపన చేశారు. ఈ గేయంలో భారతజాతి ప్రజల్లో శబ్దం, ఆత్మ విశ్వాసం ప్రేరణ నింపుతుందని, భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందని అన్నారు. ఐటిడిఏ అధికారులు ఉదయ్, వేణు, ప్రభాకర్, అలివేలు, హరికృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చైతన్య కార్యక్రమంలో ఎఎస్‌పి విక్రాంత్ సింగ్




**ప్రజాపక్షం/భద్రాచలం :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితాలను బంగారు మయంగా మార్చుకోవాలని ఏఎస్‌పి విక్రాంత్ సింగ్ కుమార్ అన్నారు. చైతన్యం కార్యక్రమంలో భాగంగా మద్దు పదార్థాలు వల్ల కలిగే అనార్థాలు, యువత భవిష్యత్ పై పట్టణంలో కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుండి కాలేజీ గ్రౌండ్ వరకు ప్లాకార్డులతో యువతతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గ్రౌండ్‌లో జరిగిన మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను పాడు చేసుకోవచ్చని, యువత గంజాయిని బానిసకవుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని, అలాంటి వారి జీవితాలు అర్థాంతరంగా ఆగిపోతాయని చెప్పారు. నేటి యువత చక్కగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

## భారతగడ్డపై సిపిఐకి వందేళ్ల చరిత్ర

40 దేశాల నుండి తరలిరానున్న ప్రతినిధులు

సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భారతదేశ స్వతంత్రానికి కంటే ముందే దేశంలో సిపిఐ ఆవిర్భవించిందని, ఆ మహోత్తర పోరాట పటిమి గల పార్టీ భారతగడ్డపై శతవసంతాలు పూర్తి చేసుకుంటోందని పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చంద్రరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని, యానంబైలు, రాజాపురం పంచాయితీల్లో ఇంటింటికీ సిపిఐ ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సిపిఐ వందేళ్ల పార్టీ అని, నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా ముందుందని చెప్పారు. దేశస్వాతంత్ర సమరంలో సిపిఐ అనేక సందర్భాల్లో అగ్రభాగాన నిలిచిందని చెప్పారు. వందేళ్ల సంబురంలో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెంబర్ 26న శతవసత ముగింపు సభ కనీవినీ ఎరుగని రీతిలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచంలోని 40 దేశాల నుండి ప్రతినిధులు తరలివస్తున్నారు. 5 లక్షల మంది బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ సభ జయప్రధానిగి లక్షలాదిగా తరలిరావాలన్నారు.జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, మండల కార్యవర్గ సభ్యులు, రైతు సంఘం మండల అధ్యక్షులు కొంగర అప్పారావు, ఎస్‌కే ఖాసీం, శెట్టిపల్లి లక్ష్మ ణరావు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకమని కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ సాంప్రదాయ పంటలైన వరి, పత్తి, మిర్చి వంటి పంటలు కాకుండా ఆయిల్ పామ్ వంటి పంటలను రైతులు సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. తాము 30 ఏళ్లుగా ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తూ అంతర పంటలుగా కోకో, వక్క, మిరియాలు వంటి బహుళ పంటలను సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుందని, కోతుల బెడద ఉండదన్నారు. మార్కెట్ సౌకర్యం ఉన్న పంట అని తెలిపారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సదస్సులో అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఉద్యానవన శాఖ, గోద్రెజ్ కంపెనీ వారికి సూచించారు. శాస్త్రవేత్త డా।। కిరణ్ ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఏఎంసి మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, గోద్రెజ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ చావా వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, మందడపు సుధాకర్, వాంకుడోత్ దీప్లానాయక్, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 'హలో కామ్రేడ్స్.. చలో ఖమ్మం'

త్యాగాల పునాదులపై నిర్మితమైనది సిపిఐ

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు




**ప్రజాపక్షం/బోనకల్:** డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మోటమర్రి సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో హలో కామ్రేడ్స్..ఛలో ఖమ్మం అంటూ ఇంటింటి ప్రచారాన్ని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావుతో కలిసిఆయన 3వ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిందని అన్నారు. దోపిడికి పాల్పడుతున్న వర్గాలకు వ్యతిరేకంగా మార్క్స్ సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ఎన్నో విజయాలు సాధించదని తెలిపారు. వేలాది మంది త్యాగాలతో ఈ విజయాలు సాధ్యమైనవని అన్నారు. ఈ వంద సంవత్సరాల ఉద్యమాలను, పోరాటాలను, విజయాలను ప్రజలకు వివరిస్తూ మరింత పట్టుదలతో సిపిఐ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. మోటమర్రి గ్రామంలో అమరులు మరీదు హన్మంతు, వంగాల బసవయ్య, మరీదు నరసింహారావు సిపిఐ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. అమరుల ఆశయ సాధనలోనే నేటికి సిపిఐ సభ్యులు, నాయకులు నడుస్తున్నారన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, పోరాటాలు, ప్రజల పక్షాన సాధించిన విజయాలను నేటి తరాలకు తెలియజేస్తూ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, కార్యదర్శి వంగాల కృష్ణ, వంగాల బ్రహ్మం, వంగాల నరేంద్ర, సహకార మాజీ వైస్ ప్రసిడెంట్ గుడిద వెంకటేశ్వర్లు, వంగాల నాగేశ్వరావు, గీత పనివారుల సంఘం అధ్యక్షులు మరీదు మల్లయ్య, వంగాల నారాయణ, మరీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బడుగుబలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/కామేపల్లి:** రాజకీయాలు వర్గాల కతీతంగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యపడుతుందని, కాంగ్రెస్ పార్టీలోనే నిజమైన రాజకీయ ప్రజాస్వామ్యం ఉందని, కావున బీసీ బిడ్డ నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, డిసిసిడి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్లకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాజకీయంగా వేడెక్కిస్తుంది. అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీకి, బిఆర్ఎస్ బిజెపి పార్టీలకు అగ్నిపరీక్షగా మారింది. ఈ నేపథ్యంలో ఇల్లందు నియోజకవర్గము నుండి ఎంఎల్‌ఏ కోరం కనకయ్య, కామేపల్లి మాజీ జెడ్‌పిటిసి మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస నాయకులు షేక్ ఫతే మహమ్మద్‌లు, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఎందుకు ఓటెయ్యాలనే విషయాన్ని ప్రచారం చేయడం జరిగింది. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రెహమాత్‌నగర్, బోరబండ కృష్ణానగర్, ఎర్రగడ్డ ఏరియాలో జరిగిన ప్రచారం సందర్భంగా వారు మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపు సునాయాసమని, గెలుపును ఆపే శక్తి ఎవరికీ లేదని, కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, నవీన్ యాదవ్, వారి తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ నవ యువ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తుందని తెలిపారు.

# నకిలీ దందా.. కల్తీ కల్లోలం





ఏది అసలోఏదీ నకిలీనో

బోధపడక ప్రజలు ఇబ్బందులు

ఆహార పదార్థాల కల్తీతో అనారోగ్యాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మార్కెట్‌లోకి అసలు వచ్చిన కొన్ని గంటల్లోనే నకిలీ పుట్టుకొస్తుంది. ఇది నిత్యం వాడుకునే వస్తువుల దగ్గర నుంచి బట్టలు, సాంకేతిక పరికరాలు సహా అన్నింటికి ఈ నకిలీలు తయారవుతున్నాయి. ఈ నకిలీల కారణంగా అసలు ఏదో నకిలీ ఏదో అర్థం కాక వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్రాండెడ్ ఉత్పత్తులకు సైతం చిన్న అక్షరాల తేడాతో నకిలీలు తయారవుతున్నాయి. నకిలీలను సైతం అసలు ధర కంటే ఒక రూపాయి ఎక్కువే విక్రయిస్తుండటం శోచనీయం. ఈ వస్తువుకు నకిలీ ఉంది. ఈ వస్తువుకు లేదు అనేది లేకుండాపోయింది. దైనందిన జీవితం ప్రారంభమయ్యే పేస్టు దగ్గర నుంచి మొదలుకుని ప్రతి దానికి ఒక నకిలీ పుట్టుకొచ్చింది. సబ్బులు, తల నూనెలు మొదలుకుని అన్ని వస్తువుల్లో నకిలీలు దర్శనమిస్తున్నాయి. అన్నింటి కంటే ప్రమాదకరంగా ఆహార పదార్థాలకు నకిలీ ఉత్పత్తులను సృష్టించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. వివిధ అనారోగ్యాలకు గురైన వారు వాడుతున్న మందుల్లో పెద్ద ఎత్తున నకిలీలు తయారవుతున్నాయి. చాలా మందుల దుకాణాల్లో వినియోగదారులకు ఈ నకిలీలను అంటగడుతున్నారు. అసలు ఖరీదులో పదవ వంతుకే కొందరు నకిలీ మందులను దుకాణాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ డూప్లికేట్ వ్యవస్థను నియంత్రించడానికి తగిన యంత్రాంగం లేదు. విత్తనాలు, పురుగుమందులు నకిలీలు వినియోగంలోకి రావడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో పాటు ఉత్పత్తి రంగంపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. నగదుకు నకిలీ నోట్లు వచ్చాయి. బంగారం నకిలీది వినియోగదారులకు అంటగడుతున్నారు. నోట్ల నకిలీ కారణంగా నష్టపోతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. ఇవాళ అత్యంత ఖరీదైనదిగా చెబుతున్న బంగారానికి కూడా నకిలీది మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. హాల్‌మార్క్ అంటూనే నకిలీది అంటగడుతుండటం శోచనీయం. మద్యం ప్రియులు సేవించే మద్యంలోనూ నకిలీ మద్యం మార్కెట్‌లో విచ్చలవిడిగా చెలామణి అవుతుంది. నకిలీ ధృవపత్రాల సృష్టి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నకిలీ ధృవపత్రాలతో ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు దొరికిపోతున్నారు. అన్నింటికి మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చాలా మందికి ప్రధాన వృత్తిగా మారడం, అతిపెద్ద ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉండడంతో అసలు భూ ఆధార ధృవ పత్రాలకు నకిలీలు పుట్టుకొస్తున్నాయి. అసలు యజమానులు నకిలీ ధృవపత్రాల సృష్టి కారణంగా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. విద్యార్థులను ముఖ్యంగా శిక్షణ కేంద్రాల్లో మోసం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పుడు నకిలీకి ఈ వస్తువు ఉంది దీనికి లేదనేది లేకుండా అన్నింటికి నకిలీలు పుట్టుకొస్తున్నాయి. ఇక కల్తీలు ప్రతి దానిలోనూ కల్తీలే. కళాయిలో నూనె పోసి కమ్మని పదార్థాలు తయారు చేసుకుందామన్న ఆలోచన ఉండగానే బుస్సున పొంగి వంటగది పొగమయం అవుతుంది. చూస్తే నూనె ప్యాకెట్‌పై బ్రాండ్ నేమ్ అలాగే ఉంటుంది. ఇటీవల కాలంలో నూనెల కల్తీలు ముఖ్యంగా ద్రవ పదార్థాల్లో కల్తీలు తారా స్థాయికి చేరాయి. ఆహార పదార్థాలు కల్తీలు జరుగుతుండడంతో ప్రజలు రోగాల భారీన పడుతున్నారు. ప్రజలకు కలిగే అనారోగ్యానికి సంబంధించి ఎక్కువ భాగం ఆహార పదార్థాల ద్వారానే జరుగుతుందని వైద్యులే ప్రకటిస్తున్నారు.



## కెవి పాఠశాలలో వందేమాతరం 150వ దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/ఖిలా వరంగల్:వందేమాతరం రచించబడి ఆలపించబడిన ఈ రోజుకు 150 సంవత్సరాలు అయినందున ఈ ప్రత్యేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు కెవి పాఠశాల యందు విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక బృందం, పాఠశాల పరిసర ప్రాంతాల వారు అందరూ కలిసి ఉదయం 10 గంటలకు వందేమాతరం గీతాన్ని కలిసికట్టుగా ఆలపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ దాసి రజిని, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపక బృందం, స్థానికులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ సత్యశారద



ప్రజాపక్షం /వర్ధన్నపేట: వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ ను శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద దేవి సందర్శించారు. మార్కెట్‌లోని వడ్లను ఆర బెట్టే యంత్రం గూర్చి రైతులకు వివరించారు. రైతులకు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలోని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ,వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, కార్యదర్శి శ్రీనివాస్, రాజు, అగ్రికల్చర్ అధికారి విజయ్ కుమార్, పౌర సరఫరా శాఖ అధికారులు, ఐకెపి ధాన్యం కొనుగోలు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బయోగ్యాస్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచండి: గుండు సుధారాణి



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: బయోగ్యాస్ ప్లాంట్‌యొక్క సామర్థ్యాన్ని పెంచాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణంలో గల బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్‌ను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి మేయర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ అధికారులను ప్లాంట్ నిర్వహణ తీరును అధికారులను అడిగిన క్రమంలో ప్లాంట్ సామర్థ్యం రెండు టన్నులు అని ప్రస్తుతం 1.5 టన్నుల సామర్థ్యంలో నిర్వహిస్తున్నామని ఈ ప్లాంట్ నుండి కార్యాలయంలో గల పాత భవనంలోని మొదటి అంతస్తుకు ఈ ప్లాంట్ నుండి విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలుపగా ప్లాంట్ సామర్థ్యాన్ని 2 టన్నులకు పెంచాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## వరుస వర్షాలతో మానుకోట పారిశుద్ధ్యం అస్తవ్యస్తం


వార్డులను సందర్శించిన సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్:మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 21 22 36 వార్డులను శుక్రవారం సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి సందర్శించి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుస వర్షాల నేపథ్యంలో మానుకోటలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగాఉందన్నారు. రోడ్ల చుట్టూ ఇరువైపులా చెత్తాచెదారం పెరిగి రవాణా, పాదచారులకు ఇబ్బందిగా మారిందని, కుక్కలు, పందులు, జంతువులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 21 వ వార్డులోని జిమ్ చుట్టూ ఫెన్సింగ్ ధ్వంసం అయిందని దాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రోడ్లపైకి చెత్త చెదారం చేరి అస్తవ్యస్తంగా ఉందని 36వ వార్డులో రైల్వే ట్రాక్ పక్కన కాలువ మరియు ఇతర సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా వీధిలైట్లు పాడై చిమ్మ చీకట్లో ప్రజలు నడవాలసి వస్తోందన్నారు. వెంటనే వీధిలైట్లు అమర్చాలని, మున్సిపాలిటీ కమిషనర్ అధికారులు వెంటనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పట్టణంలో పారిశుద్ధ్యం సమస్యను వీధిలైట్లు కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. పారిశుధ్య సమస్యపై వీధిలైట్ల ఇన్చార్జి ఉపేందర్, కొత్త బజార్ జవాన్ చిరంజీవితో ఫోన్ లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు పెరుగు కుమార్, సుభాని, చరణ్, మల్లయ్య, ప్రవీణ్ చారి పాల్గొన్నారు.

## బియ్యం గింజపై వందేమాతరం

మైక్రో ఆర్టిస్ట్ శ్రీరామోజు జయకుమార్ ప్రతిభ




ప్రజాపక్షం / నర్సంపేట : బియ్యం గింజపై 191 ఆంగ్ల అక్షరాలతో రాసిన వందేమాతర గేయంను మరోసారి మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ ప్రజలంతా దేశభక్తిని కొనసాగిస్తూ దేశ ఉన్నతిలో భాగస్వామ్యులుకావాలని జయకుమార్ ఆకాంక్షించారు

## న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

ప్రజాపక్షం/ తొర్రూరు : న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధిక సంస్థ చైర్మన్ ధీరజ్ కుమార్ అన్నారు. నవంబర్ 9న లీగల్ సర్వీసెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని, సెలవుల దృష్ట్యా ముందస్తుగా శుక్రవారం తొర్రూరు కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ డే ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి ధీరజ్‌కుమార్ మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల ప్రజలు, మహిళలు, వికలాంగులు, వృద్ధులు, తదితరులు ఉచితంగా న్యాయ సేవాధికార సంస్థ అందించే న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెలలో నిర్వహించే మెగా లోక్ అదాలత్‌లో రాజీపడదగిన కేసులను పరిష్కరించుకొని ప్రశాంత జీవనం గడపాలన్నారు. రాజీమార్గం రాజామార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎజిపి లింగాల శ్రీనివాస్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌కె.ఘనపురం, ట్రెజరర్ మాదగాని నాగరాజు, న్యాయవాదులు వల్లపు ఐలోని, బానోతు లాలు, టి.సైదులు, ఎం.యాకేందర్, టి.గౌస్, రమేశ్, పోలీసులు, కోర్టు సి బ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు రిమాండ్

ప్రజాపక్షం/భీమదేవరపల్లి: ఇద్దరిపై హత్యాయత్నం చేసిన కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన స్టాలిన్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు భార్య అఫ్రాజ్, కూతురు సిద్ధికీపై హత్యా ప్రయత్నం చేసారు. కాగా హత్యాయత్నంపై హసన్ పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన బాను గురువారం ముల్కనూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. బాను తన కూతురు అఫ్రాజ్, మనుమరాలు సిద్ధికీపై మండల కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న స్టాలిన్ హత్యా ప్రయత్నం చేసినట్లు పిర్యాదు చేసారు. పిర్యాదుపై విచారణ చేపట్టిన ఎస్ఐ రాజు కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరుపరిచారు. కాగా కోర్టు నిందితునికి 14రోజుల రిమాండ్ విధించగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి

# ప్రజాప్రభుత్వం దోహదం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం



ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి ప్రజా ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్, మల్లన్న గండి చెరువులో చేప పిల్లలను విడుదల చేసి ఉత్పత్తిని పెంచేందుకు చేప పిల్లల పంపిణీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ స్వయంగా చేప పిల్లలను రిజర్వాయర్‌లోకి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ రిజర్వాయర్ ద్వారా ఏటా సుమారు 400 టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుంది. దాదాపు రూ. 4 కోట్ల విలువైన చేపలు మార్కెట్‌కి వస్తున్నాయన్నారు. మత్స్యకారుల ఆదాయం పెరగడం కోసం చేపలను పెంచడంతోపాటు మార్కెటింగ్ సదుపాయం, రవాణా సౌకర్యాలు కల్పించేలా అధికారులకు సూచించారు. ప్రస్తుతం రిజర్వాయర్ పరిధిలో 319 మహిళా సంఘాల సభ్యులు, 700 మంది మత్స్యకార సంఘ సభ్యులు, మరో 300 మంది సభ్యత్వం కోసం అప్లై చేసుకున్నారని మొత్తం 1300 మంది మత్స్యకారులు నెలకు రూ. 10 వేలకు పైగా సంపాదించే స్థాయికి చేరుకోవడం సంతోషకరమన్నారు. ఆగస్టు నెలలో చేప పిల్లలను వదిలే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి చేపల ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలోని మురిరాజ్ ఆర్థికాభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే ఘన్‌పూర్ పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో రూ. 4 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ డిఎస్ వెంకన్న, మత్స్య శాఖ అధికారి రాజాప్రతాప్, గండి రామారావు సొసైటీ అధ్యక్షుడు వడ్లకొండ రాజు, దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఘన్‌పూర్ సొసైటీ నాయకులు వెంకటేశ్వర్లు, నేల సోమయ్య, వెంకన్న, రఘు, స్వామి, యాదగిరి, కొయురవెల్లిలోపాటు తాటికొండ గండి రామారావు, తరిగొప్పుల, చిలుకూరు మండల నాయకులు, తహసీల్దారు, మత్స్యసహకార సంఘం అధ్యక్షులు, సొసైటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లచ్చి రామ్ నాయక్‌పై చీటింగ్, క్రిమినల్ కేసు నమోదు చేయాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్ :లచ్చిరాం నాయక్ తన పలుకుబడిని ఉపయోగించి కంబాల సాయిలు పట్టా భూమిలో సిసి రోడ్డు పోయడంతో మనస్థాపానికి గురై సంపత్ ఆత్మహత్య చేసుకోవడంపై క్రిమినల్ కేసు అధికారులను తప్పదో పట్టించడంపై చీటింగ్ చీటింగ్ కేసు నమోదు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కురవి శివారులోని మాదాపురం గ్రామ వాసి అయిన కంపాల సాయిలు పట్టా భూమిలో సిసి రోడ్డు పోయడాన్ని తట్టుకోలేక అతని కుమారుడు సంపత్ అనేక సార్లు లచ్చిరాం నాయకులు సిసి రోడ్డు వేయ ద్దు అని వేడుకున్న తన పలుకుబడిని ఉపయోగించి రాత్రికి రాత్రి సిసి రోడ్డు వేయడంతో ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటనకు కారణమైన భూమిని పరిశీలించిన సిపిఐ బృందం నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జనావాసాలు లేని తమ సొంత కోళ్ల ఫామ్ కోసం శాసనసభ్యులు, అధికారులను పక్కదోవ పట్టించి సీసీ రోడ్డు అక్రమంగా మంజూరి చేయించుకొని పట్టా భూమిలో నుంచి సిసి రోడ్డు వేసి, తన పలుకుబడితో భయభ్రాంతులకు గురి చేయడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని దీనిపై జిల్లా ఉన్నతాధికారులు అధికారులు సమగ్ర విచారణ చేసి ప్రజాధనాన్ని కేవలం తమ సొంత కోళ్ల ఫారం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి అధికారుల తప్పుదోవ పట్టించి పట్టా భూమి ఉన్న వ్యక్తిని బెదిరించి సిసి రోడ్డు వేయించడం పై చీటింగ్ మరియు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న , కురవి గ్రామ కార్యదర్శి తుర్క రమేష్, నాయకులు బుడమ వెంకన్న ,కన్నే వెంకన్న, కొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

ప్రజాపక్షం / వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లేదంటే బిసిల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా బిసిల పోరాటంతో శాసనసభలో బిసిలకు స్థానిక సంస్థలలో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపించి చేతులు దులుపుకుందే తప్ప కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదన్నారు. అన్ని పార్టీల, బిసి సంఘాల ప్రతినిధులతో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన నీటి మూటైందన్నారు. బీసీ రిజర్వేషన్లు పార్లమెంటు ఆమోదించి రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్లో చేర్చుకుంటే అమలు కాదనేది ప్రతి ఒక్కరికి తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, బిజెపి తన బిసి వ్యతిరేక వైఖరి విడనాడాలని లేనిచో కేంద్ర ,రాష్ట్ర పాలకులు బిసి ద్రోహులుగా మిగిలిపోతారని వెంకట్రాములు హెచ్చరించారు.

## అనంతారం రైల్వే అండర్ పాస్ రోడ్డు మరమ్మతులు

సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ పరిశీలన



ప్రజాపక్షం/మహబూబాబాద్:మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గుడిరోడ్‌లో ధ్వంసమైన రైల్వే అండర్ బ్రిడ్జిని సిపిఐ ప్రతినిధి బృందం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడుతూ అనంతారం గుడి రోడ్‌లో సింగిల్ లైన్ ఉన్నప్పటి నుంచి ఉన్నటువంటి అండర్ పాస్ (అండర్ బ్రిడ్జి) ఈ ప్రాంత ప్రజలు అండర్ బ్రిడ్జి గుండా రాకపోకలు జరుగుతుండేవని, ఈ మధ్యకాలంలో కురిసినటువంటి భారీ వర్షాల వల్ల రోడ్డు పూర్తిస్థాయిలో ధ్వంసం అయ్యి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడ్డాయి వాహనాలు, పాదచారులకు అంతరాయం ఏర్పటి ఈ రోడ్డు మార్గం గుండా పోయే ప్రజలు గుంతల వల్ల ప్రమాదవశాత్తు పడిన సందర్భాలు చాలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో ధ్వంసమైన రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేయడం జరి గిందని ఇప్పటివరకూ అధికారులు ఎవరూ కూడా స్పందించకపోవడం వల్ల వాహనాలు కిలోమీట్ల దూరం చుట్టుతిరిగి రావాల్సి వస్తోందని అన్నారు. ధ్వంసమైన రోడ్డుకు మరమ్మత్తులు చేస్తే కొంత ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుందని వాహనదారులు సుమారు రెండు కిలోమీటర్ల దూరం తిరిగి రావాల్సిన అవసరం కూడా ఉండదని సూచించారు. ఈ రోడ్డు గుండా మోడల్ స్కూల్, మోడల్ కాలేజీ, అనంతారం దేవాలయం, ఇతర గ్రామాలకు వెళ్లే వారు ఈ రోడ్డుని ఉపయోగించుకుంటారని, తక్షణమే స్థానిక రైల్వే అధికారులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ, ఆర్ అండ్ బి అధికారులు కానీ స్పందించి అనంతరం గుడి రోడ్‌లో ధ్వంసమైన ర్వైల్వే అండర్‌పాస్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని సిపిఐ పక్షాన ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంద శ్రీనివాస్, జలగం ప్రవీణ్, జంగిలి అనిల్, మాదారపు యశ్వంత్, వంగ శ్రీనివాస్, రమేష్, పొడగంటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు కలెక్టర్ సూచన



ప్రజాపక్షం/ములుగు:బాగా చదువుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత స్థా నాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ విద్యార్థినిలకు సూచించారు. శుక్రవారం ములుగు మండలంలోని జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాలలో బిఇఎల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సిఎస్ఆర్ క్రింద జిల్లాలోని 9 ఆశ్రమ పాఠశాలలు చిన్నబోయినపల్లి, కర్లపల్లి, లక్ష్మీ నగరం, ఏకె ఘనపూర్, జగ్గన్నపేట, మేడారం, తాడ్వాయి, చిరుతపల్లి1, ఊరట్టం, కెజిబి కన్నాయిగూడెం పాఠశాలలకు డిజిటల్ క్లాస్ రూమ్ పరికరాలను సంస్థ తరుపున జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమక్షంలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ కె శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమం ములుగు జిల్లాలో చేపట్టడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇంత మారుమూల ప్రాంతాలను ఎంచుకొని మా గిరిజన విద్యార్థిని విద్యార్థులకు పరికరాలను అందించడం ద్వారా విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు ఎంతగాను ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు ఎంచుకున్న భాషపై డిజిటల్ విషయ పరిజ్ఞానం తెలుసుకొనుటకు, నేర్చుకొనుటకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా బిఈఎల్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ మా సంస్థ తరుపున అందించే డిజిటల్ క్లాస్ రూమ్ పరికరాల వలన విద్యార్థులు భాష నైపుణ్యాల అవగాహన ఎంతగానో తోడ్పడుతుందని, భవిష్యత్తులో ఈ రికరాల ఉపయోగం వలన విద్యార్థులు ఎంచుకొనున్న సబ్జెక్టులో విషయ అవగాహన తోడ్పడుతుందని అన్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో స్కూల్ నెట్ ఇండియా లిమిటెడ్ సంస్థ అకాడమిక్ మేనేజర్ నర్సింగ్ దాస్ తొమ్మిది ఆశ్రమ పాఠశాలల హెడ్మాస్టర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు డిజిటల్ క్లాస్ రూమ్ పరికరాల ఉపయోగంపై ప్రదర్శించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏటూరునాగారం డిడి జనార్ధన్, ఏటిడిఓ అజయ్ కుమార్, ఏసిఎంఓ కోడి రవీందర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్ రమాదేవి, మహిళా జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, బిఇఎల్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తిని పెంపొందించేందుకే వందేమాతరం గేయం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి :దేశభక్తిని మరింతగా పెంపొందించే కార్యక్రమంగా వందే మా తరం సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. వందేమాతర గేయం 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సామూహిక వందేమాతర గీతాన్ని ఆలపించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ప్రజలలో దేశభక్తి భావాన్ని పెంపొందించడానికి, భారత చరిత్రలో వందే మాతరం గీతానికి ఉన్న విశిష్ట స్థానాన్ని తెలియజేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహణ పట్ల ప్రజల్లో ఉత్సాహం గుండెల నిండుగా జాతీయ భావం నెలకొందని ఆయన వెల్లడించారు. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## ఆసుపత్రులను తనిఖీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ



ప్రజాపక్షం/ తొర్రూరు : పట్టణ కేంద్రంలోని పలు ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిరాథోడ్ ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. పట్టణ కేంద్రంలోని అమ్మ హాస్పిటల్, ఇమేజ్ సెంటర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లోని రిజిస్టర్లను, ఆసుపత్రిలో అందించే సేవలను, వైద్యుల పూర్తి వివరాలను డాక్టర్ రవిరాథోడ్ పరిశీలించారు. ఆసుపత్రుల్లో అందించే సేవలు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పిసిసిఎన్‌డిటి సర్టిఫికెట్‌లను అందరికి కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. ఆసుపత్రిలో ఫైర్‌కు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పనిచేసే స్బింది వివరాలు ఆసుపత్రిలో ఉంచాలని, వైద్యులు, సిబ్బంది మారిన సమయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంకు వివరాలను ముందుగా తెలపాలన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుకొని వచ్చిన వారు భారత ప్రభుత్వం వారు నిర్వహించే అర్హత పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని, వారి డిగ్రీలు, ఎంబీబీఎస్‌కు మాత్రమే సమానమని, ఎండి అని రాసుకోకూడదని, ఒక వేళ ఎవరైనా అలా రాసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ల వారు ప్రతీ నెల 5లోపు ఫామ్‌ఎఫ్‌లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని, సరైన విధంగా పూర్తి చేయాలని, ప్రతీ రోజు పీసీపీఎన్‌డీపీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ తనిఖీలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెచ్‌ఈఓకెవిఎల్ ఎన్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐటి వరంగల్‌లో రూ.1.27కోట్ల అత్యధిక ప్యాకేజీ

ప్లేస్‌మెంట్ సీజన్ 2025-26 ప్రారంభ దశలోనే కొత్త రికార్డు



ప్రజాపక్షం/కాజీపేట : ఎన్ఐటి వరంగల్‌లో ఈ ఏడాది ఒక విద్యార్థికి అత్యధిక ప్యాకేజీ రూ. 1.27 కోట్లు వచ్చింది. ప్లేస్‌మెంట్ సీజన్ ప్రారంభ దశలోనే వచ్చిన అద్భుత ఫలితాలు, సంస బలమైన విద్యా పునాది, పరిశ్రమలతో ఉన్న సన్నిహిత బంధాలను విద్యార్థుల అసాధారణ ప్రతిభను ప్రతిబింబిస్తున్నాయి.ఈ కొత్త రికార్డు ఎన్ఐటి వరంగల్ చరిత్రలో అత్యధిక దేశీయ ఆఫర్ రూ. 1.27 కోట్లు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బి.టెక్ విద్యార్థి నారాయణ త్యాగి బహుళజాతి కంపెనీ నుండి రూ. 1.27 కోట్ల సిటిసితో దేశీయ ఆఫర్‌ను పొందారు. ఇది ఎన్ఐటి వరంగల్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ప్యాకేజీ. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి మొహమ్మద్ నహిల్ నష్వాన్ రూ. 1.0 కోటి సిటిసితో దేశీయ ఆఫర్‌ను పొందారు. ఈ ఘనతలు ఎన్ఐటి వరంగల్‌ను దేశంలోని అగ్రశ్రేణి ఇంజనీరింగ్ విద్యాసంస్థలలో ఒకటిగా నిలబెట్టాయి. అం తర్జాతీయ ప్రమాణాల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు మరోసారి నిరూపించాయి. 2025–26 ప్లేస్‌మెంట్ డ్రైవ్ ప్రారంభ రెండు నెలల వ్యవధిలోనే, విభిన్న శాఖల విద్యార్థులు అత్యుత్తమ అవకాశాలను సాధించారు. ఇప్పటివరకు ప్లేస్‌మెంట్ సీజన్ తొలి రెండు నెలల్లో రూ. 70 లక్షలకు పైగా సిటిసితో 6 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారు.రూ.50 లక్షలకు పైగా సిటిసితో 34 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారు.రూ.30 లక్షలకు పైగా సీటీసీతో 125 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారు.,రాబోయే నెలల్లో మరిన్ని అధిక విలువ గల ఆఫర్లు వచ్చే అవకాశముందని ఎన్ఐటి వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. విద్యార్థులందరికీ,అధ్యాపకులకు అభినందనలు తెలియజేస్తూ, “ప్రస్తుతం జరుగుతున్న ప్లేస్‌మెంట్ సీజన్ మా విద్యార్థుల ప్రతిభ, పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలు,తమ సంస్థపై రిక్రూటర్ల నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు.” అదేవిధంగా, ఈ విజయాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిన సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీసీపిడి) బృందానికి, హెడ్ ప్రొఫెసర్ పి. వి. సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## డాక్టరేట్ పట్టా అందుకున్న నవీన్ కుమార్

ప్రజాపక్షం / నర్సంపేట : బాలాజీ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బొద్దుకూరి నవీన్ కుమార్ డాక్టర్ పట్టా అందుకున్నట్టు బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్. ఎ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాల జీ మిజోరం విశ్వవిద్యాలయం నుండి ఇన్వెస్టిగేషన్ ఇన్ టు ద రేడియో స్పెక్ట్రమ్ యుటీలైజేషన్ యూజింగ్ వైర్లెస్ టెక్నాలజీస్ అనే అంశంపై పరిశోధన చేసి డాక్టర్ చైతలి కోలి పర్యవేక్షణలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుండి డాక్టరేట్ డిగ్రీ పూర్తి చేశానని తెలిపారు. పిహెచ్డి పట్టా అందుకున్న నవీన్ కుమార్ కు బిట్స్ కళాశాల సెక్రటరీ జి.రాజేశ్వర్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణ, బిట్స్ ఏవో సురేష్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి కిరణ్ కుమార్ వివిధ విభాగాధిపతు లు అధ్యాపకులు,కుటుంబ సభ్యులు, అభినందనలు తెలియజేస్తూ సన్మానం చేశారు



# క్రీడ

## పాక్‌పై భారత్ విజయం



హాంకాంగ్ సూపర్ సిక్సెస్‌లో భాగంగా ఇండియా, పాక్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ విధానంలో టీమ్‌ఇండియా 2 పరుగుల తేడాతో పాక్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 6 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. రాబిన్ ఉతప్ప (28; 11 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), భరత్ చిప్లి (24; 13 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. స్టువర్ట్ బిన్నీ (4), అభిమన్యు మిథున్ (6) పరుగులు చేశారు. దినేశ్ కార్తిక్ (17*; 6 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) నాటౌట్‌గా నిలిచాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ షెహజాద్ 2, అబ్దుల్ సమద్ 1 వికెట్ తీసుకున్నారు. అనంతరం 87 పరుగుల విజయలక్ష్యంతో పాకిస్థాన్ బ్యాటింగ్‌కు దిగింది. మూడు ఓవర్ల తర్వాత వరుణుడు ఆటకు అంతరాయం కలిగించాడు. ఆ సమయానికి పాక్ 1 వికెట్ కోల్పోయి 41 పరుగులు చేసింది. తిరిగి ఆట కొనసాగే పరిస్థితి లేక పోవడంతో డక్‌వర్త్‌లూయిస్ విధానంలో టీమ్‌ఇండియా 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం వల్ల మ్యాచ్ ఆగే సమయానికి ఖవాజా నఫే (18*; 9 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (16*; 6 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు. మాజ్ సదఖత్ 7 పరుగులకు పెవిలియన్‌కు చేరాడు. భారత బౌలర్లలో స్టువర్ట్ బిన్నీ ఒక వికెట్ తీసుకున్నాడు.

## ఐపిఎల్‌కు ధోనీ రెడీ!



ఐపిఎల్ అభిమానులకు గుడ్‌న్యూస్. వచ్చే సీజన్‌లో మహేంద్ర సింగ్ ధోనీ ఆడుతాడా? లేదా? అనే వార్తలకు ఎండ్‌కార్డ్ పడింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో రారాజుగా వెలుగొందుతున్న మహీ భాయ్ మరో సీజన్‌కు సన్నద్ధమవుతున్నాడు. శరీరం సహకరిస్తే మరో సీజన్ ఆడుతానని ఇదివరకే ప్రకటించిన ధోనీ.. మరోమారు పసుపు జెర్సీతో స్టేడియాలను దద్దరిల్లేలా చేయనున్నాడు. అవును.. ధోనీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని క్రిక్‌బజ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ పంచుకున్నాడు. మీరు విన్నది నిజమే. ఐపిఎల్ 19వ సీజన్‌లో ధోనీ ఆడుతున్నాడు అని ఆయన తెలిపాడు. భారత కెప్టెన్‌గానే కాకుండా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో తనదైన ఆటతో అభిమానుల గుండెల్లో నిలిచిన ధోనీ.. వీడ్కోలు వార్తలకు చెక్ పెట్టాడు. మరో సీజన్‌కు నేను రెఢీ అంటూ తనపై కొండంత ప్రేమ కురిపిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్, సీఎస్కే ఫ్యాన్స్‌ను సంబురాల్లో ముంచెత్తాడీ వెటరన్. శుక్రవారం 'క్రిక్‌బజ్'తో మాట్లాడిన సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ అమితానందంతో ఈ విషయాన్ని బహిర్గతం చేశాడు. 'వచ్చే సీజన్‌లో ఆడేందుకు నేను సిద్ధంగా ఉన్నాను అని ధోనీ మాతో చెప్పాడు. అతడి నిర్ణయం పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. అనుభవజ్ఞుడైన ధోనీ యువతరానికి మార్గనిర్దేశనం చేయడంలో కీలకం కానున్నాడు' అని విశ్వనాథన్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా సంజూ శాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్ నుంచి కొనడంపై గురించి చర్చలు జరుగుతున్నాయని విశ్వనాథన్ తెలిపాడు. నవంబర్ 10, 11వ తేదీల్లో సీఎస్కే యాజమాన్యం, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో ధోనీ సమావేశం అవుతాడని సమాచారం. సీఎస్కే భవిష్యత్ గురించి.. వేలంలో కొనాల్సిన ఆటగాళ్ల గురించి చర్చించే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

### 234 మ్యాచ్‌లు.. 4,865 పరుగులు

పద్దెనిమిదో ఎడిషన్ ముందు కెప్టెన్సీ వదులుకున్న ధోనీ.. సీజన్ మధ్యలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ ఎడమచేతి బొటనవేలి గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దాంతో, మళ్లీ సీఎస్కే సారథ్యాన్ని చేపట్టిన తాల.. కుర్రాళ్లో ఆత్మవిశ్వాసం నింపుతూ జట్టులో స్ఫూర్తి రగిలించాడు. ఈ సీజన్‌లో ఫినిషర్‌గానూ రాణించిన ధోనీ.. 13 ఇన్నింగ్స్‌ల్లో 196 రన్స్ కొట్టాడు. ఇప్పటివరకూ ఎల్లో జెర్సీతో 234 మ్యాచ్‌లు ఆడిన ధోనీ.. 4,865 పరుగులు సాధించాడు. ఏకంగా ఐదు పర్యాయాలు (2010, 2011, 2018, 2021, 2023) సీఎస్కేను ఐపీఎల్ విజేతగా నిలిపాడు.

## పంత్ సేనకు భారీ ఆధిక్యం!




రెండో అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో ధ్రువ్ జురెల్(132 నాటౌట్) శతకంతో కోలుకున్న టీమిండియాను పేసర్లు గట్టెక్కించారు. ప్రసిధ్ కృష్ణ(335), ఆకాశ్ దీప్(228)లు నిప్పులు చెరగగా దక్షిణాఫ్రికాను 221కే ఆలౌట్ చేసి టీమిండియా ఆ తర్వాత భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. రెండోరోజు ఆట ముగిసే సరికి ఓపెనర్ కేఎల్ రాహుల్(26 నాటౌట్), నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్‌లు క్రీజులో ఉన్నారు. 3 వికెట్ల నష్టానికి 73 రుగులు చేసిన పంత్ బృందం ఆధిక్యం 112 పరుగులకు చేరింది. సంచలన ఆటతో మొదటి అనధికారిక టెస్టును హస్తగతం చేసుకున్న భారత ఏ జట్టు రెండో మ్యాచ్‌లోనూ పటిష్ట స్థితిలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ విఫలమైనా.. ధ్రువ్ జురెల్(132 నాటౌట్) సూపర్ సెంచరీతో ఆదుకోగా.. భారత పేసర్లు వికెట్ల వేటతో సఫారీలను హడలెత్తించారు. ప్రసిధ్ కృష్ణ(3 35), ఆకాశ్ దీప్(228)లు చెలరేగగా.. సీనియర్ టీమ్ సారథి తెంబా బవుమా(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. టాపార్డర్ కుప్పకూలినా కెప్టెన్ ఎంజే అకెర్‌మన్(134) టీమిండియా పేసర్లను దీటుగా ఎదుర్కొని అద్భుత శతకంతో రాణించాడు. కానీ, అతడికి సహకారం అందించేవారు కరువవ్వడంతో 221కే ఆలౌటయ్యింది.

### జురెల్ ఒంటరి పోరాటంతో

తొలి ఇన్నింగ్స్‌లో సఫారీ పేసర్ టియాన్ వాన్ వురేన్ (454) ధాటికి భారత ప్రధాన ఆటగాళ్లు చేతులెత్తేశారు. భారీ స్కోర్లు చేస్తారనుకుంటే కేఎల్ రాహుల్ (19), కెప్టెన్ రిషభ్ పంత్(24)లు నిరాశపరచగా.. జట్టును గట్టెక్కించే బాధ్యతను భుజాన వేసుకున్న జురెల్ గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. 1196తో ఆలౌట్ అంచున నిలిచిన జట్టు ఆపద్భాదంవుడి పాత్ర పోషించిన జురెల్ టెయిలెండర్లు కుల్దీప్ యాదవ్(20), మహమ్మద్ సిరాజ్(15)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అయితే ప్రసిధ్ కృష్ణ(0)ను ఔట్ చేసిన వురేన్ 255 వద్ద భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

# ఫోకస్ సైన్స్

## డిఎన్ఎలో ఫ్రాక్టల్ యాంటీనా శక్తి!



డిఎన్ఎను జీవ సంకేతాల ఆధారంగా మాత్రమే పరిగణిస్తూ వస్తున్నాం. అయితే, కొంత మంది శాస్త్రవేత్తల కొత్త ప్రతిపాదనలను ప్రకారం, డిఎన్ఏకి ఫ్రాక్టల్ యాంటీనా మాదిరి పని చేసే విప్లవాత్మక శక్తి కూడా ఉంది. పునరావృతమయ్యే నమూనాలతో కూడిన క్లిష్టమైన జామితీయ ఆకారాన్ని ఫ్రాక్టల్‌గా పేర్కొంటారు. తాజా సిద్ధాంతాన్ని అనుసరించి, డబుల్ హెలిక్స్ నిర్మాణం వల్ల డిఎన్ఏ అనేది రేడియో తరంగాల నుంచి అల్ట్రావైలెట్ కాంతి వరకూ విస్తృతంగా ఎలక్ట్రోమాగ్నటిక్ తరంగాలను గ్రహించగలుగుతుంది. ప్రసారం చేయగలుగుతుంది. ప్రతిధ్వనిస్తుంది. స్వీయసమానత లేదా సెల్ఫ్‌సిమ్మెంట్రీ, ఎలక్ట్రానిక్ కండక్షన్ వంటి బలాలను ఫ్రాక్టర్ యాంటినా లక్షణాలుగా చెప్తారు. డిఎన్ఎలో ఈ లక్షణాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. అందుకే వేర్వేరు తరంగ దైర్ఘ్యాలలో డిఎన్ఏ స్పందించగలుగుతున్నది ఆధారాలు చూపిస్తున్నారు. కణ సమూహాలు కేవలం రసాయన సంకేతాల ద్వారానే కాకుండా, ఎలక్ట్రోమాగ్నెటిక్ రంగాల ద్వారా కూడా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవచ్చునిన సూత్రాన్ని ఈ కొత్త సిద్ధాంతం బలపరుస్తున్నది. డిఎన్ఎలో ప్రకంపనల సమన్వయం (వైబ్రేషనల్ కోహెరెన్స్), ఫీల్డ్ ఆధారిత మేధస్సు (ఫీల్డ్‌బేస్డ్ ఇంటెలిజెన్స్) వంటి నూతన కోణాల ఆవిష్కరణ జరిగే అవకాశాలు ఉన్నాయి. శరీర నిర్మాణ లక్షణాలపై అవగాహన, ఆరోగ్యం, చికిత్స, అత్యవసర వైద్యం వంటి రంగాల్లో ఈ కొత్త సిద్ధాంతం విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని నిపుణులు అంటున్నారు. డిఎన్ఏ వీటిని సాధించడంలో ఫ్రాక్టల్ యాంటీనా తత్వం ఉపయోగపడుతుంది. డిఎన్ఎలోని ఈ లక్షణాల వల్ల, అది పర్యావరణంలోని ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎఫెకట్స్ కి ఎక్కువ స్పందించేలా మారి, ఇవే కొన్ని సందర్భాల్లో ఆరోగ్య సమస్యలకు, జీవ పరిణామాల వేగం భిన్నంగా ఉండటానికి కారణమవుతాయని అధ్యయనం సూచిస్తుంది. ఈ పరిశోధన తుది నిర్ధారణ స్థాయికి వస్తే, జీవశాస్త్రంపై మన అవగాహననే మార్చే ప్రభావం చూపుతుంది.

## రాకెట్లకు ప్లాస్మా ఇంజిన్లు!






అంతరిక్ష ప్రయాణానికి ఉపయోగపడే రాకెట్లకు అత్యంత వేగంగా ప్రయాణించేందుకు ఉపయోగపడే, శక్తివంతమైన ప్లాస్మా ఇంజన్లు అమర్చే రోజులు ఎంతోదూరంలో లేవు. ఈ సరికొత్త సాంకేతికతను రష్యా అభివృద్ధి చేస్తున్నదని తెలుస్తోంది. అంతర్జాతీయ మ్యాగజైన్ల సమాచారం ప్రకారం సాధారణ రాకెట్ ఇంధనానికి బదులుగా ప్లాస్మా ఇంజినల్‌లో అత్యంత వేడిగల అయనైజ్డ్ గ్యాస్ (ప్లాస్మా)ను వినియోగిస్తారు. సాధారణంగా రాకెట్ అంగారగ్రహం (మార్స్) చేరడానికి సుమారు ఏడు నెలలు పడుతుంది. కానీ, ప్లాస్మా ఇంజిన్ వాడితే కేవలం 30 రోజుల్లోనే చేరుకోవడం సాధ్యమవుతుంది. ఇందులోని అయనైజ్డ్ గ్యాస్‌ని ఎలక్ట్రోమెగ్నెటిక్స్ ద్వారా వేగంగా కదిలేలా చేసాఇరు. ఇలా వేగంగా బయటకు తోసే గ్యాస్, రాకెట్‌కు విపరీతమైన బలాన్నిస్తుంది. ఫలితంగా ఎక్కువ కాలం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు పోతుంది. ఇంధన వినియోగం కూడా తగ్గుతుంది. ఈ కొత్త టెక్నాలజీతో అంతరిక్ష ప్రయాణాలను భవిష్యత్తులో సులభసాధ్యంగా, మరింత సురక్షితంగా మారుస్తుంది.

## టెరెల్-పెన్‌రోజ్ సిద్ధాంతానికి రుజువు..

అల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన స్పెషల్ థియరీ ఆఫ్ రిలేటివిటీ ప్రకారం, ఎక్కువ వేగంతో లేదా సుమారు కాంతి వేగంతో ఒక వస్తువు ప్రయాణిస్తే, అది రుజు మార్గంలో వెళ్లకుండా, వక్రీకరణం చెందుతుంది. ఇది అణువుల స్థాయిలో కనిపించే యదార్థం. అయితే, జేమ్స్ టెరెల్, రోజర్ పెన్‌రోజ్ అనే శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతానికి మరో నిర్వచనం ఇచ్చారు. కాంతి వేగానికి దాదాపు సమానంగా లేదా, అంతకు మించిన వేగంతో ఒక వస్తువు ప్రయాణిస్తే, అది వివిధ రూపాలను, వక్రతలను సంతరించుకుంటుందని వారు పేర్కొన్నారు. దీనినే టెరెల్-పెన్‌రోజ్ సిద్ధాంతంగా పేర్కొంటారు.



తాజాగా, టియు వియెన్, యూనివర్సిటీ ఆఫ్ వియన్నా (ఆస్ట్రియా) శాస్త్రవేత్తలు అల్ట్రాఫాస్ట్ లేజర్లు, అత్యధిక వేగంగల కెమెరాలను ఉపయోగించి, కాంతి వేగాన్ని (సెకనుకు 299,792,458 మీటర్లు) ఫొటో తీశారు. దీనిని 'రిలేటివిస్టిక్' డ్రామాగా పేర్కోవచ్చు. ఒక ఘన వస్తువు వేగానికి లొంగిపోకుండా, ఒకవైపు వంగడం కనిపించింది. అంతేగాక, గుండ్రటి వస్తువు మాదిరిగా వృత్తాకారాన్ని సంతరించుకోగలదు. ఇది టెరెల్–పెన్‌రోజ్ సిద్ధాంతానికి ప్రత్యక్ష రూపం. ఈ పరిశోధన మనం భవిష్యత్తులో పరిశోధకులు, విద్యార్థులు ఒక అలౌకిక దృశ్యాన్ని చూసే అవకాశాన్ని కల్పించింది. దీని వల్ల భవిష్యత్తులోని ఫిజిక్స్, ఆప్టిక్స్, క్వాంటం విజ్ఞాన రంగాలకు కొత్త ఇమేజింగ్ టెక్నాలజీలు పరిచయమవుతాయి. రిలేటివిటీని ఒక చిత్రంలో ఇలా దర్శించడాన్ని గణితాన్ని కళగా మార్చడంగా చెప్పవచ్చు. ఏదైతేనేం, ఇటీవల జరిగిన ప్రయోగంతో మనిషి కళ్ల ముందు నిజంగానే విజ్ఞాన సిద్ధాంతం ప్రత్యక్షమైంది.

## ప్రజా పోరాటాలలో సిపిఐది కీలకపాత్ర



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణమైన స్వాతంత్ర్యంకావాలని ఆరోజుల్లోనే సిపిఐ బ్రిటిషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఆరోజుల్లో బ్రిటిషు ప్రభుత్వం సిపిఐపార్టీపై నిషేదం విధించిన సిపిఐ నాయకులు జైళ్లల్లో అజ్ఞాతవాసాలలో ఉండికూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సందర్భాలను ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నిర్వహించడంలో సిపిఐకీలకపాత్ర పోషించిందన్నారు. ఈ పోరాటంలో 4500 మంది ప్రాణాలను కోల్పోవడం జరిగింది. డిసెంబర్ 26న లక్షలాదిమందితో ఖమ్మంలో జరిగేటటువంటి భారీ బహిరంగసభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మలశివుడు, మండల మొలచింతలపల్లి శాఖ కార్యదర్శి జంగంశివుడు, సింగోటంశాఖ కార్యదర్శి చంద్రయ్య, తిర్నాంపల్లిశాఖ కార్యదర్శి వెంకటస్వామి, రామకృష్ణ, శివ పాల్గొన్నారు.

## 12 నుండి జన సేవాదళ్ శిక్షణ

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




**ప్రజాపక్షం / వరంగల్ :** సిపిఐ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని, ఈనెల 12,13 తేదీలలో జరుగు జన సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పిలుపు నిచ్చారు. శివనగర్ తమ్మెర భవన్ లో సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల సమావేశం ఎండి అక్బర్ పాషా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. షేక్ బాష్ మియా మాట్లాడుతూ భారత దేశ గడ్డపై 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటువంటిపార్టీ సిపిఐ అని అన్నారు. పీడిత తాడిత ప్రజలకు అండగా వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐదన్నారు. ఆదిలాబాద్ నుండిఖమ్మంవరకు జరుగు బస్‌జాత 19న వరంగల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ నెల 21,22 తేదీల్లో జరుగు వరంగల్ జిల్లా జాతను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనసేవా దళ్ కవాత్ విజయవంతం కోసం ఈ నెల12, 13 తేదీలలో అజంజాహి మిల్ గ్రౌండ్లో జనసెవాదళ్ శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు.జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, సంఘీ ఏలేందర్ ,బుస్స రవీందర్, తోట చంద్రకళ, వీరగొని శంకరయ్య, కందిక చెన్నకేశవులు, యాకయ్య, చింతకింది కుమారస్వామి, ల్యాదల్ల శరత్, యాకాంబ్రచారి, జన్ను రవి, దామెర కృష్ణ, మస్క సుధీర్. తాళ్లపల్లి రహేల ఉన్నారు.

# కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం

### పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి

### 4వ జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎఐటి యుసి అనుబంధ చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం 4వ జిల్లా మహాసభలను ఈనెల 16,17 సిరిసిల్ల ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి కోరారు. సిరిసిల్ల ఏఐటియుసి కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏఐటియుసి భారతదేశంలో 1920 అక్టోబర్ 31 వ తేదీన బొంబాయి నగరంలో భారతదేశంలోని కార్మిక వర్గ ప్రయోజనాల కొరకు ఏఐటియుసి కార్మిక సంఘం ఏర్పరచుకోవడం జరిగిందన్నా రు. 103 సంవత్సరాలు చరిత్ర కలిగి కార్మిక హక్కులకై నిరంతరం నిజాయితీగా పోరాడుతున్న సంఘమని కొనియాడారు. అప్పటి నుం డి దేశంలోని కోట్లాది మంది సంఘటిత అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కొరకై కార్మిక వర్గాన్ని సంఘటితం చేస్తూ నిరంతరం కార్మిక హక్కులకై పోరాడుతుందన్నారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డితో పాటు ఏఐటియుసి రాష్ట్ర నాయకత్వం పాల్గొని గత రెండు సంవత్సరాల కాలపు కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలోని పవర్ లూమ్ అనుబంధ రంగాలల సోదరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొంక విజయ్,ఎలిగేటి రాజు, సోమ నాగరాజు, సదానందం, శ్రీరామ్, చెందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తేయాలి

### ఏడు క్వింటాళ్ల కొనుగోలుతో రైతుకు భారీ నష్టం

### కలెక్టర్ హైమావతికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ వినతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** పత్తి రైతులకు ఏలాంటి షరతులు లేకుండ పాత పద్దతిలో సిసిఐ కొనుగోళ్లు చేపట్టాలని ..రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి రైతులకుఇబ్బందులకు కలుగకుండ చూడాలని జిల్లా కలెక్టర్‌హైమావతికిసిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ కోరారు. శుక్రవారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హైమావతికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ వినతి పత్రం అందచేశారు. మంద పవన్ కలెక్టర్‌తో మాట్లాడుతూ భారీ వర్షాల మూలంగా పత్తిపంట దెబ్బతినటంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులు ఆందోళన చెందుతున్న క్రమంలో లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండించిన పత్తికి సిసిఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకవస్తే రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ యాప్ ద్వారా రైతులు స్మార్ట్ ఫోన్‌లో ఒక రోజు ముందు స్లాట్ బుక్ చేసుకోవాలని, గతంలో ఎకరానికి 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సిసిఐ ఈ సారి 7 క్వింటాళ్లను కుదించటం రైతులకు తీవ్ర నష్టంచేకూరిందన్నారు. పత్తికి తేమశాతం 12 నుండి 20 శాతం పెంచాలని, రైతులను ఇబ్బందులను గురి చేసే ఆంక్షలు పెట్టి మరో సారి నడ్డివిరిచే విధంగా రైతన్నకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈ కపాస్ యాప్‌ను ఎత్తివేసి నేరుగా పాత పద్దతిలో పత్తిని కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి స్పందిస్తూ రైతులకు ఇబ్బంది కలుగకుండ చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. సిసిఐ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తామని కలెక్టర్ చెప్పినట్లు మంద పవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జెర్రిపోతుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## 'గీత కార్మికుల' బకాయిలు విడుదల చేయాలి

### సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరిగౌడ్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గీతా కార్మికులకు చెల్లించాల్సిన 13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను విడుదల చేయాలని గీతా పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం ఆదునీకరణ, తాటి వనం పెంపకానికి 10 ఎకరాల భూమిని కేటాయించాలని తదితర డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం నాయకులు లోడ యాదయ్య, సుర్వి నరసింహ, వీరమల్ల యాదయ్య, పాలకూరల స్వామి, సుర్వి జంగయ్య, ముత్యాలు, కొండూరు యాదయ్య, బత్తిని మల్లేష్, వీరమల్ల జంగయ్య, ఐటపాముల అంజయ్య, నీళ్ల అంజయ్య, కొండ నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీ కోసం గళమెత్తిన విద్యార్థి సంఘాలు



### ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో కల్వకుర్తిమహబూబ్‌నగర్‌చౌరస్తావద్ద ధర్నా చేశారు. ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మాట్లాడారు. తెలంగాణరాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిపులు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిపులు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్‌చేశారు.

## షరతుల్లేకుండా పత్తి కొనుగోళ్లు

### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు వర్షం కారణంగా మైచర్ రావడం లేదు. దీంతో ప్రభుత్వాలు మైచర్ లేదని రైతులకు మోసం చేస్తున్నారని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదరి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ షరతులు లేకుండా పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.కుంటాల రాములు, అరుణ్‌కుమార్, మహబూబ్‌ఖాన్, అర్ధాంగి రమేష్, షేక్ పాషా, కామ్‌లే రామదాస్,బెజ్జంకి నర్సింగరావు, షేక్ సలీం, కడప సురేష్ ఉన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## మాలావత్ పూర్ణకు పితృవియోగం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించిన అతి పిన్న బాలికగా దేశానిక గర్వకారణంగా నిలిచిన మాలావత్ పూర్ణకు పితృవియోగం కలిగింది. అత్యంత పిన్న వయస్సులోనే ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి నిజామాబాద్ జిల్లాకు తెలంగాణ రాష్ట్రానికి ఘనతను అందించిన పూర్ణ తండ్రి మాలావత్ దేవీదాస్ (50) శుక్రవారం కామారెడ్డిలోని ఇంటిలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు గత కొంత పిట్స్ రావటంతో వైద్యమందిస్తున్నారు. ఆయన మరణ వార్తతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. సిరికొండ మండలంలోని మారుమూల ప్రాంతం పాకాలకు చెందిన దేవిదాస్ ఒక సాదాసీదా రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి ఆయనకు ఒక కుమారుడు నరేష్ (30) కూతురు పూర్ణ(25) ఉన్నారు. కూతురు పూర్ణకు ఉన్న ఆసక్తిని గుర్తించి అన్ని అవరోధాలను దాటుకుంటూఆమెకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహమందించారని గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. ఆయన త్యాగం కుమర్తె విజయాల్లో చూసి మురిసిపోయేవాడని గుర్తు చేసుకున్నారు. కాగా దేవీదాస్ అంత్యక్రియలు శుక్రవారం పాకాల గ్రామంలో నిర్వహించారు.



## పాత పద్ధతి ద్వారానే సిసిఐ పత్తి కొనుగోలు చేయాలి

గజ్వేల్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి శివలింగ కృష్ణ

**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ శివారులోని సాయి బాలాజీ పత్తి మిల్లును సిపిఐ నేతల బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన గజ్వేల్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి శివలింగ కృష్ణ మాట్లాడుతూ, పాత పద్ధతిలోనే పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమ శాతం 8 నుంచి 12 వరకు కొనుగోలు చేస్తామని చెప్తున్నప్పటికీ ఒక్కో పాయింట్‌కు రూ.81 చొప్పున తగ్గిస్తూ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో రైతు ప్రభుత్వం నిర్దేశిత ధర రూ.8110 పొందడం లేదని విమర్శించారు. తేమ శాతము 8 నుంచి 12 వరకు మద్దతు ధరలో కోత పెట్టొద్దని, ఆ తర్వాత 12 నుంచి కనీసం 18 తేమ శాతం వరకైనా కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే కొంత మంది రైతులు భూమి కౌలుకు తీసుకొని పత్తి పండించగా, వారు సిసిఐ కేంద్రంలో అమ్ముకునే సందర్భంలో తప్పని సరిగా భూ పట్టేదారు రావాలని, అతని వేలిముద్ర ఉంటే తప్ప పత్తి తీసుకోమని సిసిఐ పెట్టిన నిబంధన ఎత్తివేయాలని కోరారు. ఎకరానికి గతంలో నిర్ణయించిన 12 క్వింటాళ్ల బదులు ఏడు క్వింటాలకు తగ్గించడానికి తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని, గతంలో మాదిరిగా ప్రతి రైతు నుండి 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. ఈ సంవత్సరం కురిసిన వర్షాలతో రైతులు నష్టపోగా, దేశానికి అన్నం పెట్టే రైతన్న కన్నీరు పెడుతుంటే దేశమే అభివృద్ధి చెందినట్లు కాదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు కొండకింది పోచయ్య, బొడ్ల సాయి, వెంకట చారి, దాసరి యాదయ్య, గూడరాజు, చింతకింది కనకయ్య, ఎండి షాదిక్ పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయిలో ఎఇఒ నృత్య ప్రదర్శన

**ప్రజాపక్షం/జన్నారం :** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అంబేద్కర్ తెలంగాణ సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్ర భారతిలో ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర నృత్య పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో మంచిర్యాల జిల్లా నుంచి వ్యవసాయ శాఖ తరపున జన్నారం మండలం కలమడుగు గ్రామ ఎఇఒ దివ్య కూచిపుడి నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. పోటీలలో రాణించిన దివ్య రాష్ట్ర ఉన్నత అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.



## బొలెరో, ద్విచక్ర వాహనం ఢీ..
### ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/భీమిని/బెల్లంపల్లి :** మంచిర్యాల జిల్లా భీమిని మండలం, రాంపూర్ గ్రామం రైతు వేదిక సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న బొలెరో, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తాండూరు మండలం గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన గజ్జల నారాయణ (52), కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఇస్లాం గ్రామానికి చెందిన కృష్ణ సర్కార్(27) భీమిని మండలం మల్లిడి గ్రామంలో మేషన్ పని నిమిత్తం బైక్ పై వెళ్తుండగా వెంకటాపూర్ నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు 108 కు ఫోన్ చేశారు. 108 ఇఎంటి సారయ్య తెలిపిన వివరాల ప్రకారం కృష్ణ సర్కార్ అనే వ్యక్తి మోకాలు చిప్పకు తీవ్రంగా గాయమై అధికంగా రక్తస్రావం అయ్యిందని, గజ్జల నారాయణ అనే వ్యక్తికి మోచేతి భాగంలో తీవ్ర గాయం అయ్యిందని తెలిపారు. స్థానికులు వారిద్దరినీ బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి వారిని మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బొలెరో, బైకును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి పట్టణంలో అనారోగ్యంతో ఓ మహిళ మృతి చెందగా, ఆమె మరణం చుట్టూ అనుమానాస్పద పరిస్థితులు నెలకొన్నాయి. మృతురాలి కుటుంబ సభ్యులు తమ కుమార్తె మరణానికి గల కారణాలను విచారణ చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సాయిపేట గ్రామానికి చెందిన రాచర్ల పద్మ (35) అలియాస్ గుడికందుల పద్మ, ఆమె భర్త గుడికందుల రాజు. వీరి వివాహం 2018 నవంబర్‌లో జరగగా, వారికి ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. వివాహానంతరం వీరు మందమర్రి పట్టణంలోని అంగడి బజార్‌లోని అత్తగారి ఇంటి వద్ద నివసిస్తున్నారు. దాదాపు ఐదు నెలల క్రితం రాజు తన భార్య, కుమారుడితో కలిసి సాయిపేట గ్రామానికి వెళ్లారు. అనంతరం ఈ నెల 1న రాజు భార్య పద్మ, కొడుకుతో కలిసి తిరిగి మందమర్రికి వచ్చి, ఆమె ఆరోగ్యం బాగోలేదు, చూసుకునే వారు లేరు, మీరు వైద్యం చేయించండి అంటూ పద్మను ఇక్కడే ఉంచి వెళ్లిపోయాడు. తరువాత పద్మకు తీవ్రమైన జ్వరం రావడంతో బంధువులు ఆమెను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఆమె మృతి చెందింది. అంగడి బజారు కి చెందిన మృతురాలి అన్న రాచర్ల సదానందం మరణానికి గల కారణాలపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కలెక్టరేట్‌లో సామూహిక వందేమాతర గేయాలాపన

గేయాలాపనలో కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ గేయం వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, సామూహిక వందేమాతరం ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా కలెక్టర్,అధికారులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామంలో వందేమాతరం గేయం ఎంతోమంది సమరయోధుల్లో స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగిలించడంలో కీలక భూమిక పోషించిందని అన్నారు. బంకించంద్ర చటర్జీ, 1875 నవంబర్ 07న జాతీయ గేయం వందే మాతరం రచించడం జరిగిందని వివరించారు. జాతీయ గేయం, జాతీయ గీతం భారత దేశ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడంలో నేటికీ కీలక భూమిక పోషిస్తున్నాయని వివరించారు. ఈరోజు వందేమాతరం ఆలాపన కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం ఎంతో గర్వించదగ్గ విషయమని చెప్పారు. ప్రజలంతా దేశభక్తి, దేశంపై గౌరవం కలిగి ఉండాలని అన్నారు. జాతీయ గేయం స్ఫూర్తితో అధికారులంతా ఉన్నత భావాలను కలిగియుండి, దేశాభివృద్ధిలో నిరంతరం తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా వందేమాతరం చారిత్రాత్మక ప్రాముఖ్యతపై అందరికీ అవగాహన కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. వందేమాతరం గేయాలాపన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి టెస్ట్‌కు ఉపాధ్యాయుడి విరాళం

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని ముస్కాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ పరీక్ష రుసుమును ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వెన్నం అంజయ్య నిర్వాహకులకు చెల్లించి తన ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలోని సుమారు 500 మంది విద్యార్థుల చెకుముకి టాలెంట్ పరీక్ష రుసుమును శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. ఉపాధ్యాయుడు వెన్నం అంజయ్య ను తోటి ఉపాధ్యాయులు అభినందించారు. తనవంతు కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయుడు అంజయ్య పేర్కొన్నారు.



## ఘనంగా అడెల్లి మహా పోచమ్మ పునఃప్రతిష్టాపన వేడుక

ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధ అడెల్లి మహా పోచమ్మ ఆలయ పునః ప్రతిష్టాపన కార్యక్రమంలో బీజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దంపతులు,ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ లు పాల్గొన్నారు.ఆలయ ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేశారు.ఆలయ అర్చకులు,కమిటీ సభ్యులు పూర్ణకుంభం తో ఎమ్మెల్యే లకు స్వాగతం పలికారు.అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి,ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్న ప్రసాదం పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు భక్తులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్‌మిల్లుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
ధాన్యం బస్తాల అన్‌లోడింగ్‌లో జాప్యంపై ఆగ్రహం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రానికి సమీపంలో ఖానాపూర్ శివారులో కొనసాగుతున్న ఆర్‌కె రైస్‌మిల్‌ను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల లోడ్ల ధాన్యం పంపించారు. వాటిని ఎప్పుడు దిగుమతి చేసుకున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలన జరిపారు. అంతకుముందు కలెక్టర్ డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల నుండి ధాన్యం సేకరించారు. రైస్‌మిల్లులకు ఎన్ని లారీల లోడ్ల ధాన్యం వెళ్లిందని కేంద్రం నిర్వాహకులను ప్రశ్నించారు. అయతే దొడ్డు రకం ధాన్యాన్ని రైస్‌మిల్లుల వద్ద రోజుల తరబడి దించుకోవటం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని కేంద్రం నిర్వాహకులతో పాటు స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలను పంపాలని,లేని పక్షంలో కాంట్రాక్ట్ రద్దు చేస్తామన్నారు. అక్కడి నుండి కలెక్టర్ నేరుగా ఖానాపూర్‌లోని ఆర్‌కె రైస్‌మిల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రక్‌షీట్లను తెప్పించుకుని ధాన్యం అన్‌లోడింగ్ సకాలంలో చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పలు లారీలు రైస్‌మిల్ ఆవరణలో ధాన్యం బస్తాల లోడ్లతో నిలిచి ఉండటాన్ని గమనించిన కలెక్టర్, ఎన్ని రోజుల నుండి ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని లారీ డ్రైవర్లను ప్రశ్నించారు. ఐదారు రోజులుగాదించుకోవడం లేదని తెలుపగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకుని వెంటనే ట్రక్ షీట్లు అందించాలని పదే పదే సూచిస్తున్నప్పటికీ ఎ ందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైస్‌మిల్ నిర్వాహకులను నిలదీశారు. రోజుల తరబడి ధాన్యం దిగుమతి చేసుకోకుండా మిల్లుల వద్దే వాహనాలను నిలిపి ఉంచితే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందన్నారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే అకాల వర్షాలతో తడిసిపోయే ప్రమాదముంటుందన్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌లకు సంబంధించి సమగ్ర పరిశీలన చేసి తనకు పూర్తి సమాచారమందించాలని కలెక్టర్ తన వెంట ఉన్న డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డిఎం శ్రీకాంత్‌రెడ్డిలకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రైతుల ప్రయోజనాలను దెబ్బ తీసేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా పకడ్బంధీ పర్యవేక్షణ జరపాలన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో నష్టపోతున్న రైతులు

నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనాలోచిత విధానాల వల్ల రైతులు నష్టపోతున్నారని, రైతులకు పంట చేతికి వచ్చే క్రమంలో సైతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల లేమి కారణంగా రైతుల నోటి కాడికి వచ్చిన పంట నీటి పాలు అయిందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
కేంద్ర ప్రభుత్వం రైతుసంక్షేమం కొరకు ఫసల్ బీమా పథకాన్ని ప్రవేశపెడితే గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఫసల్ బీమా పథకంలో తమ వాటా డబ్బులు కట్టలేక రాష్ట్ర రైతాంగానికి ఫసల్ బీమా పథకం అమలుకాని పరిస్తితి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం పండే వరి పంటను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దానికి కావలసిన మౌలిక వసతుల కల్పన మాత్రమే ఈ రాష్ట్ర ప్రభుత్వం అని అన్నారు.
తెలంగాణ రాష్ట్రంలో 2014–15 సంవత్సరాలకు 14 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి ఉంటే ప్రస్తుత సంవత్సరం 93 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని, ప్రతి ఏడు పెరుగుతున్న ధాన్యాన్ని ప్రజా అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికంగా ఇతరత్రా మార్గాల ద్వారా ప్రజలకు, రాష్ట్రానికి ఆదాయాన్ని చేకూర్చే పనులను చేపట్టాలి కాని అవేవి చేయకుండా ప్రతీది కేంద్ర ప్రభుత్వం రాజకీయం అని చెప్పి ప్రజలను ఏమారుస్తున్నారని అన్నారు.
ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూంలలో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, అది పూర్తిగా అధికారులు ప్రభుత్వ గైడ్‌లైన్స్, నిర్ణయాలకు అనుగుణంగా చేపట్టే ప్రక్రియని ఇందులో బిజెపి ఎమ్మెల్యేగా ఆ ప్రాంతవాసులకి నిజమైన లబ్దిదారులకు ఇవ్వాలన్నదే మా ఆకాంక్ష అని అన్నారు.
కార్యక్రమంలో జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డి, బిజెపి నాయకులు పోతన్‌కర్ లక్ష్మి నారాయణ, న్యాలం రాజు, శంకర్, సాయి, కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వందేమాతరానికి 150 ఏళ్ళు

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా నేడు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వందేమాతర గేయాన్ని ఆలపించారు.దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,నాయకులు మేడిసెమ్మ రాజు,పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి,నాయకులు జమాల్,పట్టణ నాయకులు శ్రీరామోజు నరేష్,జుట్టు దినేష్,జప ప్రసాద్, మాజీ కౌన్సిలర్ పాతర్ల గణేష్,సుంకరి రాజేష్,శ్రీకాంత్ రెడ్డి,ఉదయ్ గౌడ్,తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/సోన్ :** సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల స్కూల్ లో నిర్వహించిన 11వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 202526 లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులక బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు.అనంతరం హ్యాండ్ బాల్ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ప్రిన్సిపల్ ప్రశాంతి,మండల సీనియర్ నాయకులు సరికెల గంగన్న,మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి,మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, జమాల్, ఉదయ్, సాయిలు,నాగరాజుతో పాటు పాల్గొన్నారు.

## వందేమాతర గీతాలాపనతో దేశభక్తిని చాటిన పాత్రికేయులు

**ప్రజాపక్షం/నస్పూర్ :** నస్పూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. వందేమాతరం గీతం రచించి నూట యాభై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నస్పూర్/శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్బులో ఈ కార్యక్రమం చేపట్టారు. జాతీయ ఉద్యమంలో జాతిని ఏకం చేసి ఉర్రూతలూగించిన గీతాన్ని ఆలపించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూపతి రవి, ప్రధాన కార్యదర్శి కొండ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భాస్కర్ల రాజేశం, ఉపాధ్యక్షులు రాములు, మైదం రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి కె నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి వేల్పుల మల్లేష్, కార్యనిర్వాహక సభ్యుడు తలారి సమ్మయ్య, సీనియర్ పాత్రికేయులు బియ్యాల రాజకుమార్, పాదం నర్సయ్య, పురుషోత్తం, నరేందర్, సతీష్ పాల్గొన్నారు.





## ఆడెల్లి శ్రీ మహా పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆడెల్లి శ్రీ మహా పోచమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,శుక్రవారం దర్శించుకున్నారు.ఆడెల్లి నూతన దేవాలయ ప్రారంభోత్సవం,పోచమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్టాపన వేడుకల సందర్భంగా కలెక్టర్ అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయానికి వచ్చిన కలెక్టర్ కు ఆలయ పండితులు,అధికారులు స్వాగతం పలికారు.నూతన ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు.అర్చకులు అమ్మవారి ఆశీర్వచనాలు,మంగళహారతులు,తీర్థప్రసాదాలు కలెక్టర్‌కు అందజేశారు.శాలువాతో సన్మానించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సర్వాంగ సుందరంగా నూతన ఆలయం ప్రారంభించుకొని,అమ్మవారి కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.అమ్మవారిని దర్శించుకున్న వారిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మి కాంత్ రావు,ఆలయ కమిటీ చైర్మన్ భోజా గౌడ్,ఈవో భూమయ్య,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు ఉన్నారు.

## సీజ్ చేసిన 95 ట్రిప్పుల ఇసుక వేలం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ తహసీల్దార్ పరిధిలోని గోన్‌గొప్పుల గ్రామంలో ఈనెల 6న 95 ట్రిప్పుల ఇసుక సీజ్ చేయటం జరిగింది. గ్రామంలోని హరిహర రైస్‌మిల్ వద్ద 95 ట్రిప్పుల ఇసుక ఉన్నట్లు సమాచారమందింది దాంతో తహసీల్దార్ షబ్బీర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయ గౌడ్ సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను 10న రెవెన్యూ అధికారుల సమక్షంలో వేలం వేయటం జరుగుతుంది. వేలంలో ఇసుక దక్కించుకోవాలనుకునే వారు టెన్ థౌసండ్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వేలంలో తర్వాత రాని వారికి డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లించడం, వేలంలో ఇసుక దక్కించుకున్న వారికి ఇసుక అప్పగించడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.



## కిలోకు పైగా గంజాయి సీజ్

ముగ్గురి నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం/బోధన్ :** మహారాష్ట్ర బిలోలి నుంచి బోధన్ వైపుగా వస్తున్న ఆటోను పోలీస్ అధికారులు గురువారం తనకి చేయగా అందులో గంజాయి లభించినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. బోధన్ పట్టణంలోని పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ వైపుకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బోధన్ పట్టణ శివారులోని మర్రి మైసమ్మ ఆలయం వద్ద పట్టణ ఎస్సై మనోజ్, పోలీస్ సిబ్బంది మహారాష్ట్ర నుంచి బోధన్ వైపుగా వస్తున్న టిజి 16 టి1768 నంబర్ గల ఆటోను తనిఖీ చేయగా అందులో ఒక కేజీ 270గ్రాముల గంజాయి లభ్యమైందని అన్నారు. గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందని తెలిపారు. గంజాయి తరలిస్తున్న నింధితులు గోనేకర్ గణేష్, బిలోలి, మహారాష్ట్ర వాస్తవ్యులుగా, గాడే శేఖర్, బ్రహ్మణ గల్లి బోధన్‌గా, షేక్ అబ్దుల్ కైసర్, నిజామాబాద్ వాస్తవ్యులు అని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. గంజాయి నింధితులను పట్టుకున్న ఎస్సై మనోజ్, కానిస్టేబుల్ రవి, మహేష్, కైసర్, వరుణ్, సాయి కుమార్‌లను సిపి సాయి చైతన్య అభినందించినట్లు తెలిపారు. ఈసమావేశంలో టౌన్ సిఐ వెంకట్ నారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గుండెపోటుతో భక్తుడు మృతి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి భక్తుడు గుండెపోటుతో మృతి చెందారు. ఆదిలాబాద్‌కు చెందిన పోలకొండ శ్రీనివాస్ వర్మ(47) క్షేత్రానికి దర్శనం కోసం రాగా ఈ క్రమంలో క్షేత్రంలో దర్శనం చేసుకుని రాత్రి కొండపై బస చేశారు. రాత్రి చలి తీవ్రత ఎక్కువ ఉండటం, అర్ధరాత్రి అతనికి గుండెపోటు రావటం జరిగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రైవేట్ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అంతలోగా వర్మ చనిపోయారు. కుటుంబ సభ్యులు రోధిస్తూ వర్మ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.



# స్థానికం REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: స్వాతంత్ర ఉద్యమంలో ప్రజల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయ్యింది. ఈ సంధర్బంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో శుక్రవారం ఉదయం సామూహికంగా వందేమాతరం గేయాలాపన చేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వు మేరకు కరీంనగర్ కలెక్టరేట్‌లో వందేమాతరం గేయాన్ని ఉద్యోగులు ఆలపించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌కు చాడ వినతిపత్రం


ప్రజాపక్షం/హుస్నాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మహ్మదాపూర్ గ్రామంలో నిజాంనవాబుల పాలనను ఎదిరించి రజాకర్ల రాక్షసుల నుండి ప్రజలకు విముక్తి కలిగించి అసువులు బాసి న అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహంను వెంటనే తిరిగి అదే స్థలంలో (డిపో(క్రాస్) రోడ్డులో ప్రతిష్టించాలని కోరుతూ సిపిఐ జాతీయ నాయకుడు , మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి శుక్రవారం హుస్నాబాద్ మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ కార్యక్రమంలో బాగంగా పట్టణంలోని బస్ డిపో క్రాస్ చౌరస్తాలో ఉన్న అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహంను తోలగించారు. అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహంను అప్పటి ఎమ్యెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సహకారంతో మాజీ ఎమ్యెల్యే చాడ వెంకట రెడ్డి, అప్పటి కరీంనగర్ ఎంపి పొన్నం ప్రభాకర్‌గౌడు నేతృత్వంలో 2012లో డిపో క్రాస్ రోడ్డులో ప్రభాకర్‌రావు విగ్రహంను ప్రతిష్టించడం జరిగిందని తెలిపారు. రోడ్డు విస్తరణ కార్యక్రమంలో తోలగించి విగ్రహంను తిరిగి నెలకొల్పని కొరారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుని చరిత్రను నేటి యువతకు తెలసిసేందుకు ఈ లాంటి మహనీయుల విగ్రహంలో మనం ఏర్పాటు చేసుకుకొవడం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపి ఐ జిల్లా సహయకార్యదర్శి గడిపే మల్లేశ్, జిల్లా కౌన్సి సభ్యులు సంజీవరెడ్డి, పట్టణ సహయకార్యదర్శి కుమారస్వామి, నాయకులు బత్తుల బాబు, ఐలేని మల్లారెడ్డిలు పాల్గోన్నారు.

## మంత్రి గారూ.. నిరుపేద గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించండి



ప్రజాపక్షం/ముత్తారం : ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పందించి అటవీ గ్రామంలో ఉన్న నిరుపేద గిరిజన(ఎస్టి) ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలంటూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఆ పల్లె గిరిజన కుటుంబాలు వేడుకుంటున్నారు. మారుమూల అటవీ ప్రాంతం ఆ గ్రామం చుట్టూ చుట్టుకొండలు గుట్టలు పక్కనే మానేరు వాగు ఒడ్డున ఉన్న నిరుపేద గిరిజనుల గ్రామం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోనిశాత్రజ్ పల్లి ఆ గ్రామంలో సుమారుగా 50 నిరుపేద గిరిజన (ఎస్టి) కుటుంబాలతో పాటు మరో 5 హరిజన (ఎస్సీ) కుటుంబాలు ఉన్నాయి. వారికి ఉండడానికి ఇండ్లు కమ్మల గుడిసెలే ఇద్దరికో, ముగ్గురికో మాత్రమే రేకుల ఇండ్లు ఉన్నవి. మిగతా వారికి పూరి గడ్డి గుడిసెలేఅలాంటి నిరుపేద గిరిజన కుటుంబాలకు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లు మాత్రం వారికి అందని ద్రాక్ష లాగే మిగిలింది. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక సంబంధిత లిస్టులో ఆ పల్లెలోని ఒక్క నిరుపేద కుటుంబానికి మాత్రం ఇండ్లు మంజూరు చేయలేదని గిరిజనులు నిరాశ చెందుతున్నారు. నిరుపేద ఎస్టి కుటుంబానికి చెందిన తమకు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తమ గ్రామంలో ఉన్న ప్రతి ఒక గిరిజన కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గిరిజన కుటుంబాలు వేడుకుంటున్నాయి. నిరుపేద కుటుంబానికి చెందిన తమకు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలో గూడు లేని ప్రతి గిరిజన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేయించి కాంటాక్ట్ పద్ధతిలో గ్రామంలో ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసి తమను ఆదుకోవాలని గిరిజన కుటుంబాలు వేడుకుంటున్నారు.

## కోర్టు కేసుల ట్రాకింగ్‌కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు: కలెక్టర్



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్: కోర్టు కేసుల ట్రాకింగ్ కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కోర్టు కేసుల ట్రాకింగ్ పై జిల్లా అధికారులకు, తహసిల్దార్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు కేసుల ట్రాకింగ్ కోసం నూతనంగా పోర్టల్ తయారు చేశామని అన్నారు. ప్రతి జిల్లా అధికారి పేరిట లాగిన్ తయారు చేసి కోర్టు కేసులు రెగ్యులర్ ఫాలో అప్ చేస్తూ ట్రాక్ చేసేందుకు వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. సోమవారం నుంచి ఈ వ్యవస్థ పని చేయాలని, కోర్టు కేసుల సంబంధించిన సంపూర్ణ వివరాలు ఈ పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, సురేష్,జిల్లా అధికారులు ,తహసిల్దార్లు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకపాయే

ప్రజాపక్షం /మల్లాపూర్ : గత కొన్ని రోజులుగా భారీ వర్షాలతో గోదావరి ఉప్పొంగి ప్రవహించి భారీగా ఇసుక మేటలు వేయడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. పవిత్ర గోదావరి నది తీరాన ఉన్న వాల్గొండ గ్రామంలో ఇసుక అక్రమ రవాణాకు బహిరంగంగా వేలం పాట జరిగి పదుల సంఖ్యల ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పేరును అడ్డం పెట్టుకొని ఇసుకను యదేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకోవడంతో అసలైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మాత్రం ఇసుక కొరత తప్పడం లేదు. మండల వ్యాప్తంగా వాగులు వంకలలో ఇసుక నిల్వలు ఉండడంతో మండలం నుండి నిత్యం వందలాది ట్రిప్పుల ఇసుక మెట్పల్లి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్ల గ్రామాలకు తరలిస్తున్న అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న వాటిని సైతంమామూలుగానే తీసుకుంటున్నారు. ఇలా ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్లు రొడ్డెక్కి అతివేగంతో నడిపిస్తుండడంతో వాహన చోదకులు భయభ్రాంతులకు గురై అధికారులకు ఫిర్యాదులు చేసిన సంఘటనలు ఉన్నప్పటికీ ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు. ఫిర్యాదు చేస్తే గోప్యంగా ఉంచాల్సిన అధికారులు సమాచారం లీక్ చేస్తుండడంతో ఇసుక మాఫియా బరితెగించి భయభ్రాంతులకు గురి చేస్తున్న సంఘటనలు మండలంలో అనేకం. ఏమైనాప్పటికీ అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తిస్తే ఇసుక మాఫియా ఆగడాలని అడ్డుకున్న వారు అవుతారని వాహనదారులు కోరు తున్నారు.

# సామాజిక రుగ్మతల నివారణకు సమరశంఖం

### కలెక్టరేట్‌లో ప్రముఖులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖాముఖి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్ జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. కరీంనగర్‌ను టిబి, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ శాతవాహన యూనివర్సిటీలో జరిగిన రెండవ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, ప్రముఖ వ్యక్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సంధర్బంగా కలెక్టర్ పమేలా సత్పతి కరీంనగర్ జిల్లా సమగ్ర స్వరూపంతో పాటు జిల్లా విశేషాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని, జిల్లాలో నీటిపారుదల, వైద్య ఆరోగ్య, విద్య, జల్ జీవన్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం, సమగ్ర శిక్ష అభియాన్, భవిత కేంద్రాలు, గ్రామ సడక్ యోజన, టిబి ముక్త్ భారత్, ఆయుష్మాన్ భారత్, గ్రామీణాభివృద్ధి, ఉపాధిహామీ, స్వచ్ఛభారత్, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, గృహ నిర్మాణం, మహాలక్ష్మి పథకం అమలు, ఇందిరమ్మ ఇండ్లు, ఆదికర్మయోగి అభియాన్ తదితర పథకాలపై లెక్కలతో సహా వివరించారు. జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం సభ నిర్వహిస్తూ మహిళలు పిల్లల పోషణ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మహిళా సమస్యల పరిష్కారానికి శుక్రవారం సభ ఒక వేదికగా నిలుస్తోందన్నారు. దివ్యాంగుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించేందుకు అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి సైన్ లాంగ్వేజిలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. దీంతో గవర్నర్ మంత్రముగ్దులై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని అభినందించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ టిబి వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. టిబి రాకుండా జాగ్రత్తపడాలని, నివారణకు చాలా రకాల మందులు వచ్చాయన్నారు. కవులు, రచయితలు, ప్రజాప్రతినిధులు అందరినీ టిబి నియంత్రణలో భాగస్వామ్యం చేయాలన్నారు. సబ్ కా వికాస్ సబ్ కా ప్రయాస్, టిబి నిర్మూలనలో అందరూ కష్టపడితేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. జిల్లాను రోల్ మాడల్‌గా తీర్చిదిద్దాలని, అందరికీ టిబి లక్షణాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. టిబి ముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. టిబి నిర్మూలనలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని తెలిపారు. కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా అధికారులు, ప్రజలు కలిసికట్టుగా నిర్మూలించాలన్నారు. ఈ రెండు అంశాలతో పాటు మహిళా సాధికారతకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న మేధావులు, విద్యావంతులు ఇంటికి పరిమితం కాకుండా జ్ఞానాన్ని సమాజానికి పంచాలని సూచించారు. రాబోయే రోజుల్లో భవిష్యత్తు భావితరానిదేనన్నారు. సమాజంలో నాటుకున్న సామాజిక రుగ్మతలను రూపుమాపాలని పిలుపునిచ్చారు. వరకట్నం, బాలకార్మిక వ్యవస్థ, శ్రమదోపిడీని పూర్తిగా నిరోధించాలన్నారు. సామాజిక రుగ్మతలు రూపుమాపితేనే భారత్‌కు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కేవలం అధికారులతోనే కాకుండా ప్రజలందరి సమిష్టి కృషితో సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కరీంనగర్‌లో కవులు, కళాకారులు, విద్యావేత్తలకు కొదవ లేదన్నారు. వారి సేవలను జిల్లా అధికారులు ఉపయోగించుకోవాలన్నారు. సమాజంలో సమస్యల పరిష్కారానికి సమరశంఖం పూరించాలన్నారు. బంకించంద్రం చటోపాధ్యాయ రాసిన వందేమాతరం గీతం ప్రజలకు ఎప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ఘనమైన వారసత్వ సంపదతో సంస్కృతికి సాంప్రదాయాలతో విలసిల్లుతున్నదని పేర్కొన్నారు. ఈ సంధర్బంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలెక్టర్ పమేలా సత్పతి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంతకుముందు గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వందేమాతరం గేయంతో కార్యక్రమాన్ని ప్రారంభించగా అనంతరం బాలభవన్ విద్యార్థుల శాస్త్రీయ నృత్యం, అంద విద్యార్థుల పాటలు ఆలపించారు. అనతంరం పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌష్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని, తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, కరీంనగర్,హుజురాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, పుర ప్రముఖులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులున్నారు.

## ఎఐ ల్యాబ్ ద్వారా విద్యా ప్రమాణాల పెంపునకు కృషి: కలెక్టర్

ప్రజాపక్షం/పెద్దపల్లి: ఏఐ ల్యాబ్ ద్వారా కనీస విద్యా ప్రమాణాల పెంపుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏఎక్స్ఎల్ పాఠశాలల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఏఎక్స్ఎల్ పాఠశాలలో అవసరమైన మేర అదనంగా కంప్యూటర్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యార్థులు కనీస విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ఏఎక్స్ఎల్ ల్యాబ్ లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏఎక్స్ఎల్ ల్యాబ్ లో ప్రతి విద్యార్థి రోజుకు కనీసం అరగంట సమయం గడిపేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఏఎక్స్ఎల్ ల్యాబ్ లో అవసరమైన పరికరాలను పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లల విద్యా ప్రమాణాలు పెంపు సంబంధించి వాస్తవిక రిపోర్టు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం



ప్రజాపక్షం /మల్లాపూర్ : మండలంలోని కొత్త దామరాజు పల్లి గ్రామానికి చెందిన వాసం మాధురి ఎంఏ తెలుగులో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా శుక్రవారం బంగారు పతాకాన్ని అందుకుంది. ఈ మెరకు వాసం మాధురి మాట్లాడుతూ తన భర్త సహకారంతో తాను బంగారు పతాకాన్ని సాధించినట్లు తెలిపింది. కాగా బంగారు పతాకం సాధించడం పట్ల గ్రామస్తులు తోటి విద్యార్థులు మాధురిని అభినందించారు.

## స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతర గేయం కీలక పాత్ర

### కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట: భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో దేశంలో అన్ని వర్గాలు ,అన్ని ప్రాంతాల ప్రజలను ఏకం చేయటంలో ముఖ్య పాత్ర పోషించింది వందేమాతర గీతం అని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ప్రభుత్వ పిలుపుమేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వందేమాతర గీతం సాముహిక ఆలాపన కార్యక్రమాన్ని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ బ్రిటీష్ వారు భారతదేశంలో ప్రజలను కులాలు, మతాలు ప్రాంతాల వారిగా విభజించి పాలిస్తున్న క్రమంలో 150 సంవత్సరాల క్రితం దేశంలో కవులందరు ప్రజలను ఏకం చేసే అనేక ప్రయత్నాలు చేశారు. దానిలో భాగంగా బంకిచంద్రచటర్జీ బెంగాలీలో అనందమట్ గ్రంథంలో వందేమాతర గీతాన్ని రచించటం జరిగిందన్నారు. మనం భూమిని మాతతో పోలుస్తాం కాబట్టి భారతదేశాన్ని కూడ మాతగా భావిస్తూ వందేమాతరం గీతాన్ని దేశ ప్రజలను ఐక్యం చేయటానికి రచించారన్నారు. వందేమాతర గీతాన్ని ఆ నాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరిని ఏకం చేసి ఉత్తరం నుండి దక్షిణం వరకు తూర్పు నుండి పశ్చిమ వరకు దేశాన్ని సమైక్యం చేయటానికి ఎంత దూరం పడిందన్నారు.మతాలు. భాషాలు, ప్రాంతాలు మనమంతరం భారతీయులు అనే భావాన్ని మనందరిలో కలుగచేస్తూ స్ఫూర్తి నింపిన వందేమాతర గీత ఔన్నత్యాన్ని, దేశగౌరవాన్ని కాపాడుతూ దాన్ని రచించిన బంకించంద్ర చటర్జీని స్మరిస్తూ భవిష్యత్తులో తరాలు వందేమాతర గీతం గొప్పతనాన్ని ఎప్పటికి స్మరించేలా అందరం కృషిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్,జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ,జిల్లా అధికారులు, కలెక్టరేట్, వివిధ శాఖలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/చేర్యాల: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని కడవేరుగు నాగపురి రహదారి కోతలకు గురై ప్రమాదాలకు నిలయంగా మారిందని అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు.శుక్రవారం కోతకు గురైన రోడ్డును సిపిఐ నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల పట్టణ కేంద్రం నుండి కడవేర్గు, నాగపురి గ్రామానికి వెళ్లే రహదారి ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో నిత్యం రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది కరంగా మారింది.రోడ్డు ఇరువైపులా, మధ్య భాగంలో గుంతలు ఏర్పడి నీరు నిండిపోవడంతో వాహనాదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురై ఎంతో మందికి గాయాలైన సంఘటనలు నెలకొన్నాయి.ప్రయాణం చేయాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.వర్షాల కారణంగా రహదారి కోతకు గురవడంతో రాత్రి వేళల్లో ఆదమరిస్తే అంతే అని వాహనదారులు బెంబేలు పడుతున్నారు.ఇప్పటికైన ఆర్‌అండ్‌బీ పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి గుంతలమయమైన రహదారికి మరమత్తులు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, వలబోజు నర్సంహా చారి, నంగి కరుణాకర్, నర్సిరెడ్డి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌జి సభ్యులకు ఇందిరా మహిళాశక్తి చీరలు

### సిద్ధమవుతున్న 64 లక్షల చీరలు
### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రాష్ట్రంలోని అన్ని మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేసేందుకు ఇందిరా మహిళా శక్తి చీరలు( యూనిఫామ్స్) సిద్ధవుతున్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల పంపిణీ చేసే ఇందిరా మహిళా శక్తి చీరల(యూనిఫామ్స్) ఉత్పత్తి ప్రక్రియ, ఇతర అంశాలను నేరుగా తెలుసుకునేందుకు రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి జిల్లా సమాఖ్య అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు జిల్లాకు రాగా, వారితో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం ఇంచార్జి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళలకు చీరలు అందజేయడంతో ఇటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని వెల్లడించారు. వస్త్ర పరిశ్రమకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. కార్మికులు ఎంతో నైపుణ్యంతో చీరలు నేస్తారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేశామని తెలిపారు. ప్రతి ఎస్ హెచ్ జీ మహిళా రుణాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి, మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

**వస్త్ర ఉత్పత్తి పరిశీలన..**

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వెంకట్రావునగర్ లోని మరమగ్గాల యూనిట్, గీతానగర్ లోని ప్రాసెసింగ్ యూనిట్, వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంను పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి మరమగ్గాల పై సిద్ధం అవుతున్న చీరలను ఇంచార్జి కలెక్టర్, ఆయా జిల్లాల మహిళా సంఘాల బాధ్యులు నేరుగా పరిశీలించారు. దారం నుంచి చీరల తయారయ్యే విధానాన్ని చూసి, దాని వివరాలను కార్మికులు, యజమానులను మహిళలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, చేనేత జౌళి శాఖ జేడీ వెంకటేశ్వర్ రావు, డీఆర్డీఓ శేషాద్రి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక వందేమాతర గేయం



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : దేశ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో జాతీయ కవి, రచయిత బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గేయం 150 ఏండ్లు అయిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో వందేమాతరం గేయాన్ని సమూహంగా ఆలాపించారు. వందేమాతరం గేయాలపన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఇన్స్పెక్టర్ లు రవి, నాగేశ్వరరావు , మధుకర్, ఆర్.ఐ లు రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు కిరణ్ కుమార్, క్రాంతి కుమార్, రాజు,సాయి కిరణ్,జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, పోలీస్ సిబ్బంది హాజరై గీతలాపన చేశారు.

### కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో




ప్రజాపక్షం/కరీంనగర్-సిటీ: భారత జాతీయ గేయం వందేమాతరం గీతాన్ని మహాకవి బంకిం చంద్ర చటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సంధర్భంగా కరీంనగర్ పోలీసు కమిషనరేట్ కేంద్రంలో ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పాల్గొని వందేమాతర గేయాన్ని ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ వందేమాతర గీతం స్వాతంత్ర సంగ్రామంలో కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించే గొప్ప శక్తి ఈ గీతంలో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి భీంరావు, ఆర్ఐ కిరణ్ కుమార్‌లతో పాటు కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని జాతీయ గేయాన్ని ఆలపించారు.

## రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని జనరల్ ఆస్పత్రిలో రోగులకు మంచి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందికి అభినందనలు తెలుపుతూ, ఎవరైన రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. శుక్రవారం ఆస్పత్రిని ఆయన సందరిచారు. అక్టోబర్ నెలలో విజయవంతంగా 240 ప్రసవాలు నిర్వహించడం పట్ల సిబ్బందిని అభినందించారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న బృందానికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యధికారులు, గైనకాలజిస్టులు, ఒ.పి. సిబ్బందిని కలెక్టర్ సన్మానించారు. చిన్న పిల్లల వైద్య చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలకు నిధులు సమకూర్చడం జరుగుతుందని, ఈ మేరకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. జిజిహెచ్‌లో పనిచేసే సిబ్బందికి ఐ.డి. కార్డులు జారీ చేయాలన్నారు. ఆస్పత్రి సెక్యూరిటి సిబ్బంది పేషేంట్, వారి సహాయకులతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసిందని, ఈ పద్ధతి మానుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, ఆర్ఎంవో డాక్టర్ రాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



# అదరగొట్టిన చికిరి చికిరి పాట



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్, మోస్ట్ రస్టిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది'ఫస్ట్ సింగిల్ అయిన చికిరి చికిరి ప్రోమోకు అద్భుతమైన స్పందన వచ్చింది, లిరికల్ వీడియోపై భారీ అంచనాలని పెంచింది. భావోద్వేగాలను అద్భుతంగా చూపించే దర్శకుడు బుచ్చి బాబు సాన, ఈసారి ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రహ్మాన్‌తో పని చేయడం తన కల నెరవేరినట్టుగా చెప్పారు. రహ్మాన్‌పై ఆయనకున్న అభిమానాన్ని ఈ ప్రమోలోనే చూపించారు. పాట సిట్యుయేషన్ రహ్మాన్‌పై ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ఆయన ఈ పాటని సిట్యుయేషన్ తగ్గట్టుగా అద్భుతంగా మలిచారు. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. శుక్రవారం మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ని రిలీజ్ చేసి ఎక్సయిట్మెంట్‌ని మరింత పెంచారు. పర్వత ప్రాంతంలో నివసించే పెద్ది.. ఓ రోజు గ్రామంలో తన చికిరిని చూసిన క్షణం నుంచే ఆమె అందం, అమాయకత్వం అతనిని మంత్ర ముగ్ధుడ్ని చేస్తాయి. ఆమెను చూసి కలిగిన ఆ ఆనందాన్ని ప్రతి క్షణం వేడుక చేసుకుంటాడు. ఈ బ్యూటీఫుల్ ఫీలింగ్స్ ని లిరిసిస్ట్ బాలాజీ తన సాహిత్యంలో ఎంతో అద్భుతంగా మలిచారు.

## కమల్‌హాసన్ సమర్పణలో రజనీకాంత్ 173 చిత్రం



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, కమల్ హాసన్ నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై భారత సినీ రంగంలో మైలు రాయిగా నిలిచే మహత్తరమైన ప్రాజెక్ట్‌ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. ఇది ఇద్దరు మహానటుల మధ్య ఐదు దశాబ్దాల స్నేహం, సహోదర బంధాన్ని సెలబ్రేట్ చేసుకునే బిగ్ సినిమాటిక్ ఈవెంట్. రజనీకాంత్‌కమల్ హాసన్ల అనుబంధం తరతరాల కళాకారులకు, ప్రేక్షకులకు స్ఫూర్తినిస్తుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ 44 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పురస్కరించుకొని రూపొందుతున్న రజనీకాంత్ 173 ఇది. సూపర్స్టార్ రజనీకాంత్ మాగ్నటిక్ స్క్రీన్ పవర్, సుందర్ సి డైరెక్షన్ కలిపి ప్రేక్షకులకు విశేషమైన అనుభూతిని అందించబోతుంది.కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం రెడ్ జెయింట్ మూవీస్ ద్వారా పొంగల్ 2027 సందర్భంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది.

## 'టాక్సిక్' ఊహకు అందదు

### రుక్మిణి వసంత్



ఇండియన్ సినిమా హద్దుల్ని చెరిపేసి, అంతర్జాతీయ స్థాయిలో మన సత్తాను చాటేందుకు రాకింగ్ స్టార్ యష్ ప్రస్తుతం 'టాక్సిక్ – ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' పనుల్లో బిజీగా ఉన్నారు. యాక్షన్‌ప్యాక్డ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశ బెంగళూరులో జరుగుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా జనవరిలో భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వచ్చే ఏడాది రిలీజ్ కానున్న చిత్రాల్లో ఆడియెన్స్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్‌ల్లో 'టాక్సిక్' ఒకటిగా నిలుస్తుంది. క్రేజీ అండ్ సెన్సేషనల్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో జరిగిన చిట్ చాట్‌లో 'టాక్సిక్' గురించి ఆమె ప్రస్థావించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం పట్ల రుక్మిణి వసంత్ తన ఉత్సాహంగా ఉన్నానంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆమె మాటల్లో చెప్పాలంటే.. 'టాక్సిక్' అనేది ఇప్పటివరకు కన్నడ లేదా భారతీయ సినిమాల్లో మనం చూసిన వాటన్నంటి కంటే భిన్నంగా ఉంటుంది. ఇది రా అండ రస్టిక్‌గా ఎన్నో లేయర్స్‌తో అద్భుతంగా ఉండబోతోంది. దర్శకురాలు గీతు విజన్ ఎంతో బోల్డ్ ఉంటూనే.. అదే సమయంలో ఎంతో హృద్యంగానూ ఉంటుంది' అంటూ రుక్మిణి చెప్పిన మాటలతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. కన్నడ, ఆంగ్ల భాషలలో చిత్రీకరించబడుతున్న ఈ భారీ సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో అనువాదం చేసిన రిలీజ్ చేస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్‌అప్స్' చిత్రానికి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన మేకర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్‌డాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జాతీయ అవార్డు, గ్లోబల్ ఫిల్మ్ మేకింగ్ అవార్డుతో సహా అనేక ప్రశంసలను అందుకున్న గీతు మోహన్‌దాస్ మరోసారి వండర్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు.

## డిసెంబర్ 19 నుండి 21 వరకు ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్



అంతర్జాతీయ లఘు చిత్రాల ఫెస్టివల్ వేడుకకు హైదరాబాద్ వేదిక కానుంది. తెలంగాణ ఫిలిం డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 19, 20, 21 మూడు రోజుల పాటు హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ ఫెస్టివల్ కు సంబధించిన వెబ్ సైట్ ను ఎఫ్ డీ సి ఎండీ ప్రియాంక, దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ అధినేత ఉమామహేశ్వర్ రావుతో కలసి దిల్ రాజు ప్రారంభించారు. అనంతరం దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల వేడుకను ఘనంగా నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు అంతర్జాతీయ షార్ట్ ఫిలిం ఫెస్టివల్‌ను నిర్వహిస్తోందని అన్నారు. డిసెంబర్ 19,20,21 మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో అంతర్జాతీయ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ జరుగుతుందన్నారు. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐమాక్స్ థియేటర్‌లో షార్ట్ ఫిలిం వేడుక జరుగుతుందన్నారు. వచ్చే ఏడాది నవంబర్ 14న అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాన్ని జరిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఫెస్టివల్ చివరి రోజుల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని దిల్ రాజు చెప్పారు. సమాచార శాఖా కమిషనర్, ఎఫ్ డీ సి మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా మూడు రోజుల పాటు అంతర్జాతీయ లఘు చిత్రాల ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 3 సెకండ్ల నుంచి 25 నిమిషాల పాటు నిడివి గల షార్ట్ ఫిలిమ్స్ పంపాలని చెప్పారు. ఈ షార్ట్ ఫిలిమ్స్‌ను HISFF.IN వెబ్ సైట్‌లోనే అప్ లోడ్ చేయాలని అన్నారు. ఇంటర్నేషనల్ స్థాయి ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణుల హాజరు అవుతారని చెప్పారు. దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ ప్రిన్సిపాల్, అంకురం సినిమా దర్శకుడు ఉమా మహేశ్వర్ రావు మాట్లాడుతూ తెలంగాణలో గొప్ప సాంస్కృతిక విప్లవం ఉందని అన్నారు. ఈ మధ్య కాలంలో డిజిటల్ మీడియా రంగాన్ని తెలంగాణ ఫోక్ సాంగ్స్ శాసిస్తున్నాయని చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులతో జ్యూరీ ఉంటుందని ఆయన చెప్పారు.



## బహిరంగ ప్రదేశాల్లో కనిపించొద్దు

(3వ పేజీ తరువాయి)

ప్రజా భద్రత, ఆరోగ్యం దృష్ట్యా ఇలాంటి బహిరంగ ప్రదేశాల్లోని వీధి కుక్కలను, జంతువులను షెల్టర్లకు తరలించాలి. వీధి కుక్కల నిర్వహణ కోసం ఈ ఆదేశాలు జారీ చేయడం సముచితం అని కోర్టు భావిస్తోంది' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. సంస్థాగత ప్రాంగణాల్లోకి వీధి కుక్కలు, జంతువులు ప్రవేశించకుండా కంచెలు, సరిహద్దు గోడలు, గేట్లు ఏర్పాటు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే ఇతర నిర్మాణాత్మక చర్యల ద్వారా సదరు ప్రాంగణాలు సురక్షితంగా ఉండేటట్లు చేయాలని సంబంధిత సంస్థల పరిపాలనాధిపతులకు కోర్టు సూచించింది. ఇదంతా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, వీలున్నంత వరకు ఎనిమిది వారాల్లోపు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అందుకే సంస్థాగత ప్రాంగణాల నిర్వహణ, పరిశుభ్రత సహా వీధి కుక్కలు క్యాంపస్‌లోకి ప్రవేశించకుండా చూసుకోవడానికి సంబంధింత సంస్థలు ఒక నోడల్ అధికారిని నియమించాలని ధర్మాసనం పేర్కొంది. స్థానిక మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు కనీసం 3 నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా బహిరంగ ప్రదేశాల్లో, సంస్థాగత ప్రాంగణాల్లో తనిఖీలు నిర్వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అంతేకాదు సంస్థల లోపల, వాటి సమీప ప్రాంతాల్లో వీధి కుక్కల ఆవాసాలు లేవని నిర్ధరణ చేసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

**స్టెరిలైజ్ చేయాలి** 'విద్యా సంస్థలు, ఇతర సంస్థల ప్రాంగణాల్లో కనిపించే ప్రతి వీధి కుక్కను వెంటనే జంతు జనన నియంత్రణ నియమాలకు అనుగుణంగా తగిన విధంగా స్టెరిలైజేషన్ చేయాలి. టీకాలు వేసిన తరువాత వాటిని నియమిత షెల్టర్లకు తరలించాలి. ఇదంతా ఆ ప్రాంత మున్సిపల్ సంస్థల, అధికారుల బాధ్యత. మరో కీలకమైన విషయం ఏమిటంటే, వీధి కుక్కులను పట్టుకున్న ప్రదేశంలోనే తిరిగి వదిలిపెట్టకూడదు' అని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఇక నగరాల రోడ్లు, రహదారులపై వీధి కుక్కల ముప్పును ఎదుర్కోవడానికి ఆగస్టు నెలలో రాజస్థాన్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సైతం సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తమ అధికార పరిధిలోకి వచ్చే జాతీయ, రాష్ట్ర రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేస్‌ల వద్ద ఉన్న వీధి కుక్కలను, ఇతర జంతువులను తొలగించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇందుకోసం వీధి కుక్కలు ఎక్కువ కనిపించే జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేల ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని 'ఎన్‌హెచ్‌ఏఐ'కి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.




## పనోరమా స్క్రీనింగ్‌కు సంక్రాంతికి వస్తున్నాం ఎంపిక

ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో పనోరమా స్క్రీనింగ్ కు తెలుగు సినిమా సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎంపికైంది. వెంకటేష్ కెరీర్ లోనే అత్యధికంగా వసూల్లు సాధించిన చిత్రమిది. వెంకటేష్ సరసన ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్ లుగా నటించిన ఈ సినిమాను అనిల్ రావిపూడి తెరకెక్కించారు. దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రం పనోరమా కు ఎంపిక కావడం సంతోషించదగ్గ పరిణామమని నిర్మాతలు తెలిపారు. సంక్రాంతికి వస్తున్నాము పేరుతో 2026 సంక్రాంతికి ఈ ఇసినిమా విడుదల ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.











## 'సుప్రీం' విచారణ

(3వ పేజీ తరువాయి)

ప్రారంభమైనందున ఈ విషయం అత్యవసరం' అని ప్రశాంత్‌భూషణ్ చెప్పారు. బిహార్‌లో ప్రత్యేక ముమ్మర సవరణ కసరత్తు నిర్వహించాలనే ఎన్నికల సంఘం నిర్ణయం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇప్పటికే విచారిస్తోంది.అక్టోబరు 16న బిహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 'ఖచ్చితమైనది' అని ఎన్నికల సంఘం పేర్కొంది. పిటిషనర్ రాజకీయ పార్టీలు, ఎన్‌జిఒలు ఈ ప్రక్రియను అప్రతిష్ట పాలు చేయడానకి తప్పుడు ఆరోపణలు చేయడంతోనే సంతృప్తి చెందుతున్నాయని సుప్రీంకోర్టు తెలిపింది. తుది ఓటర్ల జాబితా ప్రచురింపబడినప్పటి నుండి పేరు తొలగింపునకు వ్యతిరేకంగా ఏ ఓటరు కూడా ఒక్క అప్పీల్ కూడా దాఖలు చేయలేదని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. నెలల తరబడి జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత తయారుచేసిన రాష్ట్ర తుది ఓటర్ల జాబితా నుంచి 'ముస్లిములను అసమానంగా మినహాయించారు' అని పిటిషనర్లు చేసిన ఆరోపణలను కోర్టు తప్పు పట్టింది.సెప్టెంబరు 30న ఎన్నికలు జరుగనున్న బిహార్ తుది ఓటర్ల జాబితాను ప్రచురించిన ఎన్నికల సంఘం ప్రత్యేక ముమ్మర సవరణకు ముందు 7.89 కోట్లుగా ఉన్న తుది ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య దాదాపు 47లక్షలు తగ్గి 7.42 కోట్లకు చేరుకుందని తెలిపింది.అయితే తుది సంఖ్య 7.24 లక్షల నుండి 17.87 లక్షలకు పెరిగింది. ఆగస్టు 1న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో కోటి మంది ఓటర్ల పేర్లు ఉన్నాయి. ఇది మరణాలు, వలసలు, నకిలీ ఓటరుల సహా వివిధ కారణాల వల్ల 65లక్షల మంది ఓటర్లను అసలు జాబితా నుండి తొలగించింది. ముసాయిదా జాబితాలో 21.53 లక్షల మంది కొత్త ఓటర్లు చేరగా, 3.66లక్షల మంది పేర్లు తొలగించబడ్డాయి. ఫలితంగా, నికరంగా 17.87 లక్షల మంది ఓటర్లు పెరిగారు. బిహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు గాను 121 స్థానాలకు గురువారం బిహార్‌లో తొలిదశ ఎన్నికలు పూర్తిఅయ్యాయి. మిగతా 122 స్థానాలకు నవంబరు 11న ఎన్నికలు జరుగనున్నాయి. ఓట్ల లెక్కింపు నవంబరు 14న జరుగనుంది.






## న్యాయం, మార్పు సందేశం పంపేందుకే...

### అఖిలేశ్‌తో భేటీపై ఆజం ఖాన్

**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు ఆజం ఖాన్ శుక్రవారం లక్నోలో అఖిలేశ్ యాదవ్‌ను కలిశారు. పార్టీ అధ్యక్షుడితో తన సమావేశం ఉత్తరప్రదేశ్‌లో స్థితిస్థాపకత, న్యాయం, రాజకీయ మార్పు ఆవశ్యకత సందేశాన్ని తెలియజేయడానికి ఉద్దేశించిందని తెలిపారు. అనంతరం ఖాన్ తన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్లా ఆజమ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ 'మేము ఎదుర్కొన్న అణచివేత, చారిత్రక అన్యాయం ఉన్నప్పటికీ రాతి లేదా పర్వతం కంటే ఓర్పు బలంగా ఉన్న వ్యక్తులు ఇప్పటికీ ఉన్నారని చూపించడమే మా సమావేశం నిజమైన ఉద్దేశం' అని అన్నారు. 'మా వారు చాలా మంది ఇప్పటికీ జైలులో ఉన్నారు. మేము కలిసినప్పుడు ఆ బాధాకరమైన సమయాలను ఒకరినొకరు గుర్తు చేసుకుంటాము. తద్వారా భవిష్యత్ తరాలు అలాంటి అన్యాయం ఒకప్పుడు జరిగిందని గుర్తుంచుకుంటాయి' అని తెలిపారు. భూ కబ్జా, బెదిరింపులు సహా బహుళ ఆరోపణలపై దాదాపు రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించిన తర్వాత ఇటీవల విడుదలయిన సీనియర్ ఎస్పీ నాయకుడు.. 'అవగాహన మార్పు'గా అభివర్ణించినందుకు మీడియా వర్గాలకు కతజ్ఞతలు తెలిపారు. 'ఒకప్పుడు నన్ను తప్పుగా అర్థం చేసుకున్న వారు ఇప్పుడు మాకు చాలా అన్యాయం జరిగిందని గ్రహించినట్లు కనిపిస్తోంది' అని అన్నారు. ఆజం ఖాన్ తన నివాసం, రాంపూర్‌లోని జౌహర్ విశ్వవిద్యాలయంలో ఆదాయపు పన్ను దాడులను గుర్తుచేసుకుంటూ, 'ఏ మంచి వ్యక్తి అయినా సిగ్గుతో తల వంచుకునేలా చేసే పదాలను అధికారులు ఉపయోగించారు' అని తెలిపారు. 'దర్యాప్తు సంస్థల దుర్వినియోగం మళ్లీ జరగకూడదు. రాజకీయ వ్యవస్థ మెరుగుపడి, నిజంగా ఏమి జరుగుతుందో ప్రజలు అర్థం చేసుకునే వరకు అన్యాయం కొనసాగుతుంది.











Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com